
కథావాహిని

అమరావతిలో అస్థికలు

డా. జంధ్యాల కనకదుర్గ



జంకదు ప్రచురణలు

అమరావతిలో అస్థికలు

(కథావాహిని)

జంధ్యాల కనకదుర్గ

జంకదు ప్రచురణలు

అమరావతిలో అస్థికలు

(కథావాహిని)

అమరావతిలో అస్థికలు

(కథావాహిని)

జంధ్యాల కనకదుర్గ

ప్రథమ ముద్రణ : ఏప్రియల్ 2026

జంకదు ప్రచురణలు

ప్రతులు : 500

ISBN Number : 978-93-5916-025-2

ప్రతులకు చిరునామా :
డా.జె.కనకదుర్గ
ఇం.నెం.5-35-18 3వ లైను,
17-18 అడ్డరోడ్డు, బ్రాడీపేట
గుంటూరు-2
ఫోను : 94911 40299

ముద్రణ :

శ్రీ శ్రీ ప్రింటర్సు, విజయవాడ

srisriprinters.vja@gmail.com

ఫోన్ : 94906 34849

ధర : రూ. 50 /-

అంకితం

మా తల్లిదండ్రులైన



కీ.శే. శ్రీ జంధ్యాల కుమారస్వామి, లక్ష్మీప్రసన్నమ్మల ఆశీస్సులతో

ఈ అమరావతిలోని కృష్ణమ్మలోనే
సంచయనం కాబడ్డ
మీ ఇద్దరి దివ్యమైన అస్థికలు
ఈ కథల వ్యథలకు
స్పందిస్తాయని అంజలి ఘటిస్తూ

– జె. కనకదుర్గ (జంకదు)

జీవనసత్యాలు....



పి.సత్యవతి

జంధ్యాల కనకదుర్గ గారు పరిశోధకురాలుగా సుప్రసిద్ధులు. ఆవిడ వ్రాసిన "స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి" అనే పరిశోధనా గ్రంథం 1900 నుండి 1947 వరకు తెలుగులో స్త్రీల సాహిత్యాన్ని విపులంగా చర్చించింది. పరిశోధకులకు సాహిత్య విద్యార్థులకు ఉపయుక్తమైనది. సింగరేణి గని కార్మిక జీవితం తప్పక చదవవలసిన పుస్తకం. ఇప్పుడు కనకదుర్గ గారు తన చూపును కాల్పనిక సాహిత్యం వైపు మరలించి ఒక కొత్త శిల్పంతో "అమరావతిలో అస్థికలు" అనే ఈ కథా వాహినిని ప్రచురిస్తున్నారు.

చనిపోయిన వారి అస్థికలు నదులలో నిమజ్జనం చెయ్యడం ఒక సంప్రదాయం. కనకదుర్గ గారు ఈ రచనలో కొన్ని వైజ్ఞానిక విషయాలు కూడా చెప్పారు. మన అస్థికలకు DNA కి వున్న సంబంధాన్ని కూడా వివరించారు.

ఒక శాస్త్రవేత్త ఈ విషయం మీద పరిశోధన కోసం కొన్ని అస్థికలలో చిప్స్ అమరుస్తాడు. ఆ క్రమంలో అతను కూడా నదిలో మునిగి చనిపోతాడు.

పున్నయ్య అనే ఒక బెస్తవాడు తన రోజువారీ చేపల వేటకు అమరావతి లోని కృష్ణ లో వల విసురుతాడు. ఆవల చాలా బరువెక్కి దాన్ని బయటకు లాగలేక పోతాడు. నదిలో దిగి చూస్తే వల నిండా అస్థికలు వుంటాయి. అస్థికలు ఒక్కొక్కటి అతనికి తమ కథలు చెబుతాయి.

ఈ కథలన్నీ ప్రస్తుతపు వ్యథలే. ప్రేమ లో మోసాలు, పరువు హత్యలు, మిత్రద్రోహాలు, నయవంచనలు, రాజకీయ నాయకుల కపట వాగ్దానాలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వలన వ్యసనాలకు బానిసలయే యువత : ఇలా ప్రతి కథా ఒక వ్యథ. చివరికి జీవచ్ఛవాలుగా మారుతున్న రైతులు. కూలీల కథలు కూడా వింటాడు పున్నయ్య. వినీ, చూసీ చూడనట్టు వుండలేడు. సమాజం మారాలంటే సామూహిక కృషి వుండాలని తన వారిని కూడగడతాడు. కర్తవ్యం బోధిస్తాడు. ఒక ఆశావహ దృక్పథంతో పుస్తకం ముగుస్తుంది. ఆశలేనిదే జీవితం లేదు సమాజపు మనుగడ సాధ్యం కాదు. అస్థికలు చెప్పిన చాలా కథలు విషాదాంతాలు. అందుకు ప్రతిగా మంచి ముగింపు ఇచ్చారు కనకదుర్గ గారు. ఆమెకు అభినందనలు.

– పి.సత్యవతి

అస్థికలకి వినతి



వివిన మూర్తి

కనకదుర్గగారు మిమ్మల్ని సృజించారో, పోగుచేసారో నాకు తెలీదు. ఏమైనా ఆవిడ ద్వారానే మీరు నాముందున్నారు. మీరు పున్నయ్యకి మీ కథలు చెప్పుకొన్నారు. అవి కూడా భాషలేని హృదయసంపర్కంతో, స్పందనలతో కనెక్ట్ కావచ్చుని, ఒక సైంటిస్టు ఆలోచించి మీకు కృత్రిమమేధను అమర్చాడు. ఆ మేధకి ఉన్న ఇన్ పుట్ మీరు సజీవంగా ఉన్నప్పుడు జీవించిన జీవితం. ఆ జీవితం మీకు కలిగించిన నొప్పి. ఆ నొప్పికి కారణం ఏమిటి? కారణం ఉందా?

కనకదుర్గగారు పడిన నొప్పి అది.

చుట్టూ ఉన్న సమాజంలోని ఘటనలు ఆమెని నొప్పించాయి.

ఆ నొప్పిని ఆమె అనుభవించారు.

మీకు నోరు ఇవ్వటానికి ప్రయత్నించారు.

మీ నొప్పిని చెప్పుకునే వీలును ఇచ్చారు.

దానికి ఆవిడ ముందు అనేక మార్గాలు ఉన్నాయి.

ఆమెకు ముందు బొమ్మలు చెప్పిన కథలు ఉన్నాయి.

చనిపోయినవాళ్ళు చెప్పే కథలున్నాయి. వాళ్ళ ఫిర్యాదులు ఉన్నాయి. తమ నొప్పికి వారు ఎవరిని బాధ్యులు చేసారో, చేయకపోతే లేకపోతే బాధ్యులు అనుకొన్నారో చెప్పుకొన్నారు. ఆ ఫిర్యాదులు పాఠకులుగా మనకి కలిగించే ఎరుక ఉంది. ఊరికినే 'అయ్యోపాపం' అనేసి, కళ్ళు తుడుచుకొని వెళ్ళిపోయి ఏ సిగిరెట్టో కాల్చుకుంటూ శూన్యంలోకి దృక్కులు బరపటంలో పాఠకులుగా మనం చేయి దులుపేసుకున్నాం లోగడ.

విషయం తెలిసిన రచయిత్రి అమాయకమైన గొంతుతో తనూ, తను సేకరించిన అస్థికలూ ఉత్తి కథనే చెప్పడంతో ఆగలేదు.

కారణాన్వేషణ చేసాయి అస్థికలు. వాటికి కారణాన్వేషణ చేసాడు పున్నయ్య అనే సహజ

మానవుడు. అన్నింటికీ కారణాన్వేషణ చేసి రచయిత్రి తనకు తెలిసిన కారణాలు చెప్పారు. లేదా తను చూడగలిగిన కారణాలు చెప్పారు.

అవ్వేనా కారణాలు ?

నిజమే ఆ ప్రశ్న కలగవచ్చు

అస్థికల కథలు విన్న పున్నయ్య స్పందన 'అయ్యయ్యో' తో ఆగిపోలేదు.

అతను సమూహ కార్యాచరణ వైపు కదిలాడు.

'కథానిర్మాణం ఆ కదలికని సంబద్ధం, సహేతుకం చేసిందా' అని కథా వ్యాకరణ పండితుడు శంకించితే, శంకించనూవచ్చు. 'కథ కలిగించవలసిన స్పందనకి, మనసునీ, బుద్ధినీ, సంసిద్ధం చేయడమే కథావిజయం' అని ఆ పండితుడు నిర్వచించవచ్చు.

ఆ నిర్వచనం తెలిసి కథ చదవం కదా ?

కథ చదవకముందు మరోటిగా మనకు కొన్ని విశ్వాసాలు కర్మ, దైవం, విధి వంటివి ఉండవచ్చు కదా ! అయినా ఆ విశ్వాసాల కూసాలు కదిలించటానికి కూడా కనకదుర్గమ్మ ప్రయత్నించారు. దీనికి మనుషులే కారణం అనిపించగలిగారు. ఆ మనుషుల వెనక కారణాలకు మనం నడవాలని కూడా ఆవిడ ప్రయత్నించారు.

ఆవిడ సృష్టించిన పున్నయ్యా, సరికొత్తగా కథ చెప్పటానికి ఆమె సృష్టించిన సైంటిస్టూ, వాళ్ళ ప్రయత్నం వాళ్ళు చేసారు.

మరి మన ప్రయత్నం?

విశ్వాసాలతో వాళ్ళు ఆగిపోలేదు. దైవాన్ని నమ్ముకొనే సాధారణ సహజ అస్తిత్వం కూడా ఈ అస్థికల ముందు తన పద్ధతిలో తను కార్యాచరణకి సుముఖుడవుతాడు. సమూహంలో వ్యక్తిగానే పరిష్కారం సాధ్యమనీ ఆ వ్యక్తి దైవవిశ్వాసానికీ దానికి సంబంధం లేదనీ కనకదుర్గ గారు తేల్చారు. కనీసం నాకు అలా అనిపించింది.

మరి మీకు? చదవండి. మనసు తెరుచుకోండి. నలుగురి మనసులతో కలబోసుకోవటానికి ప్రయత్నించండి అప్పుడు మీకు ఈ ప్రయత్నం చేసిన దుర్గగారి జీవితానుభవం ఆవిడ కల్పనాసాహిత్యమార్గంలో వేసిన తొలి అడుగుకీ మీరు స్పందిస్తారనే నా ఆశ.

28-04-2026 **– వివిన మూర్తి**



నా మాట...

జంధ్యాల కనకదుర్గ

ఈ కథారచయిత్రికి తాను ఇంతవరకు విమర్శనారంగంలో కృతకృత్యురాలైనా ఏదో లుప్తత మనసులో ఉండేది. నేటి కాలంతో పరుగులు పెట్టాలంటే సృజనాత్మకత అవసరమనిపించింది. వ్యవస్థలు సరిగా పనిచేయనప్పుడు రచయితలు తమ కలాలకు పదునుపెట్టటం సహజం. సమాజం సమస్యలవలయంలో చిక్కుకున్నపుడు రచయితలు కాకపోయినా వాటికి పరిష్కారంగా తామేదన్నా చేయాలి అనే ప్రేరణ కలుగుతుంది. తాము కొద్దోగొప్పో ఆర్థిక సహకారాన్ని అందించినా అది సముద్రంలో నీటిబిందువే అవుతుంది. యువతను వెన్నుతట్టగలిగితే వారిలోని సమాజాసక్తులు వారి శక్తిని, యుక్తిని ప్రోత్సహిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది. పెద్దలు యువతకు సరైనత్రోవను చూపించటానికి తమ సృజనాత్మకతను వినియేగించాలనే సంకల్పం వారికి కలగుతుంది. ఆ క్రమంలో చేపట్టిన రచనలే 'అమరావతిలో అస్థికలు' అనే ఈ కథాస్రవంతి అని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్‌కి అమరావతిని రాజధానిగా నిర్ధారించినప్పటినుండి ఉద్యోగానంతరం గుంటూరులో స్థిరనివాసం ఏర్పరుచుకొన్న నా దృష్టి అమరావతికి సంబంధించిన సాహిత్య పఠనంవైపు మరలింది. అమరావతి ఆంధ్రసామ్రాజ్యానికి ధాన్యకటకంగా పాడిపంటలు వాణిజ్య వ్యాపారాలకు చారిత్రక నెలవుగా వినుతికెక్కింది. గాథాసప్తశతి గ్రంథ రచనల నుండి నేటివరకు సృజనకారులు అమరావతిచుట్టూ తమ రచనల పాలవెల్లులను కట్టారు. క్రీస్తుశకారంభ గాథలలో కొంత శృంగారదృక్కోణాన్ని జొప్పించినా అంతర్గతంగా మానవజీవన ప్రస్థానాలలో విషాదఛాయలు చోటుచేసుకొన్నాయి. గతానుభవాలను పునాదులుగా చేసుకొని మానవాభివృద్ధికోసం మార్పులు–చేర్పులతో పటిష్ఠ ప్రణాళికల సోపానాలను నిర్మించుకోవాలంటే రాజకీయరహితంగా విచక్షణతో ముందుకుసాగాలి. ప్రభుత్వాలలో ప్రజలే న్యాయనిర్ణేతలు. వారి శ్రేయస్సుకోసం వారే కర్తవ్యోన్ముఖులు

కావాలి. దానికి సాహిత్యం చేదోడువాదోడుగా ఉంటుంది. అలాంటి సాహిత్యమే కదిలేది ప్రజలను కదిలించేది కూడా.

అమరావతి నేటి రాజధానియేకాదు. కృష్ణానది ప్రవాహఝరులతో పునీతమైన ప్రజాదర్బారు. భక్తులపాలిటి ఆధ్యాత్మిక ఆనంద హేల. పాడిపంటలకు నెలవు. కష్టజీవుల కడుపు నింపటమే కాక కృష్ణమ్మ తల్లి వారిని కడకు తన కడుపులో దాచుకొనే పావనపరమావధి. అందుకే అస్థికలను సంచయనంచేసి కృష్ణమ్మలో కలపి పునీతం చేయటం సంస్కృతిగా స్థిరపడింది. అయితే ఆ అస్థికలలో వారి వారి జీవరహస్యాలు నిక్షిప్తమయి ఉంటాయని శాస్త్రీయపరిజ్ఞానం చెబుతోంది. ఆ క్రమంలోనే వారి జీవితచరిత్రలను సామాజికదృక్కోణం నుండి ఊహామాత్రంగా తెలుసుకోగలిగితే నేటి ప్రజావళిని కర్తవ్యోన్ముఖులను చేయగలిగే చైతన్యాన్ని ఇవ్వగలుగుతుందనే స్పృహ రచయిత్రిని ఒక్కొక్క అస్థిక గురించిన భావనా ప్రపంచంలోకి అడుగుపెట్టేటట్టు చేసింది. ఇంతవరకు అస్థికలలో దాగున్న జీవనరహస్యాలను తెలుసుకోవటం శాస్త్రజ్ఞులకే పెనుసవాలుగా మారింది. అయితే నేటి కృత్రిమమేధ ఆ సవాలును స్వీకరించగలుగుతుందనే నమ్మకంతోనే ఈ కథాసంపుటి ఒడ్డుకు చేరింది. ఎవరినీ నొప్పించాలనే ఆలోచన రచయితకు లేదని విన్నవించుకుంటూ, రచయిత్రితో పాఠకులు హృదయసంవాదం చేయగలరని ఆశిస్తూ...

కథా రచనలో తొలి అడుగులు వేస్తున్న నన్ను ముందుకు నడిపించే విధంగా ప్రోత్సహిస్తూ ముందుమాటలు వ్రాసిన ప్రసిద్ధ కథా రచయిత్రి కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి గ్రహీత శ్రీమతి పి.సత్యవతి గారికి ఆత్మీయ కృతజ్ఞతాభివందనాలు, అడగగానే తీరిక చేసుకుని పాఠక చైతన్యాన్ని కలిగిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన ప్రసిద్ధ కథకులైన విహారి గారికి గౌరవ పూర్వక కృతజ్ఞతాభివందనాలు. పుస్తకపు ముఖ చిత్రాన్ని డిజైన్ చేసిన చంద్రమోహన్ గారికి, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు గారికి నా కృతజ్ఞతలు. నా రచనా వ్యాసంగానికి సహకరించిన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు.

మీ ప్రోత్సాహిక / ఔత్సాహిక రచయిత్రి

– జంధ్యాల కనకదుర్గ (జంకదు)

అమరావతిలో అస్థికలు

"ఒసేవ్ ! ఒడ్డుకెడుతున్నా, తొరగా వెళ్ళకపోతే అందరూ వెళ్ళిపోతారు. ఈ వాన తుఫానుగా మారకమునుపే వెళ్ళి వల వేయకపోతే చేపలెలా పట్టాలి. అవే కదా మనకు అన్నంపెట్టేవి" భార్యకు వినపడేలా కేకపెట్టి పున్నయ్య అమరావతిలోని కృష్ణ ఒడ్డుకు చేరుకొన్నాడు.

పున్నయ్య వెళ్ళేసరికి తోటి బెస్తవాళ్ళు తలా ఒక పడవలో బయలుదేరారు. పున్నయ్య తన పడవలో నది మధ్యకి చేరి వలను విసిరాడు. నదిలో చేపలు ఎగిరెగిరి పడుతున్నాయి. పున్నయ్య తనకీ రోజు పండగే అనుకొన్నాడు. వలదేనికో పట్టినట్లున్నది. బరువెక్కుతోందనిపించింది. నదిలోపల ఏదైనా మొసలిలాంటిదేమైనా పట్టుకుందేమో అని లోపలికి వెళ్ళి చూద్దామనుకొన్నాడు. తనకి ఈత వచ్చు కాబట్టి తన పడవను దగ్గరలోనే ఉన్న మరొక పడవ నడుపుతున్న బావమరిదికి అప్పగించి నదిలోకి దూకాడు. తన వల దేనికి చిక్కుకున్నదా అని చేతులు సాచుతూ తడుముకుంటుంటే గట్టిగా ఒక దిబ్బలాంటిదేదో తగిలింది.

వలచిల్లులలో చిక్కుకున్న ఎముకల గుట్ట అది అని పున్నయ్య గుర్తించటానికి ఎంతో సేపు పట్టలేదు. ముందుగా ఆశ్చర్యపోయాడు. తన వలను తీసుకెళ్ళాలంటే ముందుగా వలలో చిక్కుకున్న ఎముకలను పైకి తీయాలనుకొని ఒక్కొక్కటిగా లాగబోయాడు. బలిష్ఠుడైనప్పటికీ పున్నయ్య పీకలేకపోయాడు. ఆ ఎముక మరింతగా బరువైనట్టుగా అనిపించింది. పున్నయ్య మరింత పట్టుదలతో గట్టిగా లాగబోయాడు. 'దీనమ్మ. ఇది ఇంత బరువేంది' అని అనుకుంటుంటే ఆ ఎముక పెళపెళమని చుట్టూ ఉన్న నీళ్ళు చప్పుడుచేస్తూ "ఓ బెస్తస్నేస్తమా !" అని తనని ఎవరో పిలిచినట్టనిపించింది. నదిలోపల ఎవరన్నా చిక్కుకున్నారా? అని కలయజూసాడు.

మొదటి అస్థిక కథ

"ఏంటి నువ్వు మత్స్యకారుడివి అని నాకు ఎలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా? మీరు తప్ప ఇంతలోతుకి మరొకరు రాలేరు". పున్నయ్య తన చెవులను మరింత దగ్గరకు చేర్చి వింటుంటే గలగలమంటున్న స్వరాలు వినపడ్డాయి.

"నేస్తమా ! నువ్వు మానవ మాత్రుడివి. రెండు నిమిషాలకంటే ఎంతోసేపు నీటి అడుగున ఉండలేవు. అన్ని ఎముకలను ఒక్కసారిగా పైకి తీసుకొని వెళ్ళలేవు కాని, ఒక్కొక్కటిగా ఎముకలను నీటిపైకి తీసుకెళ్ళు. చివరికి నీ వలను తీసుకెళ్ళగలవు" అనే శబ్దాలు అస్పష్టంగా వినపడినట్టయింది పున్నయ్యకు. ఆ మాటలు కృష్ణమ్మే చెప్పినట్టనిపించి పున్నయ్య ఒక ఎముకను బలంగా లాగాడు. ఆ ఎముకలో జీవత్వం వచ్చినట్టుగా కాస్త తేలికగా అనిపించింది.

నీళ్ళల్లో ఎంతోసేపు ఉండలేక ఆ ఎముకతో సహా నీటిపైకి వచ్చిన పున్నయ్య ఆ ఎముక ఎవరిదో అని విసిరేయబోయాడు. చేతిలో ఉన్న ఆ ఎముక "నేస్తమా ! అలిసిపోయావు. కాసేపు ఈ ఒడ్డుదగ్గర కూర్చో. ఈ ఎముక ఎవరిదో నీకు తెలుస్తుంది" ఒక ట్రాన్సిస్టరు వినిపించినట్లుగా అనిపించి పున్నయ్య దానివేపు వింతగా చూసాడు.

ఆశ్చర్యపోతున్న పున్నయ్యతో "నేనొక సైంటిస్టు అస్తిపంజరపు ముక్కను. మనిషి చనిపోయిన తరువాత రెండవరోజు ఆ మనిషి యొక్క అస్థికలను నదిలో కలపుతారనేది నీకు తెలిసే ఉంటుంది కదా. ప్రతి ఎముకలో జ్ఞాపకాల దొంతరులు ఉంటాయి. ఈ ఎముకలలో దాగి ఉన్న మనిషి యొక్క జన్మరహస్యాలను తెలుసుకోవటం కోసం కొన్ని ఎముకలను తీసుకెళ్ళటానికని నదిలోకి దూకాను. నాకు ఈతవచ్చులే."

'మనిషట. బొక్కలతో చెలగాటం అట. ఇదేదో వింతగా ఉంది'. పున్నయ్య బిత్తరపోయాడు.

"ముందుగా కొన్ని ఎముకలను బయటకు తెచ్చి వాటిమీద క్యాప్స్యూల్ గా ఉండే వాటిలోపల కండక్టర్లు గల క్వాంటమ్ చిప్స్ పెట్టి కొంత సమాచారాన్ని సేకరించాను. కాని కొన్ని ఎముకలు బాగా లోతుకి చొచ్చుకొనిపోవటంతో నేను పైకి రాలేకపోయాను. నేను వచ్చినందుకు చచ్చిపోయి, ఆ ఎముకలగుట్టలో ఒక ఎముకలా పడి ఉండాల్సి వచ్చింది. నీకు వినిపించేది నీళ్ళల్లోని నా జీన్సు నుండి వచ్చే శబ్దాలే మిత్రమా !" ...

ఆ నీటిశబ్దాలలో నుండి పున్నయ్యకు తనతో ఎవరో మాట్లాడుతున్నట్టే అనిపించింది. నిజమే తాను చదువుకున్న తరగతి పాఠాలలో ఆనువంశికంగా వచ్చేవి జీన్స్ అని, డి ఎన్ ఎ అంటారనే విషయాలేవో లీలగా మదిలో మెదిలాయి. అవి ఎముకలలో ఉంటాయని సైన్సు మాస్టారు చెప్పిన మాటలు గుర్తుకువచ్చి కాసేపు తలను తడుముకొన్నాడు. ఆ ఎముకమీద నమ్మకం ఏర్పడింది. ఎముకలో ఉన్న నీటి తడి బయట గాలితో కలిసి సయ్యాటలాడుతున్న శబ్దాలు వినపడ్డాయి పున్నయ్యకు.

అదిరిపడ్డ పున్నయ్య అసలు ఈ ఎముకలు ఏంటి, వాటి భావాలు నాకు, నామాటలు వాటికి ఎలా తెలుస్తాయి.? అంతా విచిత్రం అనుకొన్నాడు.

"మిత్రమా ! నీ సందేహం నాకు అర్థమయింది. అదే నేను చేసిన పరిశోధన. శరీరం లేకుండా ఎలా అనేదే కదా నీ సందేహం. నీ మనసు నాకర్థమైంది. ఈ ఎముకలలో వారి జన్మాంతర్గత అనుభవాలు, వారివారి ఆనువంశిక లక్షణాలు ఎముకలలో గూడుకట్టుకొని ఉంటాయి. ఇందాక చెప్పాను కదా చిప్స్ పెట్టానని. అవి ఎ ఐ తో పనిచేస్తాయి. అంటే అవి కృత్రిమమేధ అనే సాంకేతికశక్తి కలవి. నీ మనసు లోని భావాలు నాకు, నా భావాలు నీకు అర్థం అయ్యేవిధంగా ధ్వనులను పుట్టిస్తాయి. అవి ఎన్ కోడింగ్, డికోడింగ్ అనే సాంకేతిక ప్రక్రియవల్ల అర్థమవుతాయి. ఆ ధ్వనితరంగాలు మనిషి యొక్క చెవికి చేరినప్పుడు మానవ మెదడు గ్రహించి ఆ శబ్దాలను తన భాషలోకి మార్చుకుంటుంది."

"ఈ సామి నాకు సరిగా అర్థమయ్యేటట్టు చెప్పితే బాగుండు". పున్నయ్య మనసు తికమక పడుతుంటే మళ్లీ ఏవో శబ్దాలు వినిపించినట్టయింది.

"మానవా ! విషయం కాస్త వంటబడితే అదే అర్థమవుతుందిలే.".. మళ్ళీ ఆ ఎముకల నుండి శబ్దాలు వినపడ్డట్టు అనిపించింది పున్నయ్యకు. "ఎముకలు నీళ్ళల్లో ఉన్నప్పటికీ ఎ ఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ / కృత్రిమమేధ) గల చిప్పులలోని నానోపార్టికల్స్ క్వాంటమ్ అనే సాంకేతికతతో పనిచేస్తాయి. ఎముకలోని డి.ఎన్.ఎ. లో దాగున్న సమాచారం ధ్వనుల రూపంగా మారి, నీటితరంగాలలో కలిసిపోయి ఉంటుంది. బయటకు తీసినప్పుడు ఆ ఎముకల నుండి వచ్చే ఆ ధ్వనితరంగాలు గాలిలో ప్రవేశిస్తాయి. అప్పుడే మనిషి బతికున్నప్పుడైనా, చచ్చిపోయి అస్థిపంజరమైనా వారి భావాలను తెలిసికోవచ్చు. దాని పరిశోధనకోసమే నేను బతికి ఉన్నప్పుడు ఈ ఎముకలను అన్నింటినీ ఒక గుట్టగా ఇసుకలో పోగుచేసి పరిశోధన చేసాను..."

'నీళ్ళల్లో ఉంటాయికదా ! ధ్వనులు ఎలా తెలియజేస్తాయి' పున్నయ్య మనసుకు నమ్మకం కుదరలేదు.

"భూమి మీద నీళ్ళు ఉంటాయి కదా. ఆ నీళ్ళ కింద ఉన్న ఇసుకను అంటిపెట్టుకుని కొన్ని ఇనుప రేణువులు కూడా ఉంటాయి. వాటికి ఉండే ఆకర్షణ శక్తితో అయస్కాంత వలయాలు ఏర్పడతాయి. ముఖ్యంగా ఎముకలైతే ఇసుకను పెనవేసుకుంటాయి. దాని చుట్టూరా ఉన్న విద్యుత్తు అయస్కాంత క్షేత్రంలో స్వల్పమైన విద్యుత్తు తరంగాలు ఏర్పడతాయి. అంటే కరెంటు లాంటివి.

అవి కనపడకపోయినా ధ్వని తరంగాలుగా మారి నీ చెవిని చేరినప్పుడు మాటలు నీకు అర్థం అవుతాయి".

"సరే మరి నా మనసులోని భావం తలతోకలేని ఈ సైంటిస్టు ఎముకకు ఎలా తెలుస్తోందో" పున్నయ్యకు మళ్ళీ సందేహం.

ఆతని భావాలను గ్రహించిన ఆ సైంటిస్టు ఎముక "ఇందాక చెప్పానే డి ఎన్.ఎ ఎముకలలో ఉంటుంది. అలాగే నీలో కూడా డి.ఎన్.ఎ ఉండటంతో వాటి మధ్యన పరస్పరం ఆకర్షణ ఉంటుంది. మనిషి శరీరం లోపల, బయటా కూడా ఆవరించి ఉన్న విద్యుత్తు అయస్కాంతక్షేత్ర శక్తి వల్ల నీ మెదడులోనివి, నరాల లోనివి భావాలను నీ చర్మం ద్వారాను తెలుసుకోగల సాంకేతికతను ఈ అస్థికలలోని చిప్పులో అమర్చి పెట్టాను. అలాగే నీ చేతిలో ఉన్న ఈ ఎముకలోని ఆ సాంకేతికత భావాలను నీ చర్మం ద్వారా గ్రహించి అది డికోడింగ్ చేసుకొని అర్థం చేసుకుంటుంది. అందుకే నాభావాలు నీకు, నీభావాలు నాకు అర్థమౌతాయి. భాషలేకపోయినా మనం మాట్లాడుకున్నట్టే అనిపిస్తుంది. పరిశోధనకై దూకినప్పుడు నేను చనిపోకముందే నీళ్ళల్లో ఉన్నవాటిని బయటకు తీసి ప్రయోగం చేసేటప్పుడే ప్రతి ఎముకమీద అటువంటి చిప్పులను నీళ్ళల్లో తడవకుండా క్యాప్సూలలో అతక పెట్టి వాటిని ఒక గుట్టగా చేసానులే. అవే ఇవి"

మొత్తంమీద పున్నయ్యకు ఆ ఎముక నుండి వస్తున్న శబ్దాలను తన మెదడు గ్రహిస్తున్నట్టు అనిపించింది. కొద్దికొద్దిగా అర్థమౌతున్నట్టనిపించింది. తన మెదడులో ఏదో అవుతోంది. ఇదేదో హిప్నాటిజం లాంటిది కాదు కదా అనుకొన్నాడు.

"ఈ సైంటిస్టు ఒకానొకప్పుడు మనిషేకదా ! ఇతని జన్మవిశేషాలు తెలుసుకోవాలి" పున్నయ్య మనసు ఉబలాటపడింది.

ఆ అస్థికని గాలి తాకినప్పుడు అది శబ్దాలు చేస్తోంది. ఇప్పుడు పున్నయ్య ఆ శబ్దాల భావాలను తెలుసుకోగలుగుతున్నాడు.

"ఓ నేస్తమా ! నీ మనసు నాకు అర్థమయింది. నా సంగతులు నీతో తెలియజేస్తేనే నీకు పూర్తిగా నమ్మకం కలుగుతుంది. ఆ రకంగా అన్నా నా బరువు తీర్చుకోవాలని ఉంది. బతికున్నప్పుడు చెప్పాలనుకొన్నా నా బాధను వినేవారు లేరు. పట్టించుకొనేవారు లేరు. అందుకే బహుశ నా విషయాలన్నీ ఇలా ఎముకలో గూడుకట్టుకొని ఉన్నాయి. మనిషి చనిపోయిన తరువాతనైనా అస్థికలకు సంతృప్తి కలగటానికే నీలాంటి వాళ్ళను ప్రకృతి ఇక్కడికి పంపించిందని అనుకుంటా".

"ఈ సామి నిజంగా ఈత రాక మునిగి పోయాడా? లేక ఆత్మహత్యచేసుకున్నాడా?" పున్నయ్యకు అనుమానం వచ్చింది.

"నువ్వు అనుకున్నదాంట్లో కొంత నిజం లేకపోలేదు. నా మనసు తెలిసిన ఈ నది నన్ను లోపలికి లాక్కొందిలే"

'అదేమిటని' ప్రశ్నార్థంకంగా మిగిలాడు పున్నయ్య.

అతని మనసును తెలుసుకొన్న ఆ సైంటిస్టు ఎముక "మిత్రమా ! నేను బతికున్నప్పుడు ఆత్మహత్య చేసుకోవాలనుకొన్న విషయం నిజమే కాని అలా చేయలేకపోయాను. సగం భయం, సగం నాలో ఉన్న పట్టుదల. పరిశోధనలు చేసి ప్రకృతి రహస్యాలను కనిపెట్టాలనుకొన్నా. చుట్టూ ఆకలికి అలమటిస్తున్న వారి కోసం ఏదో ఒకటి చెయ్యాలని ఆలోచిస్తున్న సమయంలో వ్యవసాయపు పంటలు పదింతలు పెరిగితే దేశంలో అన్నార్తులు ఉండరని భావించాను.

'ఈ బొక్కది చాలా గొప్ప ఆలోచన' – పున్నయ్య మనసులో సంతోషం ఆవరించింది.

పంటలు పండటానికి అవసరమయ్యే సూర్య కిరణాల కాంతిని పదింతలుగా శక్తిమంతంచేసి వందరెట్ల పంటను పండిస్తే తప్ప మన దేశజనాభాకు తిండి కరవు తీరదనుకొన్నా. దానికోసం పరిశోధనలు మొదలుపెట్టాను.

''ఇంతకీ ఇతని ఆలోచనలు ఫలించాయా? పెజల ఆకలి తీరుతుంది కదా'' అడగాలనిపించింది పున్నయ్యకు.

'కాసేపు నా భావాలను పంచుకోనివ్వు. అన్నీ నీకే అర్థం అవుతాయి. అటువంటి పరిశోధనల కోసం నన్ను విదేశాలవాళ్ళు కూడా ఆహ్వానించారు. కాని స్నేహితులు అనుకొన్నవారే వెన్నుపోటు పొడిచారు. నేను విదేశాలలో పరిశోధనచేసేందుకు సెలక్టు అయినా నా పై అధికారులు నన్ను పంపించకుండా ఉండేందుకు, నామీద లేనిపోనివన్నీ వాళ్ళకు నూరిపోసి తనని విదేశాలకు పంపించే ఏర్పాటుచేసుకొన్నాడు.

'అయ్యో అదేమిటి? పున్నయ్య మనసు విలవిల లాడింది.

"అధికారులకు కూడా నిజాయితీగా దేశం కోసం కష్టపడేవాళ్ళ కంటే కూడా తమకు వంగివంగి నమస్కారాలు పెడుతూ అడుగులకు మడుగులొత్తేవాళ్ళే నచ్చుతారు కదా ! నిజంగానే అప్పుడనిపించింది నన్ను వాళ్ళు అలా అశక్తుడిని చేసినప్పుడు ఈ లోకాన్నుండి వాళ్ళు కనపడనంత దూరంగా నేను వెళ్ళిపోయి చనిపోవాలనుకొన్నా".

"ఛీ..పాడులోకం" పున్నయ్య మనసు ఘోషించింది.

"కాని నా పట్టుదల నన్ను నిలబెట్టింది. అప్పుడనిపించింది మనుషులు ఎందుకు చనిపోవాలనుకొన్నారో, వారు ఎలాంటి బాధలను అనుభవించారో తెలుసుకోవాలనే జిజ్ఞాస నాలో మొదలయింది. ఆ ఉద్యోగానికి తిలోదకాలిచ్చాను. మనిషి జన్మరహస్యాలు గట్టిగా చెక్కుచెదరకుండా 700 ఏండ్లపాటు ముఖ్యంగా వారి పంటి, తొంటి ఎముకలలో డి ఎన్ ఎ రూపంలో నిక్షిప్తమయి ఉంటుందని చదువుకొన్నా. ఆ రహస్యాలను ఛేదించగలిగితే కొంత అయినా సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు కనుక్కోగలుగుతానని అనుకొని ఇక్కడికి వచ్చాను" ఎముకలోని గాలి గలగల వినపడింది పున్నయ్యకు.

ఆ శబ్దాలకున్న అర్థం తెలిసిన పున్నయ్యకు బాధ కలిగింది. అయినా మనసును కూడ కట్టుకొన్న పున్నయ్య "ఈ సామి ఎముకల కోసం స్మశానాల దగ్గరికి వెళ్ళుంటే బాగుండేది కదా ! ఇలా నదిలోని నీళ్ళల్లో పడి దిక్కులేని చావు వచ్చేది కాదు కదా !" అని మనసులో అనుకొన్నాడు.

పున్నయ్య భావాలను గ్రహించిన ఆ అస్థిక "నేస్తమా ! నువ్వుచెప్పింది నిజమే. కాని నిన్న, ఇవాళ చనిపోయిన వారి ఎముకలకు లోకంలో వారికున్న అనుబంధాన్ని వెంటనే తెంచుకోవటం కష్టం. సమాజంలో ఉన్నప్పుడు మనుషులకు కృత్రిమమైన ముసుగు తప్పనిసరి అవుతుంది. ఆ వాసనలు పోయి నిజాయితీగా తమ విషయాలు చెప్పటానికి ఆ ఎముకలకు కొంతకాలం పడుతుంది. అయినా వాళ్ళ కుటుంబీకులు ఆ ఎముకల్ని వదిలించుకోవటానికి ఎటొచ్చి పుణ్యకర్మగా నదిలోకి విసిరివేస్తారుగా."

"అవునవును. రోజూ ఈ ఒడ్డున జరిగే తతంగమేలే... మన పెద్దలు కూడా తమతో ఆత్మలు వచ్చి తమతో మాట్లాడుతాయని అంటారు. అందుకేనా !. పున్నయ్య మనసు గుర్తుచేసుకొంది.

పున్నయ్య మనసును గ్రహించిన ఆ సైంటిస్టు అస్థిక గలగలలాడే శబ్దంతో "ఆత్మలు ఉన్నాయంటూ పూర్వీకులు తమ మనోనేత్రం ద్వారా చెప్పటం అదొక ఆధ్యాత్మికమైన మత విశ్వాసం. కాని సాంకేతికతో ప్రయోగాలుచేసి నిరూపించింది ఎముకలలో చాలాకాలం పాటు చెక్కుచెదరకుండా ఉండే డి.ఎన్.ఏ అనే సైన్సు పరిజ్ఞానం."

"ఆ ఎముకలు నదిలోని ఇసుకతో పెనవేసుకొని నీటి అడుగున ఎన్నాళ్ళయినా పాడవకుండా ఉంటాయి అని చదివాను. అవి ఇసుక నీటిలో స్ఫటికమంత స్వచ్ఛంగా తయారయి, తమ గత జన్మలలోని మంచి చెడులను చెప్పగలుగుతాయనుకొని నేనిక్కడకు వచ్చాను. నేనొక ఎముకను

అయినందుకు బాధపడటంలేదు. ఇప్పుడు ఈ ఎముకలగుట్టే నా నివాసం. తోటి ఎముకలతోనే నా సావాసం, సహవాసం.”.

అంతవరకు పున్నయ్యలో ఉన్న భయం పోయి – ఈ పక్కనున్న ఎముకలను గురించి కూడా తెలుసుకుంటే ఇంకా ఎన్ని విషయాలు తెలుస్తాయో.! కాని ఎలా? కుతూహలం పెరిగింది.

“వలలోని ఎముకలన్నింటిలో చిప్పులు పెట్టానని చెప్పాగా. నా పక్కనున్న ఎముకను కాస్త కదిలించి చూడు. కడపు చించుకొని చెప్పటానికి పొట్ట ఉండదు కదా అందుకని ఎముకలోని మూలుగే నీకు తన గురించి చెబుతుంది.”.

పున్నయ్యకు అప్పుడు తెలిసింది ఆ సైంటిస్టు భాష తనకు, తన భాష ఆ ఎముకకు ఎలా అర్థమయిందో తెలిసింది. ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది పున్నయ్యకు. మనుషులనేకాదు, ఎముకలలో దాగి ఉన్న వాటి జన్మ రహస్యాలు, వారి మనసులు తెలుసుకోవాలంటే ఈ సైంటిస్టు పరిశోధనలు బాగా ఉపయోగపడతాయి. అతడు చచ్చి సాధించటమంటే ఇదే కాబోలు. శభాష్.. విజ్ఞానం అంటే ఇదే కదా ! నా కొడుకుని సైంటిస్టుగా చేస్తా. పెపంచం మాయకాదు. దాని రహస్యాలు తెలుసుకోమంటా. తనలో తనే తర్కించుకుంటున్న పున్నయ్యకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

పున్నయ్య తన చేతిలోని ఎముకను బయట విసిరేయదలచుకోలేదు. తన వలను తెచ్చుకోటం కోసం చేతిలోని ఎముకతో సహా మళ్ళీ నీళ్ళలోకి దూకాడు. వల పక్కన ఇసుకలో ఆ ఎముకను భద్రంగా ఉంచాడు. తన వలలో చిక్కుకొని పక్కనే పడున్న మరొక ఎముకను లాగాలని చెయ్యిచాచాడు. “అందరినీ మోసంచేసా. పాపపచ్చాలన ఉండదా ! నన్ను నీటి బయటకు తీసుకెళ్ళు నాయనా !..” ఆ ఎముకలోంచి గులకరాళ్ళ శబ్దాల గలగలలు వినిపించాయి. పున్నయ్య చెవిని రిక్కించి వినాలనుకొన్నాడు. కాని అక్కడ ఎంతోసేపు నిలవలేక ఆ ఎముకని ఒడ్డుకు తెచ్చాడు.

* * *

రెండవ అస్థిక కథ

నీటిపైకి వచ్చిన పున్నయ్యకు బలంగా ఉన్న ఆ అస్థిక రంధ్రాల నుంచి వచ్చివెడుతున్న శబ్దం పిలిచినట్టయి వింతగా అనిపించింది.

ఈ బొక్క ఏమి చెబుతుందో అని పున్నయ్య మనసు ఉబలాటపడింది. ఆ అస్థిక “ఓ మానవా ! నేనొక రాజకీయనాయకుడిని. శరీరం ఉన్నప్పుడు పెజల విలువ నాకు తెలిసింది కాదు. వాళ్ళను అదే పెజలను మోసం చేసినందుకు ఇక్కడ పాపపరిహారం అడగాలని కృష్ణమ్మకు

మొరపెట్టుకుంటే, ఈ నీటిమాటలు నాతో కాదు, నిన్ను ఎవరైనా పైకి లాగేటప్పుడు ఆ వ్యక్తితో నువ్వుచేసిన పాపపు పనులన్నీ ఏకరువుపెట్టు. అతని ద్వారా నీకు ఓట్లు వేసి మోసపోయిన జనాన్ని క్షమాపణలు అడుగు. అప్పుడు నీ బరువు తీరుతుంది అని నా మనసు కృష్ణమ్మరూపంలో హెచ్చరించింది.” ఇసుక లోంచి ఉబుకుతున్న నీటి గుడగుడశబ్దం పున్నయ్య మనసుకు వినిపించింది.

ఓహో.. రాజకీయనాయకుడి బొక్కా యిది ! అర్థం అయిందిలే అందుకేనా ఇంత బరువుగా ఉన్నావు. నిన్ను నా వలలో నుంచి పీకి విసిరేయాలని తెస్తుంటే నీళ్ళల్లో నేను మునిగిపోతాననే భయంవేసింది. ఇంతకీ ఏం చెప్పాలనుకొన్నావో త్వరగా చెప్పు నీ సోది. నా వల తీసుకొని నేను తొందరగా వెళ్ళాలి. ఏరోజుకారోజు చేపలుపట్టి అమ్ముకొని ఇంటికెడితేనే మా ఆకలితీరేది.. ఊఁ. చిరాకు పడింది పున్నయ్య మనసు.

“ఓ బీదమిత్రమా ! నేను శరీరంతో ఉన్నప్పుడు మీలాంటి వారిని మోసంచేసే నేను పైకివచ్చా. లచ్చలు లచ్చలు సంపాయించా. ఎన్ని తరాలవాళ్ళు తిన్నా తరగని సంపద. కాని ఏమి లాభం. నేను చస్తే నన్ను తలచుకొనే వాళ్ళు లేరని అప్పుడు ఈ ఆత్మకు తెలిసింది. ఆ ఆత్మఘోషను కాస్త వినిపించుకో. చచ్చికూడా పీక్కుతింటున్నానని అనుకొంటున్నావా ! కాదులే. నేను చేసిన అన్యాయపు పనులు నీతో చెప్పితే..”.

‘ఇప్పుడు నాతో చెప్పుకొని ఏం లాభంలే.. బతికున్నప్పుడు ఓట్లేసిన పెజల్ని ఛమాపన అడిగుంటే బాగుండేది’...మనసు కుతకుతలాడింది.

“నిజమే నీభావం. నేను ఇప్పుడు వారి దగ్గరకు వెళ్ళలేనుకదా. అందుకే నేను చేసిన పాపాలు, వాళ్ళను మోసంచేసిన పద్ధతిని నీ ద్వారా వాళ్ళకు తెలిసేలా చెయ్యాలి. అప్పుడే ప్రజలకు రాజకీయాల రంగు ముసుగులు అర్థం అవుతాయి. ఎలాంటివాడిని గెలిపిస్తే తమ జీవితాలు బాగుంటాయో తెలుసుకొనే జ్ఞానం వాళ్ళకి వస్తేనే నా పాపం కొద్దిగా తీరుతుంది”.

‘సరేలే నేను పెజలదగ్గరికి వెళ్ళి మీలాంటి నాయకుల బుద్ధిని చెబితే వాళ్ళంతా వచ్చి నిన్ను, నీ ఎముకల్ని ఉతికి ఆరేస్తారు అప్పుడే నీకు పాపపచ్ఛాలన. ఈ పాపపు బొక్కను బయటికి తీసినందుకు నాపాపం ఎలా పోగొట్టుకోవాలి రా దేవుడా !’..పున్నయ్యకు అసహ్యం కలిగింది.

“పెజలు అమాయకులు. ఎలచ్చనలప్పుడు రాజకీయనాయకులు చేప్పే మాటలన్నీ నీటిమీద రాతలని వారికి అప్పుడు తెలియదు. నాయకులు పెజల బాగోగులు పట్టించుకోకపోయినా వాళ్ళు మా మాటలగారడీలో మునిగి పోతారు.”

'ఇలాంటి నాయకుడికి ఓటువేయటమే మేము చేసే పాపం'. పున్నయ్య మనసులో అసహ్యం చోటుచేసుకొంది.

"నాలాంటివాడు ఐదేళ్ళకొకసారి గెలిచి పెజలసొమ్మును దోచినా ఎవరికీ తెలియదు. ఎందుకంటే ఎంతసొమ్ము ఖజానాలో ఉందో పెజలకు తెలిస్తే కదా. దొంగలెక్కల కాగితాల దొంతర్లు మా పాపానికి సాచ్చాలు. పెజలు అమాయకులు. ఇళ్ళు కట్టిస్తామంటే ఊహలలో ఆకాశహర్మ్యాలు కట్టుకొంటారు. కాని అవి గగనకుసుమాలని తెలిసే సరికి వాళ్ళు ఓట్లువెయ్యటం, నాయకుడు గెలిచి ఖజానాను దోచుకోవటంతో ఐదేళ్ళకాలం పూర్తవుతుంది."

'అందుకే పెజలు బీదవాళ్ళయ్యేది' పున్నయ్య మనసు ఘోషించింది.

"పప్పుబియ్యం పంచుతామంటేనే, ప్రజలు మమ్మల్ని వాళ్ళపాలిటి అవతరించిన దేవుళ్ళలాగా అనుకొంటారు. అరకొరగా యిచ్చినట్లు యిచ్చి ధరలు పెంచి వెనకాల జేబులకు చిల్లులు పెట్టే విషయాన్ని తెలుసుకోలేరు. మార్కెట్లలో ధరలను ఎంత పెంచినా మాకు బాధలేదు. ఎందుకంటే నిత్యావసర సరకులలో నాణ్యమైన వాటితో ముందుగా సముచితంగా మా యిళ్ళు నిండిపోతాయి కదా.

'ఓరి దుర్మార్గుడా !' పున్నయ్యలో కోపం కట్టలు తెంచుకుంటోంది.

"తడిపితే జేబుగుడ్డ అయ్యే చీరలను ఆడోళ్ళకు పసుపుకుంకాలంటూ పంచితే, వారంతా పుట్టింటి ముత్తైదువులుగా మాకు ఓట్ల వరాలనిస్తారు. కాని కల్తీమద్యంతో వారి పుస్తెలను పుటుక్కుమనిపించినా, కర్మకాండలకు డబ్బులిస్తామంటే ఆ దుఃఖాన్ని మరిచిపోతారు. ఇంతలో మళ్ళీ ఎలచ్చనులు వస్తాయి. నాయకులకు పండగే. గెలిచిన తరవాత ఓటర్ల బొక్కలను ఎండగట్టటమే రాజకీయ ఆనవాయితి"..

'అందుకే బొక్కల్లో బొక్కవయ్యావు. పెజలు మీ దోపిడీని బజార్లలో పెట్టటానికే ఊరేగింపులు, ధర్నాలు చేసేది'..పున్నయ్య మనసు కుతకుతలాడింది.

"అదిగో అక్కడికే వస్తున్నా. ప్రజలు రోడ్లమీదకు వచ్చి కలిసికట్టుగా ఊరేగింపుచేయాలన్నా నిరసనలు తెలపాలన్నా ప్రభుత్వ అనుమతి ఉండాలనేది రూలుకదా. ఆ వంకన వెనకాల రాజకీయం చేసి వాళ్ళకు తాయిలం ఆశపెట్టి ఆదిలోనే వారి ఉత్సాహాన్ని తగ్గించేస్తాం. కాని కొంతమంది పౌరనాయకులు మొండికేస్తే పోలీసులు లాఠీకి పనిచెప్తారు. ఉద్యమాలు చేసే మనసులే కాదు మనుషులు కూడా కొన్నాళ్ళకు కనుమరుగు అవటమే రాజకీయం".

'చేసిన పాపం ఊరికే పోతుందా అనుభవించక తప్పదులే'. పున్నయ్య వేదాంతిలా నవ్వుకొన్నాడు.

"దాని ఫలితంగానే సంపదను అనుభవించలేకపోయాననే నీతో చెప్పుకుంటున్నా. ఏడుతరాలకు సరిపోయే ఆస్తిపాస్తులను ఇచ్చినందుకు నా కొడుకులు నా అంత్యక్రియలకు సరిపోయే కట్టెలకు డబ్బులివ్వనందుకు నా శరీరం సగమే కాలి మిగిలినది కుళ్ళిపోయింది. ఆ సగం కాలిన ఎముకల్ని కృష్ణమ్మలో పడేయటమే వాళ్ళుచేసిన పుణ్యకార్యం. ".

'ఆవు కంచెనుమేస్తే దూడగట్టున ఉంటుందా !' పున్నయ్య మనసు సమాధానపడుతోంది.

"ఇప్పుడు నా మొర నీకు అర్థమయి ఉంటుంది. అసహ్యించుకొని బయటకు విసిరేయవద్దు. ఎలచ్చనలు వచ్చినప్పుడు నా పచ్చాతాపాన్ని ప్రజలకు చెప్పు. అప్పుడు ఈ అమరేశ్వరుడు తనలో నన్ను కలుపుకొంటాడేమో. నాకు ముక్తి. అంతవరకూ నా ఎముకను కృష్ణమ్మ నీళ్ళల్లోనే తిరిగిపడేస్తే రోజురోజుకు పాపాలనుండి ప్రచ్ఛాలన చెందుతా !"

ఆ ఎముక సవ్వడిలో స్వచ్ఛమైన కృష్ణమ్మ తన ఒరవడి వినిపించినట్లయింది. 'ఈ ఎముక తెలిపిన ఆతని రాజకీయ చరిత్రం, వాడి పాపపచ్ఛాలన సంగతి పెజలకు చెపితే నమ్ముతారా' సందేహంతో ఆ ఎముకను నీళ్ళల్లోకి విసిరేసి పున్నయ్య తిరిగి తన వల కోసం నీళ్ళల్లోకి దూకాడు.

పున్నయ్య మళ్ళీ తన ప్రయత్నంగా వలని లాగుతుంటే ఏడుపు వినిపించినట్టు అనిపించింది పున్నయ్యకు.

'ఇదెక్కడి గొడవరా' అని చిట్లించి చూసేసరికి వలలో చిక్కిన చేపపిల్లలాగా ఇంకొక బక్కపలచని ఎముక కదులుతుంటే జాలిపడి దాన్ని బయటకు తీద్దామా వద్దా అని సంశయిస్తుంటే ఆ ఎముకనుండి శబ్దాలు వచ్చాయి. "నీకు పున్నెం ఉంటుంది నన్ను పీకి బయటపడవేయవద్దు. నా ఘోస వింటే నీవు నన్ను నీళ్ళల్లోనే పడేస్తావులే. నా కసి తీరేంతవరకు నేను ఇక్కడే ఉంటా"..

నీటి గోసలో గలగలమంటున్న ఆ బొక్కలో ఉన్న 'కసి ఏమిటబ్బా' అనుకుంటూ పున్నయ్య అక్కడ ఎంతోసేపు నిలవలేక ఆ ఎముకను పట్టుకొని నీటిపైకి వచ్చిన పున్నయ్యకు ఇంటికెళ్ళే ఆతృత కాస్త తగ్గింది.

❊ ❊ ❊

మూడవ అస్థిక కథ

"నేనూ ఒకప్పటి నీపాటి సాటి కష్టజీవిని. నా కసిని అర్థం చేసుకోగలవు" ఆ బొక్కతొక్క తనతో మాట్లాడుతోందనిపించి, పున్నయ్య తన చెవిని బొక్క దగ్గరకు చేర్చాడు.

"నాది చేనేతలో చేయి తిరిగిన ఎముక. ఈ కృష్ణకు దగ్గర ఊరే మాది. పెళ్ళాంబిడ్డలు అందరం కష్టపడి కలో గంజో తాగి రోజులు హాయిగా వెళ్ళదీసేవాళ్ళం. విధికే కన్నుగుట్టిందేమోగాని, ఒకనాడు వీధిలో పార్టీల కార్యకర్తలమంటూ రౌడీలు వచ్చి వికటాట్టహాసం చేసారు. దానితో ఊరుకోక, అందులో ఒకడు నా కూతురిని బరబరా లాకెళ్ళాడు. ఏమిటీ దౌర్జన్యం అన్నందుకు, నీవు పతిపచ్ఛపార్టీకి ఓటువేస్తాలే అన్నావటగా. ఏం బతకాలనిలేదురా?" అని అరిచాడు.

'ఏమి దౌర్జన్యం?.. ఇంతకీ నీ కూతురిని రచ్చించుకున్నావా?' పున్నయ్య మనసు ఆత్రుత చెందింది.

"ఇంకెక్కడ నా కూతురు. నన్ను వాళ్ళు కదలనిస్తేకదా. వాళ్ళు పెచారంచేస్తున్న నాయకుడి గురించి మునుపే విని ఉన్నాం. వాడు పెజల సొమ్మును దోపిడీచేసాడని, పశ్నించిన వాడ్ని నామరూపాలు లేకుండా చేసాడనే ముద్ర ఉంది. 'నేను ఎవరికి అలాంటి హామిని ఇవ్వలేదు. ఇది ప్రజాసామ్యంకదా ఎవరు ప్రజల కష్టాలను కాస్త పట్టించుకొని ఆపదలో ఆదుకొన్నారో అటువంటివారికి వేస్తాం కాని ఈ రుబాబు ఏమిటి' అని లోపల భయంగా ఉన్న పైకి ధైర్యం తెచ్చుకొని అడిగా. అంతే. ఆ రౌడి ఇంతెత్తున లేచాడు. వాడితో పాటు వాడి అనుచరులు తల కళ్ళు ఎగరేసారు. నా ముందుకు దూసుకొని వస్తూ"..

'అమ్మో జాగ్రత్త. !' పున్నయ్య మనసు ఆందోళన చెందింది.

"ఏందిరా దారాలు అల్లుకొనే వాడివి నీకెంత ధైర్యంరా ! మేం తలచుకొంటే ఈ బట్టలన్నీ చింపి పోగులు పెట్టాం. బయటకురారా" అంటూ అక్కడే ఉన్న మగ్గానికున్న కర్రలన్నీ లాగి నా నెత్తిమీద కసితీరా బాదుతూ నన్ను రోడ్డుమీదకు లాక్కొచ్చారు. అలావాళ్లు కొడుతుంటే చుట్టూ ఉన్నవారు చోద్యం చూసినట్టు చూసారుగాని ఎవరూ ముందుకువచ్చే సాహసం చేయలేకపోయారు. కొంతసేపటికి అక్కడే నా ప్రాణాలు పైకి పోయాయి".

"అయ్యయ్యో" పున్నయ్య మనసు బాధతో మూలిగింది.

"నా ప్రాణాలుపోయినా నా మెదడు కొంతసేపు తెలివితోనే ఉంది. వాళ్ళమాటలు అర్థమౌతూనే ఉన్నాయి. వెంటనే వాళ్ళనాయకుడు వచ్చి మనిషి శివైక్యం చెందాడని, నా కుటుంబాన్ని ఆదుకుంటానని

ప్రజలముందు మొసలి కన్నీరు కార్చాడు. నాశరీరం బూడిదైనప్పటినుండి రాజకీయనాయకులమీద కసి నా మూలుగులనిండా నిండి ఉంది. అందుకే ఇందాక నువు పీకిన ఎముక రాజకీయనాయకుడిదని అర్థమై నాలో కదలికవచ్చి బాధతో గిలగిల కొట్టుకుంటున్నా".

"అయ్యో ! అదా.." పున్నయ్య మనసు బెంబేలుపడింది.

"ఆ సంఘటన నాతోనే అయిపోదు. నా తరువాత ఇంకా ఇలాంటి హత్యలు ఎన్ని జరుగుతాయో. వాడి వాగ్దానాలే వాడి కొడుకుకూ వారసత్వంగా వచ్చాయి. అతడూ వచ్చి నా శవంముందు వల్లించాడు. వాడు ప్రజల్ని పట్టించుకోలేదు. అందుకే నేను వాడి అనుచరులతో అలా అన్నా. ఈ నాయకులకు చచ్చినా పశ్చాత్తాపం ఉండదు. వీడి ఎముక ముక్కలుముక్కలు అవ్వాలి. అప్పుడే నాకూ, వాడికి ముక్తి."

ఆ బొక్కలోని మూలుగే మూలిగిందనిపించిన పున్నయ్యకు తన ప్రాణం పోతుందేమో అన్నంత భయమేసింది. గబుక్కున నీళ్ళలోకి దూకి ఆ బక్కపలచని ఎముకను ఆ రాజకీయనాయకుడు ఎముకపక్కన పడేట్టు విసిరేసాడు. పున్నయ్యకు కడుపులో ఆకలి మొదలైంది.

అంతలో "బిడ్డా ! నాగోడు పట్టించుకో. నీకు చేపల పులుసు చేసిపెడ్తా" అనే శబ్దాలు ఎముక కన్నాలలో నుండి వేణునాదంలా వినపడగా పున్నయ్య ప్రాణం లేచి వచ్చింది. నన్ను నీచేతిలోకి తీసుకో. సాహసంతో నీవు నీటిపైకి తీసుకొని వెడితే నా గుండెతడి తగ్గుతుంది. నిన్ను ఈ కిష్టమ్మ కాపాడుతుంది" ఆ ఎముక కన్నాలలోంచి రొదచేస్తూ వస్తున్న నీటి గలగలలు వినిపించాయి. ఎంతోసేపు అక్కడ ఉండలేక ఆ ఎముకను అపురూపంగా తన చేతులలోకి తీసుకొన్న పున్నయ్య తనను చుట్టుకొన్న కృష్ణమ్మతో కలిసి ఒడ్డుకు చేరాడు. ఆ ఎముకనిండా కన్నాలే. ఆ కన్నాలే బుడబుడమంటూ కష్టాల కన్నీళ్ళను కక్కాయి.

❊ ❊ ❊

నాల్గవ అస్థిక కథ

"ఓ బిడ్డా ! ఇందాక నీవు బయటకు తీసిన ఎముక ఎవరిదో కాదు. అది ఎవరిదో కాదు. నా కొడుకుదే. అది కసితో రగిలిపోతోంది. చింతచచ్చినా పులుపుచావదుగా. అలాగే మరి వాడిమీద నాకసి తీరేది ఎలా. ఆ తండ్రికి తగ్గ కొడుకు వీడు. మగవాళ్ళకేనా కసి ఉండేది.".

'అవసరమైనప్పుడు కసి అందరిలో వస్తుందిలే'.. పున్నయ్య గుండె ఆర్తితో కొట్టుకుంది.

“నీవు ఈ లోతుల్లోకి వచ్చి ఎముకగూడును కదిలించి మా గోడును వింటున్నావంటే”. నీ గుండెతడి తెలిసింది. ఈ తల్లి గుండె కష్టాలకడలి రక్తంతో తడిసిముద్దైంది. కాని నీవంటి కష్టజీవి దగ్గరకు వచ్చేసరికి గుండె గాలి బతుకు గాయాలతో నిండిన నా బొక్కల కన్నాలలో నుండి బయటపడాలని ఆరాటపడుతోంది.

‘అందుకా ! ఈ తల్లి ఎముక ఇంత బరువుగా ఉంది’ పున్నయ్య మనసు ఆర్తితో నిండింది.

మునుపటి ఎముకల భావాలకు చిరాకు వచ్చినా, ఈ తల్లి ఎముకలో కుతకుతలాడిన భావాలు పున్నయ్య కడుపులో దేవినట్లనిపించి ఆ ఎముకబాధను తెలుసుకోవాలనుకొన్నాడు.

“నాయనా ! ఈ తల్లివేదన నా ఒక్కదానిదే కాదు. ఎంతోమందిది. నీ తల్లిలాంటి దానిని నేను. నన్ను అర్థం చేసుకుంటావని నీకు తెలిపి నా బాధకి ఉన్న బరువుతగ్గించుకుంటా. నేను ఇలా ఎముకలో ఎముకనై పడి ఉండటానికి కారణం ఇందాకటి బొక్క, దానికి తొక్కలాంటి వాడి తండ్రి.”

పున్నయ్యకు విసుగు తగ్గి తాను చేపలను పట్టాలన్న ధ్యాస కూడా లేకుండా పోయింది.

“బిడ్డా ! నీ ఓర్పు నా కొడుక్కి, వాడి తండ్రికి ఉండి ఉంటే బాగుండేది. ఆనాడు అలా జరిగి ఉండేదికాదు.” ఎముకలో గడ్డకట్టుకొని ఉన్న కన్నీళ్ళతడి బొట్టుబొట్టుగా బయటకువచ్చి పున్నయ్య గుండెను తడుముతున్నట్టు అనిపించింది.

‘ఆనాడు ఏమి జరిగి ఉంటుంది?’ పున్నయ్య మనసు లయ తప్పి కొట్టుకుంటోంది.

“అందరి అమ్మాయిలకు మల్లే నాకు పెళ్ళయింది. బంగారుబొమ్మలాంటి కూతురు పుట్టిన వెంటనే నా భర్త సంతోషపడతాడనుకొంటే ముఖం చిట్లిస్తూ దీన్ని కాపాడుకు రావటం కష్టం అన్నాడు. అదే సమయానికి “క్యారు.. క్యారు” మన్న ఆ పసిగుడ్డుకు ఆకలయి ఏడ్చిందనుకొన్నా. కాదు ఆ తండ్రిచేతిలో తన భవిష్యత్తును ఊహించుకొని అది ఏడ్చిన ఏడుపుని ఆనాడు నాకు తెలియలా” ఎముక కన్నాలలో నుండి గాలి లోపలికి, బయటకు వస్తూ పోతూ చప్పుడు చేసింది.

‘ఇంతకీ ఆ పిల్ల భవిష్యత్తు ఏమయి ఉంటుంది?’ అన్న ఆలోచనతో “ఆత్రంగా ఉంది చెప్పమ్మా..” తన మనసులో అనుకొన్న మాటలను పున్నయ్య బయటకు అనేసాడు.

ఒడ్డు దగ్గర అటు ఇటు తిరుగుతున్న జనాలు ఇతనిని చూసి పిచ్చోడిలా ఉన్నాడు. ఎముకను

చేతిలోపెట్టుకొని తనలోతానే గొణుక్కుంటున్నాడని పున్నయ్యను దాటుకుంటూ వెళ్ళారు.

"కంగారుపడకు నాయనా ! పిల్లపెరిగి పెద్దదయింది. నా కొడుకుకంటె అది బాగా తెలివయిందని వాడికి చెల్లి అంటే పడేదికాదు. పదోతరగతి ఫస్టున పాసై కాలేజీలో చేర్పించమంటే తండ్రి చదివించనన్నాడు. కొడుకును పొరుగూరికి పంపి చదివించాడు. తండ్రికి ఉన్న పచ్చపాతబుద్ధి కూతురికి అర్థమై తండ్రిమీద చులకన భావం ఉండేది. తండ్రి తనని పరాయిగా చూస్తున్నాడని నాదగ్గర గునిసేది. తను పుట్టిననాటినుండి తండ్రికి ఆడపిల్ల అంటే యిష్టంలేదని చెప్పలేకపోయాను. నేనేమి చేయలేని నిస్సహాయ పరిస్థితి. చూస్తుండగానే పిల్లకు ఇరవై ఏళ్ళువచ్చాయి".

'అవును పాడులోకం ఎప్పుడు బాగుపడుతుందో పైకి మహలచ్చి పుట్టిందంటారు కాని కట్నమిచ్చి పెళ్ళిచెయ్యాలని అయ్యకి పుట్టినప్పటినుండే దిగులు. అందుకులే. పున్నయ్య మనసుకు తోచింది.

"నీ మనసుకు తోచింది కొంతవరకు నిజమేలే నాయనా ! కాని నా కూతురుతోపాటు చదువుకున్న వేరే కులం కుర్రాడు మా పక్కవీధిలోనే ఉంటాడు. నా కూతురుని ప్రేమిస్తున్నానని చెప్పాడట. నా కూతురు కూడా ఇంటిచెరను వదిలించుకోవాలని అనుకుందో ఏమోకాని తనని ప్రేమించినవాడిని పెళ్ళిచేసుకుందామని అనుకొంది. ఆ పిల్లాడు ఒప్పుకున్నాడు. ఆ విషయం తెలిసిన తండ్రి అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. చంపుతానన్నాడు. కాని తండ్రి ఏదో కోపంతో ఉండి ఉన్నాడులే అని అనుకొంది. ఆ పిల్లవాడు తొందరచేసేసరికి, తండ్రి తనపెళ్లిని ఒప్పుకోడని అనుకొందేమో. ఇంట్లోనుంచి వెళ్ళిపోయి పెళ్ళిచేసుకొంది.".

'అమ్మయ్య. కూతురి జీవితం సుఖాంతం' పున్నయ్య తన మనసును సమాధాన పరచుకొన్నాడు.

ఆ తల్లి ఎముక పున్నయ్య భావాలను గ్రహించినట్టుగా "నాయనా ఆ పెళ్ళి దుఃఖాంతం అయింది. ఆ అబ్బాయి నా కూతురు వేరే ఊరికి వెళ్ళి తలదాచుకొన్నారు. ఒకరోజు ఆ అబ్బాయి తన తల్లికి అనారోగ్యమని తెలిసి ఈ ఊరువచ్చి కొన్నాళ్ళు తల్లిదగ్గర ఉన్నాడు. అత్తను చూడటానికి నా కూతురు మా ఊరు వచ్చింది. వీధిలో నడుచుకుంటూ వస్తున్న కూతురిని చూసిన తండ్రి ఆవేశం పట్టలేక "పరువు తీసావ్ గదే నిన్ను చంపెయ్యాలి" అంటూ అరుస్తుంటే పక్కనే ఉన్న నా కొడుకు దగ్గరలో ఉన్న కొట్లోకి వెళ్ళి ఉన్న బెల్లంకొట్టే కత్తితో నరికేసాడు. కూతురు కాపాడమని గగ్గోలుపెట్టినా అక్కడ కాపాడే నాథుడే కరువయ్యాడు. అందరూ పరువు కోసం చంపాడంటూ కూతురినే ఆడిపోసుకున్నారు. నా కూతురు బతుకు బుగ్గిపాలయింది.".

'అయ్యయ్యో..!' పున్నయ్య మనసు బాధతో గిలగిల కొట్టుకుంది.

"కూతురు చావుకు తండ్రే కారణమని దాన్ని కన్నకడుపు ఆక్రోశించినందుకు, నా మొగుడు యముడై గొడ్డలితో నా తలకాయను ఎగరగొట్టాడు. ఆ గొడ్డలిని నాకళ్లముందే అందించింది ఎవరోకాదు నా కొడుకే..."

'ఏమిటీ కన్నకొడుకే !' పున్నయ్య మనసు ఆశ్చర్యపోయింది.

"ఆఁ.. అవును. వాడే.. నా గర్భం నాకు శత్రువైంది. చుట్టాల కోసం నటిస్తూ తలకొరివిపెట్టి నా ఎముకల్ని ఈ కృష్ణమ్మలో కలిపాడు. నాకసి అర్థంచేసుకొన్న ఈ కృష్ణమ్మ వాడి ఎముకలను కృష్ణలో కలుపుతుంటే కాళికలా నాలుకసాచి వాడి ఎముకలను నాపక్కకు లాక్కొచ్చింది. అందుకే నా కొడుకు ఎముక నా పక్కనే పడి ఉంది. వాడి కసికంటే ఈ కన్నతల్లి కసి ఎక్కువ. వాడి ఎముకను పెంటకుప్పలపైకి విసిరివేస్తే నా గుండె తేలికయి నా గర్భశోకానికి ముక్తి కలుగుతుంది"

'అదేమిటమ్మా ! కొడుకు బొక్కను విసిరేస్తే ముక్తి కలగటం ఏమిటీ.?' పున్నయ్య మనసు తికమకపడింది.

"అదేమరి. వాడి బొక్కలు ఈ కృష్ణమ్మ నీటిని కలుషితం చేస్తున్నాయి. పెంటకుప్ప మీదకు విసిరేస్తే కుక్కలు పీక్కొని తింటే నా కసి తీరుతుంది. అదిగో నా కూతురి ఎముక పిలుపు వినపడుతోంది. నన్ను వదిలి ఉండలేదు. ఇందాకటిచోటనే నన్ను విడిచిపెట్టు. దానికి నేను. నాకు అది. పక్కన ఉంటే మా ఎముకలు చచ్చినా మరిచిపోలేని కష్టాలను తలచుకుంటూ ఉంటాము. అవేగా మాకు మిగిలినవి. దీనికి ఉపకారంగా నేను నీ తల్లి రూపంలో చేపల పులుసు వండిపెట్టానని అనుకో."

ఆ బొక్కలలోని తడి మనసును ముంచేస్తుంటే పున్నయ్య ఏమాత్రం ఆలస్యం చేయకుండా నీళ్ళలోకి దూకి ఆ ముక్కను యదాస్థానంలో ఉంచి, ఆ తల్లి కోర్కె తీర్చటానికి ఇందాక ఉంచిన కొడుకు ఎముకను బయటకు విసిరెయ్యాలనుకుంటూ పైకి తీసుకు రాబోతుంటే "ఓ ప్రియా నాకోసం వెదుకుతున్నావా. ఇదిగో ఇక్కడే నా తల్లి ఒడిలో ఉన్నా. నా తల్లి కూడా కిష్టమ్మ కడుపులోనే ఉంది. నిన్నెలా కలుసుకోవాలో తెలియటంలేదు. నిన్ను ఒకసారి చూడాలని ఉంది అనే పలవరింతల గుసగుసల చప్పుడు వినపడింది. 'ప్రియుడెవరై ఉంటాడబ్బా' కుతూహలంతో ఆ నీళ్ళల్లో తాను ఎంతోసేపు ఉండలేక ఆ పిల్లబొక్కను కూడా తనతోపాటు ఒడ్డుకు తెచ్చాడు పున్నయ్య. ఆతని చేతిలో ఉన్న బొక్కబొట్టుబొట్లుగా నీరుకారుస్తోంది. ఆ నీటి విలాపానికి పున్నయ్య తన చెవిని చేర్చాడు.

❊ ❊ ❊

ఐదవ అస్థిక కథ

"ప్రియా ! నీకోసం మా నాన్నను ఎదిరించి వచ్చాను. మనిద్దరం గుళ్ళోపెళ్ళిచేసుకొన్నాం. 'ఊళ్ళో ఉంటే మీ నాన్న మనల్ని బతకనీడు. వేరే ఊళ్ళో కాపురం పెడదాం' అని నన్ను వేరే ఊరికి తీసుకొని వెళ్ళావు. కొన్నిరోజులు నాకు స్వర్గాన్ని చూపించావు. ఎలా మరిచిపోను. మీ అమ్మకు జబ్బుచేసిందని కబురువస్తే నువ్వు మన ఊరికి వెళ్ళావు. గుర్తుందా. నాలుగురోజులు నీ కోసం ఎదురుచూసా. నువ్వు రాలేదు. నీ వాళ్ళింటికి వద్దామని బయలుదేరా మన ఊరికి వచ్చా."

'నీ మొగుడుని కలుసుకొన్నావా?' ఆత్రంగా అనుకొన్న పున్నయ్య మనసు ఆ బొక్క ఇంకా ఏమి చెబుతుందో వినాలనుకొంది.

"మన ఊళ్ళోవాళ్ళు నన్ను చూసి మా నాన్నకు కబురు అందించారు. మా నాన్న, మా అన్నయ్య వచ్చి రోడ్డుమీదే నా జుట్టుపట్టుకొని 'కులటా' అంటూ నన్ను ఎన్నో మాటలు అన్నారు. కోపం వచ్చిన నేను, ధైర్యం తెచ్చుకొని నేనేమి తప్పుచేసాను నన్ను ప్రేమించి పెళ్ళిచేసుకున్న వ్యక్తితోనే కదా వెళ్ళిపోయింది. మీకు చెప్తే, పెళ్ళి లేదు పెటాకులు లేదు. ఇంట్లో నుంచి బయటకు వెళ్తే కాళ్ళు విరగగొడతానని బెదిరించలేదా? అసలు నీవు నన్ను కన్నకూతురిలా ఏనాడైనా చూసావా? అని గట్టిగా అడిగాను. 'నాన్నను ఎదిరించి మాట్లాడుతావా? ఎంత పొగరే నీకు' అంటూ మా అన్న నా చెంపలు టపాటపా వాయించాడు. మా గొడవకి చుట్టూర జనం మూగారు"...

'అయ్యో ! అయ్యో ! తోబుట్టువును అలా కొట్టవచ్చా ?' పున్నయ్య మనసు ఘోషించింది.

"జనం మధ్యలోనుంచి ఒక పెత్తందారు వచ్చి మా నాన్నతో 'కూతురు చెప్పాపెట్టకుండా ఒక మగాడితో లేచిపోయే విధంగా పెంచావు కాబట్టే అలా నీ కూతురు బలుపెక్కి విర్రవీగి మాట్లాడుతోంది. ఈ ఊళ్ళో ఆడపిల్లలకు ఇలా వెర్రులెత్తుతున్నాయి. మొన్న మునసబు కూతురు కూడా ఇలాగే లేచిపోయింది. ఆ పిల్లకు నీ కూతురికి స్నేహం ఉందటగా. మన ఊరికే అప్రదిష్ట. ఇలాంటి కూతుర్లు చచ్చారనుకొని కర్మకాండలు చెయ్యాలి. పీడా వదులుతుంది అన్నాడు. దానితో అగ్గికి ఆద్యం తోడయినట్టు మా నాన్న నా గొంతుపట్టుకొని పిసుకుతున్నాడు. మా అన్న ఎక్కడినుండి తెచ్చాడో తెలియదు కాని కత్తిని మా నాన్న చేతికి ఇచ్చాడు. జనం ఒక్కళ్ళు మానాన్నను అడ్డుకోలేదు. ఆడపిల్ల సొంతంగా తనకు ఇష్టమైనవాడిని పెళ్ళిచేసుకోవటం వాళ్ళకు యిష్టంలేదనుకొంటా. అలా నా మీద కసితీర్చుకొని నన్ను వదిలేస్తే నా మొగుడి దగ్గరకు వెళ్ళాలనుకొన్నా".

'వెళ్ళనిచ్చారా తల్లీ !' పున్నయ్య తనలో తనే బాధగా మూలిగాడు.

"పరువుపోతోందంటూ కత్తి తెచ్చి మా అన్నయ్య తనకు నామీద ఉన్న కచ్చతో దీనితో "చంపు నాన్నా" అని మా నాన్నకు ఆ కత్తిని అందించాడు. 'నాన్నా ! అన్నయ్యా ! మీ యిద్దరికి నా మీద ఇంత కసి ఎందుకు?' అని అనేలోపే మానాన్న కసితీరా నా కడుపులో పొడిచాడు. ఇదంతా చూస్తున్న జనం ఎవరూ మా నాన్నను అడ్డుకోలేదు. నేను స్పృహతప్పాను. రెండురోజుల తరువాత ఒక ఎముక నన్ను దగ్గరకు తీసుకొంది. ఇలా ఎముకల రూపంలో కృష్ణమ్మ ఒడిలో నా తల్లిబొక్క పక్కన చేరానని తెలిసింది. నన్ను నా తల్లి ఎముక పక్కకు మళ్ళీచేర్చు".

ఏమి చేయలేకపోయిన నిస్సహాయతతో పున్నయ్య మనసు "శాంతి.. శాంతి" మంత్రాన్ని చదివింది. ఆకలి కూడా మరిచిపోయాడు. మళ్ళీ నీళ్ళలోకి దూకి ఆ కూతురిబొక్కను తల్లిబొక్కపక్కన జాగ్రత్తగా పెట్టాడు. పున్నయ్య మనసు శరీరం బరువెక్కుతుంటే తాను నీటిపైకి చేరాలనుకొన్నాడు.

ఉన్నట్టుండి భూకంపం వచ్చిన శబ్దం వినపడింది. 'ఏమిటా?' అని పున్నయ్య వలలోంచి చెయ్యితీస్తుంటే "ఓ రాజా ! నన్ను అన్యాయం చేసిపోయావు. నీకు నేనేమి ద్రోహం చేసాను." అనే శబ్దాలు కాళ్ళకు అడ్డుపడ్డట్టుగా పున్నయ్యకు అనిపించింది. ఇంకొక ఎముక నిట్టూరుస్తున్నట్టు అనిపించి దాన్ని తీసి పట్టుకొని నీటిపైకి తేలి ఒడ్డునపడ్డాడు పున్నయ్య.

❊ ❊ ❊

ఆరవ అస్థిక కథ

పున్నయ్య చేతిలోని బొక్కకు పెద్దచిల్లులు ఉన్నాయి. ఆ చిల్లుల్లో నుండి కన్నీరులా నీరు ఉబికి ఉబికి వస్తోంది. నీళ్ళల్లో నుంచి బయటకు తీసినా ఆ బొక్క కొద్దిగా వేడిగా ఉందనిపించింది పున్నయ్యకు. దాన్ని పున్నయ్య వదిలేద్దామనుకుంటుంటే "రాజా.. నా ప్రియా..." ఆర్తనాదం ఎముకలో నుండి పున్నయ్యకు వినపడింది. 'ఓహో !.. ఇది ఆ స్నేహితురాలి ఆలాపన కాదు కదా ! ఏమో అయ్యుంటుందేమో ! లేచిపోయిన ఆడపిల్లలకు బతుకు ఉంటుందా?' పున్నయ్య సందేహించాడు.

ఆశ్చర్యపోతూ పున్నయ్య ఆ ఎముకను జారిపడకుండా జాగ్రత్తగా ఒడిసి పట్టుకొన్నాడు.

"రాజా ! ఎప్పుడొస్తావు.. నీ రాకకోసం నిలువెల్లా కన్నాల కన్నులతో ఎదురుచూస్తున్నా.. నన్నొదిలి ఎక్కడకు వెళ్లావ్.. నా తండ్రి మునసబు చేసాడు కదా. ఇప్పటికీ మా ఊర్లో ఆయన పెత్తనమే నడుస్తుంది. చంపుతాడని తెలిసి కూడా ఆనాడు నీకోసం కన్నవాళ్ళను వదిలి వచ్చా.. పెళ్ళిచేసుకుందాం అన్నావు. రెండురోజులు ఆనందంతో చెట్లంబడ, పుట్టలంబడ కలిసి తిరిగాం..

పొదలమాటున దేహాల తాపాలను తీర్చుకొన్నాం. ఆ ఆనందాన్ని ఇంకా మర్చిపోలేకపోతున్నా.. కాని మర్రోజు నువ్వు చెట్టుకింద నన్ను కూచోపెట్టి టిపెన్ తీసుకొని వస్తానని చెప్పి వెళ్ళిపోయావ్. ఆ పొద్దుమాపువేళ జావళీలు పాడుకొంటూ నీకోసం ఎదురుచూస్తుంటే, నన్ను తీసుకొని రమ్మని నువ్వు పంపించావంటూ ఒకవ్యక్తి వచ్చాడు. నీకేమయిందోనని భయపడుతూ అతనితో బయలుదేరాను...”

‘అయ్యో ! తెలియని మనిషితో అలా ఎలా వెళ్ళావమ్మా!..’ పున్నయ్య మనసు సందేహపడింది.

“అలా ఆ పెద్దమనిషి నన్ను ఒక ఆంటి ఇంటికి తీసుకొని వెళ్ళాడు. రాజా ! నేను ఏమయ్యానని తలుచుకొంటున్నావా !.. ఆ ఆంటి ఒక చీరను యిచ్చి, నువ్వు కొని పంపావని చెప్పి, నీళ్ళుపోసుకొని రా. ఈ లోపు నీ ప్రియుడు వచ్చేస్తాడులే అంది. ఆనందంతో మురిసిపోతూ స్నానంచేసి నువ్వు కొన్నావనుకొన్న చీరను కట్టుకొని ఆ గదిలో ఉన్న పరుపుమీద పడి నీ ఊహల్లో తేలిపోయా... ”

క్షణక్షణం పున్నయ్య గుండెల్లో గుబులు రేగింది.

“నా కలల ప్రంపంచం నన్ను నిలవనీయలేదు. చుట్టూ ఉన్న దాన్ని పట్టించుకోని పరవశంలో ఉన్నా. ఇంతలో ఒకచేయి నన్ను గట్టిగా దగ్గరకు లాక్కొంది. అది నీ బిగి కౌగిలి అనుకొన్నా”..

పున్నయ్యకు చిన్న సిగ్గు ఆవహించి తన పెళ్ళాం గుర్తుకు వచ్చింది. ఆ బొక్కను అక్కడే వదిలేసి వెంటనే వెళ్ళాలనుకొన్నాడు. ఇంతలో ఆ బొక్కపెద్దగా “ఛీ..ఛీ ఎవరూ నన్ను పట్టుకొంది”.. అని అరిచా..

పున్నయ్య మనసు శంకించింది. ఆ ఎముకను వదిలి వెళ్ళలేకపోయాడు. “ఓ రాజా ! అది నీ కౌగిలికాదనీ, వేరేవాళ్ళ కబంధహస్తాలని తెలిసి, విడిపించుకొని నీ కోసం పరుగెత్తుతూ బయటపడాలనుకొన్నా. కాని ఆ రాక్షసులు నన్ను వదలలేదు. ఆ రోజు నుంచి నేను నరకం అనుభవించా. నా మనసు నిన్నే కోరుకొనేది. నా మనసు పవిత్రంగానే ఉందని భావిస్తావనే నమ్మకం నాకుంది. నువ్వు వచ్చి నన్నుకాపాడి తీసుకొనివెడతావని ఏ రోజుకారోజు ఎదురుచూసా.. రాజా ఎక్కడున్నావూ..” అనే బొక్కమూలుగు వినపడింది.

పున్నయ్యకు తన చిన్నప్పుడు టూరింగ్ టాకీసులో సినిమాచూస్తున్నట్టు అనిపించి ఉత్కంఠతో – నీ రాజా వచ్చి తీసుకొని వెళ్ళాడా? సందేహంతో తనకు తెలియకుండానే పైకి అనేసి నాలుక కరుచుకొన్నాడు. చుట్టూర కలియజూసాడు. అమ్మయ్య ఎవరూలేరులే అని అనుకుంటుంటే ఆ

ఎముక ఆయాసపడుతున్నట్టుగా వెచ్చని గాలి బొక్కకన్నాలలో నుంచి బయటకు వచ్చింది. కిట్టమ్మగాలి కూడా చల్లబరచటంలేదని నీటిలో తన చేయి ముంచి ఆ బొక్కను నిమిరాడు. ఇంతలో "అబ్బా..". అంటూ ఆ ఎముక మళ్ళీ మూలిగిన శబ్దం వినపడింది.

ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు పున్నయ్య

"రాజా ! నువ్వు వస్తావని, నన్ను తీసుకొని వెడతావని నీకోసం రోజుల తరపడి ఎదురుచూసా. ప్చ్.. నువు రాకపోయేసరికి నిన్ను వెతుక్కోవాలని కాపలాదారుల కళ్ళుకప్పి గోడదూకి బయటకు పరిగెత్తా. వాళ్ళువెంటనే వచ్చి పట్టుకుపోయారు. అప్పటినుంచి ఇంకా నరకాన్ని అనుభవించా. ఇంకేమి చేయగలను. నా దేహపు గాయాల నుండి కారిన నెత్తుటి బిందువులను వాళ్ళు రూపాయిలుగా మార్చుకుంటుంటే ఎన్నాళ్ళని నాశరీరం తట్టుకుంటుంది చెప్పు."

'చొచ్చోచ్చో.. రామరామ' పున్నయ్య మనసు ఆక్రోశించింది.

"రాజా ! నా బాధ విని నువ్వు తట్టుకోలేవు. అయినా నీతోతప్ప నేను ఎవరితో చెప్పుకోగలను. నువ్వుతప్ప నాకు ఇంక ఎవరున్నారు. ఆ రాక్షసులచేతిలో నా శరీరం పుచ్చి పచ్చిపుండయింది. గాయాలనుండి వచ్చే నెత్తురు గడ్డలు గడ్డలుగా మారింది. నాకంపు నేనే భరించలేకపోయాను. నన్ను తీసుకొని వెళ్ళినవాళ్ళకు నా అవసరం తీరిపోయింది. నన్ను ఒకరోజుచీకట్లో చెట్లకింద వదిలిపెట్టి వాళ్లు పరారయ్యారు. ఆ పచ్చని చెట్లే నాకు ఆచ్ఛాదన అయ్యాయి"..

పున్నయ్య మనసు కాస్త ప్రశాంతతను పొందింది.

"రాజా ! అలా ఆ చెట్లమధ్యన నా మనసు కాస్త సేదతీరి నీ కోసం అలమటించింది. రెండురోజులు గడిపా. కాని నా శరీరం మరింతగా కుళ్ళిపోయింది. ఇంతలో... – ఇదిగో.. ఇది కరోనాపేషంటులా ఉంది. ఇక్కడ కూర్చొంది. ఊరంతాపాకిపోతుంది. దీన్ని ఇక్కడనుండి తీసుకెళ్లాలి– మాస్కుపెట్టుకొన్న ఒక వ్యక్తి నా దగ్గరకు వచ్చాడు."

'అమ్మయ్య వాళ్ళు ఆసుపత్రిలో చేర్పించి ఉంటారులే..' అనుకొన్నాడు పున్నయ్య.

"నన్ను ఆసుపత్రికి తీసుకెడుతున్నారు నా రోగం తగ్గుతుంది. నా రాజాను కలుసుకుంటానని అనుకొన్నా. నన్ను తీసుకెళ్ళినవాళ్ళు తమలో తాము – దీని రోగం తగ్గేదికాదు. కంపు భరించలేకుండా ఉన్నాం ఆసుపత్రిలో చోటులేదు. వాళ్ళు మళ్ళీ మనల్నే శ్మశానానికి తీసుకెళ్ళమంటారు. దానికంటే ఈ కృష్ణనీళ్ళల్లో దీన్ని వదిలిపెడదాం. ఈ రోగం ఇంకొకళ్ళకు అంటకుండా ఉంటుంది –

అంటూ నన్ను నీళ్ళల్లో పడేసారు. నేను ఆ నీళ్ళలో పడి ఉన్న నాస్నేహితురాలి తల్లి పక్కన చేరాను. నాకు వాళ్లమీద కోపంలేదు రాజా ! ఆ రకంగానన్నా నాకు ముక్తిని కలిగించారు.”

కష్టాల్లో మునిగితేలినా ఈ బొక్కకున్న ప్రేమ ఎంత స్వచ్ఛమైందో కదా అని తనలోతాను ఊరటచెందాడు.

“రాజా ! నన్ను నీవు మరిచిపోయావా. అమ్మో అలా అనుకుంటేనే నా ప్రాణం విలవిల తన్నుకుంటోంది. నన్ను వదిలి నీవు ఉండలేక నా దగ్గరకు వచ్చేస్తావులే. ఇదంతా నా పిచ్చి అనుకొని నవ్వుకుంటున్నావా ! అదిగో నీ నవ్వే నన్ను ఆనాడు నీప్రేమలో పడేసింది రాజా ! కాని నేను మాత్రం ఎప్పటికైనా నీ ఎముకల్ని పెనవేసుకోవాలని ఎదురుచూస్తూ నీళ్ళల్లోనే ఉంటాను.” ఎముకకున్న పెద్దగాయాల చిల్లులు రొద పెట్టినట్టనిపించింది.

‘పిచ్చిప్రేమ ప్రియుడు మోసంచేసాడని అనుకోలేకపోతోంది.’ పున్నయ్య మనసు ఘోషించింది.

పున్నయ్య నీళ్ళలోకి దిగి ఆ తల్లీ కూతుళ్ళ ఎముకల పక్కన స్నేహితురాలి బొక్కను వదిలి పెట్టాడు. పున్నయ్యకు కడుపులో దేవినట్టయి కళ్ళుతిరుగుతున్నట్టు అనిపించింది. వలకోసం తాను మర్నాడు రావచ్చులే అని ఇంటిముఖం పట్టాలనుకొన్నాడు..

ఇంతలో “రాధా..! రాధా..! నీకు అన్యాయం చేసాను. నాకు క్షమాపనలేదు. నేను శిక్ష అనుభవించాల్సిందే. నా అస్థిపంజరం నీకోసం వెదుకుతోంది. ఎక్కడ ఉన్నావు రాధా ! నిన్ను చేరుకోవాలి..” గలగల అరుస్తున్నట్టు అనిపించిన పున్నయ్యకు ఇది ఇందాకటి ప్రియురాలికోసం వచ్చిన ప్రియుడిదా? ఎందుకు ఆమెను మోసంచేసాడో తేల్చుకొనే ఇంటికి వెళ్ళాలనుకొన్నాడు. పున్నయ్య ఆ అస్థిపంజరాన్ని పట్టుకొని తీయబోతుంటే అది పెళ్ళపెళమంటూ ముక్కలుముక్కలుగా విడిపోయింది. అందులోని పెద్దదైన తొడ ఎముకను చేతితో పట్టుకొని నీటి పైకి తేలాడు పున్నయ్య.

❊ ❊ ❊

ఏడవ అస్థిక కథ

ఒడ్డుకి దగ్గరగా ఉన్న ఇసుకదిబ్బమీద పున్నయ్య కూర్చొని తన తొడమీద ఆ ఎముకను పెట్టుకొన్నాడు. ఆ పెద్ద ఎముక టపటప చప్పుడు చేస్తూ “రాధా ! నన్ను క్షమించు. నిన్ను నేను కావాలని మోసం చేయలేదు”.. బొంగురుగొంతు శబ్దాలు వినపడ్డాయి.

తరవాత అర్థమైంది. 'ఓహో ! ఈ ఎముకకి ఎంత పశ్చాత్తాపం' పున్నయ్య మనసుకు తట్టింది.

"రాధా ! మనం ఉండటానికి ఇంటికోసం వెదుకుతూ పక్క ఊళ్ళో తిరుగుతుంటే, దారిలో మనతో పాటు చదువుకున్నవాడు కలిసాడు. వాడు మన స్నేహితుడే కదా అని మనిద్దరం పెళ్లిచేసుకొన్న విషయం చెప్పాను. పైకి సంతోషించాడని అనుకొన్నా. ఆ తరవాత అర్థమైంది వాడి సంగతి. వాడు ఇల్లు చూపిస్తానంటూ చెప్పి నన్ను ఒక పెద్దమనిషి ఇంటికి తీసుకొని వెళ్ళాడు. ఆ మనిషి నాకు ఉద్యోగం చూపిస్తానంటూ ఒక పాడుబడ్డ యింట్లోకి తీసుకొని వెళ్ళి, కొన్ని గోతాలు చూపించి వాటిని తాను చెప్పిన మనిషికి యిచ్చి రావాలన్నాడు. నువ్వు చెట్టుకిందే నాకోసం ఎదురు చూస్తుంటావని మర్రోజు వస్తానని వాడితో చెప్పాను".

'మంచిపని చేసావు. పాపం ఆ పిల్ల చెట్టుకింద ఎంతసేపని ఉంటుంది.' మనసు ఆందోళన చెందింది. పున్నయ్య మళ్ళీ ఏదో పెద్దశబ్దం వినిపించినట్టనిపించింది పున్నయ్యకు.

"రాధా !.." ఆ ఎముక టపటప చప్పుడుచేస్తూ "ఆ పెద్దమనిషి వచ్చి నాతో ఇప్పుడే ఒక మనిషి వస్తున్నాడు వాడికి అర్జంటుగా అందించాలి. నీకు డబ్బులు యిస్తాను. ఆ డబ్బుతో ఇంటిఅద్దె కింద బజానా ఇద్దువుకాని అన్నాడు. కాసేపు ఆలోచించి సరే అన్నా. ఆ గోతం తీసుకొని బయటకు వస్తుంటే మనవాడు ఎవరితోనో మాట్లాడుతూ చెట్టుకింద ఉందని ఏదో చెపుతున్నాడు. నేను విన్నానని అనుకొని తెలిసినవాళ్ళతో ఒంటరిగా ఉన్న రాధను యింటికి తీసుకొని వెళ్ళమని చెప్పాలే అన్నాడు. అప్పుడు అమ్మయ్య అని అనుకొన్నా".

'పోనీలే' పున్నయ్య మనసు ఊరటచెందింది.

"ఆ పెద్దమనిషి నా స్నేహితుడికి కొంత డబ్బు యిచ్చి నాకు యిమ్మని చెప్పాడు. ఆ రోజు ఆ గోతాన్ని యిచ్చి వచ్చిన తరువాత రాధను పంపించానని చెప్పిన యింటికి ఆత్రంతో వెళ్ళా. రాధ భర్తను, ఆమెను తీసుకొని వెళ్ళటానికి వచ్చా అన్నా. వాళ్ళు ముసిముసిగా నవ్వుకుంటూ అలాంటి అమ్మాయి ఇక్కడకు రాలేదన్నారు. ఆ స్నేహితుడనే వాడు మళ్ళీనాకు కనపడలేదు. వాడి సంగతి వదిలిపెట్టి నీకోసం బజార్లన్నీ తిరుగుతూ వెదికా. కాని నువ్వు కనపడక 'ఏమి అయ్యావో' అని భయంవేసి జీవితంలో మొదటిసారి ఏడ్చా"

'పాపం ఆ పిల్ల ఎక్కడికి వెళ్ళిందో ఏమో!...' పున్నయ్య మనసు ఆందోళన చెందింది.

"ఒక వీధిలో నీకోసం వెదుకుతుంటే పోలీసుబండి హారను వినిపించింది నీ ఆచూకి వాళ్ళకు తెలుస్తుందేమో అని అడగటానికి దగ్గరకు వెళ్లా అంతే వాళ్ళు 'వీడేరా ఆ రాజు వాడుచెప్పిన గుర్తులున్నవాడు వీడే గంజాయిని అమ్మినవాడు' బండిలోకి ఎక్కించమన్నాడు. 'నేను గోతం యిచ్చిరమ్మంటే యిచ్చాను గాని గంజాయిని అమ్మలేదు' అన్నా వాళ్ళల్లో ఒకడు 'అందరూ ఇలాగే చెబుతారులే పద బండెక్కు అన్నాడు' మొత్తుకున్నా అయినా వినలేదు."..

"అయ్యో ! పోలీసోళ్ళు నిన్ను చితకబాది ఉంటారు.." పున్నయ్య మనసు రోదించింది.

"నన్ను స్టేషనుకు తీసుకొనిపోయారు. అక్కడ నేను ఆ పెద్దమనిషి విషయం, పాతబంగలా విషయం చెప్పినా వాళ్ళు వినిపించుకోకుండా, 'మాకు తెలుసులే' అని కేసు రాసారు. మన స్నేహితుడిగా నటించినవాడు ఆ పోలీసులకు తెలుసు అని వారి మాటల్లో అర్థమైంది. నాస్నేహితుడిని అడగండీ.. నేనెంత మంచివాడో చెపుతాడు అన్నా. వాళ్ళు నవ్వుకొంటూ, 'వాడేగా నీ ఆనుమాను చెప్పింది. నీకు భార్యకూడా ఉందటగా.. నీ భార్యమీద వాడు కన్నేశాడులే' అన్నాడు. అప్పుడు వాడు స్నేహితుడి ముసుగులో నన్ను మోసంచేసాడని గ్రహించా. నిన్ను ఎక్కడకు పంపాడో గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. కాని నేను ఏమి చేయలేని నిస్సహాయస్థితి. నాగోడు చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. అప్పుడు అర్థమైంది నాకు జైలు తప్పదని. ఇరవైఏళ్ళు శిక్షవేసారు"..

'ఇప్చ్ .. అమాయకుడా. ! నీ భార్య ఏమయిందో పాపం.. బతికి ఉందో లేదో..'. పున్నయ్య మనసు ఘోషించింది.

"నీవేమైపోయావో అని నిన్ను తలచుకుంటూ రోజురోజు ఏడిచేవాడిని. తోటి ఖైదీని చూడటానికి వచ్చిన వాళ్ళ యింటి మనుషులు 'నువ్వు రోగంతో ఒక చెట్టుకింద కూర్చొని ఏడుస్తుంటే చూసామనీ, అంటురోగమనే భయంతో ఆసుపత్రివాళ్ళకు కబురుచేస్తే వాళ్ళుతీసుకొని వెళ్లారని చెప్పారట.' అతను నాతో అన్నాడు. అయితే నేను 'నా రాధ దగ్గరకు వెడతా అన్నా.' 'నన్ను గోడదూకి పారిపొమ్మన్నాడు.' అలా జైలుగోడ దూకానో లేదో పోలీసులు వెంటపడి తుపాకులు కాల్చారు. ఎన్ కౌంటరు కేసు ఎందుకనుకొన్నారో ఏమోగాని నన్ను ఈ కిష్ణలో పడేసి వెళ్ళిపోయారు.".

"ఇదిగో ! ఇందాక రొదపెట్టింది నా రాధే. కాని నేను ఎలా కలవాలో అర్థంకావటంలేదు". ఎముకలో గాలి బయటకు తన్నుకుంటూ వస్తోంది.

పున్నయ్య తన తొడమీద ఉన్న ఆ పెద్ద ఎముక రాధ మొగుడిదే అనుకొని ఆ ఎముకతో సహా నీళ్ళల్లోకి దూకి దాన్ని రాధ ఎముక పక్కన పడేసాడు. ఆ రెండు ఎముకలు ఒక దానిమీద ఒకటి కరచుకొన్నట్టు పడ్డాయి.

పున్నయ్యకు అలసట ఎక్కువైంది. కడుపులో ఆకలి నకనకలాడింది. పైకి వస్తుంటే "ఓ రాజా ! నీకు ద్రోహంచేసా. నీ రాధను నేనే చంపేసా" శబ్దాలు కిట్టమ్మ ప్రవాహంలో నుండి వినపడ్డాయి. ఒక ఎముక ఆ నీళ్ళల్లో కొట్టుకుంటూ పున్నయ్య దగ్గరకు వచ్చింది. దాన్ని పట్టుకొని నీటి ఒడ్డుకు తెచ్చాడు. ఆ ఎముక "నన్ను ఎందుకు తెచ్చావు. ఇందాక రాజుని, వాడి రాధను పొట్టనపెట్టుకుంది నేనే. వాడి శిక్షకు కారణం నేనే. నేను పాపం చేసా వాడిని క్షమించమని అడుగుతా" నీళ్ళరొదచప్పుడు అర్థమయింది పున్నయ్యకు.

పున్నయ్య ఇంటికి వెళ్ళలేకపోయాడు. "వీడిగోస ఏందో" వినాలని అనుకొన్నాడు.

* * *

ఎనిమిదవ అస్థిక కథ

"రాజా ! నన్ను క్షమించు. ఆనాడు నీకు, రాధకి పెద్ద ద్రోహం చేసా. మా చెల్లిమీద ప్రేమ నన్ను ఆనాడు పాడుపని చేయటానికి అలా పురికొల్పింది.".

'ఒహో ! నువ్వేనా.. ఆ పాడు పనిచేసింది.. చెల్లిమీద ప్రేమ ఉంటే ఇలా ఎందుకు చేసాడో? వీడినుంచే తెలుసుకుంటా' పున్నయ్య మనసులో అనుకొన్నాడు.

"రాజా ! నీకు తెలుసుకదా మేము కటిక బీదవాళ్ళం. అయినా పరువు కోసం పాకులాడుతాం. అటువంటి పరువు తక్కువ పని ఎలా చేసానా అని తరువాత చాలా బాధపడ్డా. మా చెల్లిని వరసకు బావ అయ్యేవాడు ప్రేమిస్తున్నా.. పెళ్ళిచేసుకుంటానంటే మాచెల్లి వాడి మాయలో పడింది.. చుట్టమే కదా అని అతనితో చనువును పెంచుకొంది. దాన్ని సరిగా అర్థంచేసుకోక వాడు మా చెల్లిని బయటకు రమ్మని చెప్పి తోటలోకి తీసుకెళ్ళాడు. చెల్లి గింజుకున్నా వినక తన తాపం తీర్చుకొన్నాడు. మళ్ళీమళ్ళీ చెల్లి రానంటే జరిగిన విషయం అందరికీ చెప్తానన్నాడట. వాడంటే భయంతో వాడి మాయలో చిక్కుకుంది."

'అమాయకురాలైన ఆడపిల్ల' పున్నయ్య మనసు కంపించింది.

"మాచెల్లి ఇంట్లో చెప్పటానికి భయపడింది. తనలో తనే ఆలోచించుకుంటూ మధనపడేది. అన్నం తినేది కాదు. మా అమ్మ కారణం తెలుసుకుంటే గుట్టు తెలిసింది. మా నాన్న నేను కలిసివెళ్ళి బావతో పెళ్ళిచేసుకోమన్నాం. వాడు చెట్టెక్కి కూర్చొన్నాడు. వాడికి పాతికవేలు కట్నం యిస్తే తప్ప పుస్తె కట్టను అన్నాడు. అంత డబ్బు ఎక్కడ నుండి తేవాలని నాన్న నెత్తినోరు బాదుకొన్నాడు.

అమ్మేమో పిల్లగుట్టు రట్టుకాక మునుపే పిల్లమెళ్ళో తాళిపడాలి లేకపోతే అందరం ఉరేసుకోవాలి. దాస్తేదాగదు. నాల్గు రోజులుపోతే అందరికీ అర్థమౌతుంది అంటూ చెల్లి కడుపువేపు చూపించింది".

'అయ్యో ! జరగకూడనిది ఏదన్నా జరిగి ఉంటుందా?' అని సందేహించాడు పున్నయ్య.

"నాన్నకు నాకు పరిస్థితి అర్థమైంది.. అగ్గిమీద గుగ్గిలమై మా నాన్న చెల్లిని పీక పిసకబోయాడు. నేను అడ్డం పడి ఆ డబ్బును నేను తీసుకు వస్తానని చెప్పి ఆ రోజు నీకు చూపించిన పెద్దమనిషిని అప్పు అడగటానికి వెళ్ళాను. ఆతడు చెప్పిన పని చెయ్యాలంటే తప్పుమీద తప్పు అవుతుంది అని అనుకొని ఏమిచెయ్యాలో తేల్చుకోలేక తిరిగి వస్తుంటే రాజా ! నువ్వు కనపడ్డావు..."

'రాజు భార్య చావుకు వీడే కారణం ఏమో? ఇప్పుడు తెలుస్తుందిలే' పున్నయ్యలో కుతూహలం పెరిగింది.

"నువు గోతం తీసుకొని వెళ్ళగానే ఆ పెద్దమనిషితో నేను అడిగిన డబ్బును తొందరగా యిమ్మని, చెట్టుకింద ఒంటరిగా ఉన్న నీ భార్య విషయం చెప్పి ఆమెను మా యింటికి తీసుకొని వెళ్ళాలనిచెప్పా. ఆ పెద్దమనిషి ఆ అమ్మాయిని రాజు వచ్చేంతవరకు మాకు తెలిసిన వాళ్ళింట్లో దింపు అని, ఆ యింటి అడ్రసు చెప్పాడు నీకు చెబుతానంటే ఆ పని వెంటనే అర్జంటని, రాజుతో చెపితే ఆతడు పెళ్ళాం దగ్గరకు చెప్పటానికి వెడితే ఆలస్యం అవుతుంది కాబట్టి నేను ఆమెను ఆ యింటిదగ్గర దింపుతున్న విషయం నీతో చెప్పవద్దని చెప్పాడు. ఆ పెద్దమనిషి ఇంత చేస్తాడని నేను ఊహించలా రాజూ ! నన్ను చంపేసినా పాపం లేదు".

'ఏమి చేసి ఉంటాడో?' పున్నయ్యలో ఉత్కంఠ పెరిగింది.

"నేను చేసిన పాపం ఊరికే పోతుందా ! ఆ డబ్బును కట్నంగా యిచ్చి చెల్లి పెళ్ళిచేసాం. కుక్కబుద్ధి ఊరికే పోదుగా" కట్నం డబ్బు ఖర్చు అయిపోయింది. పుట్టింటి నుండి ఇంకా డబ్బు తీసుకురా లేకపోతే పుట్టింటిలోనే ఉండిపో ఇక్కడకు తిరిగి రావద్దు. నీ గర్భానికి నాకు సంబంధంలేదని చెప్పి విడాకులు తీసుకొని మళ్ళీ కట్నం తీసుకొని పెళ్ళిచేసుకుంటా" అని చెల్లితో అన్నాడట. మా చెల్లి బిక్కచచ్చిపోయి ఇంటికి వచ్చి చెప్పింది. నేను నీకుచేసిన ద్రోహానికి ఫలితం ఎలా ఉందో అర్థమైంది".

"ఏమయింది వాడు ఆమెను తిరిగి కాపురానికి తీసుకొని వెళ్ళాడా లేదా వాడిని, వీడిని కూడా వదిలిపెట్టకూడదు" కోపం వచ్చింది పున్నయ్యకు.

"మొగుడుకి కోపం తగ్గి వస్తాడని, తనను తీసుకెడతాడని చెల్లి వాడిమీద ఉన్న పిచ్చి ప్రేమతో వాడికోసం ఎదురుచూసింది. కాని వాడు మరొక పెళ్లిని రహస్యంగా చేసుకొన్నాడన్న విషయం చుట్టాల ద్వారా విని నా చెల్లి బావిలో దూకి చచ్చిపోయింది. ఆ కోపంతో మా చెల్లిమొగుడ్ని చంపాలనుకొని వాడి దగ్గరకువెళ్ళి ఆవేశంతో పీకపిసకబోయాను. మా డబ్బు తిని తెగ బలిసినోడు అవటంతో వాడు నాతో కలియబడి నన్ను చంపి కిష్ణలో పడేస్తానంటూ గొంతు నొక్కి ఊపిరాడకుండా చేసాడు."

'అయ్యో అయ్యయ్యో ! కృష్ణ.. కృష్ణా..' పున్నయ్య మనసు బాధతో మెలికలు తిరిగింది.

"వాడిమాట నిజం చేసాడు. ఇదిగో ఇలా చివికిపోయి ఎముకల గుట్టలో కలిసాను. ఆ బొక్కముక్కలో రాజుది ఉందని నీవు దాన్ని పైకి తీస్తున్నప్పుడు తెలిసింది. నన్ను తిరిగి రాజు దగ్గర పడేస్తే వాడిని నన్ను ముక్కలుముక్కలు చేయమని అడుగుతా. అప్పుడే నా పాపపంకిలాన్ని ఈ కృష్ణమ్మనీళ్ళు కడుగుతాయి. అంతవరకు నేను ఆ బాధను అనుభవించాల్సిందే. నీకు పుణ్యం వస్తుంది. స్వార్థంతో మిత్రద్రోహం చేసిన నన్ను వాడు క్షమించడులే." గునగునమనే శబ్దం ఆగిపోయింది.

ఆ ఎముకపై జాలిపడాలో, కోపం తెచ్చుకోవాలో అర్థంకాక తికమకపడిన పున్నయ్య ఆ ఎముకను కోపంతో నీళ్ళల్లో విసిరేసి 'వలకోసం మర్రోజు రావచ్చులే పొద్దువాలుతోంది' కడుపు నకనకలాడుతుండగా పున్నయ్య ఇంటిముఖం పట్టాడు.

ఇంటికి వెళ్ళిన పున్నయ్యకు ఆవురావురుమని అన్నం తినాలనిపించి భార్యను కేకేసి వెంటనే అన్నంపెట్టమని చెప్పాడు. మొగుడు వెళ్ళి చాలాసేపయింది, బుట్టనిండా సేపలు తెస్తాడని, వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో కొత్తకోక తెచ్చిపెట్టమని అడగాలనుకొని ఎదురుచూసిన బెస్తవాని పెళ్ళాంకు నిరాశ మిగిలింది. చేపలు తేలేదెందుకు అని అడగాలనుకొన్నా, ఆకలితో వచ్చిన మొగుడికి ముందుగా అన్నం పెట్టి అడుగుదామనుకొంది.

అన్నం ముందు కూర్చొన్న పున్నయ్యకు ముద్ద మింగుడుపడటంలేదు. "ఏందయ్యా? బయట ఏమి అన్నా తిన్నావా? నీకు ఇష్టమని వంకాయ యిగురుకూర చేసాను. ఎండుచేపల పులుసుపెట్టాను". అంది. ఆ మాటతో పున్నయ్య ఉలిక్కిపడి అన్నం ముందునుంచి లేచి వెళ్ళిపోయాడు. భార్యకు ఆతని ప్రవర్తన కొత్తగా అనిపించింది. అడుగుదామని వెంటవెళ్ళిన భార్యతో పున్నయ్య "నన్ను కాసేపు విసిగించకు. నిద్రపోవాలి" అన్నాడు. ఏమి అనలేక ఆతని భార్య గిన్నెలను సర్దుదామనుకొంటూ లోపలి గదిలోకి వెళ్ళింది.

గుడిసె బయట ఉన్న నులకమంచం మీద పడుకొన్నమాటే గాని పున్నయ్యకు నిద్రపట్టటం లేదు. ఆకాశంవైపు చూస్తూ 'నక్షత్రాలు మినుకుమినుకుమంటూ నన్నే చూస్తున్నాయి. గొప్పమనుషులు చచ్చిపోయి పైన రిక్కలుగా ఉంటాయని ఎవరో చెప్పగా విన్నాను. ఆకాశంలో రిక్కలు, అమరావతి కృష్ణలో బొక్కలు. అంతా విచిత్రం. ఆ బొక్కల విషయాలే మళ్ళీమళ్లీ గుర్తుకువస్తున్నాయి. ఏమి బతుకులు బొక్కలవి, సత్తెం ఎక్కడోలేదు. ఆ బొక్కలలోనే ఉంది. సామీజీలు సత్తెం గురించి తెలుసుకోవటమే ముత్తి అంటారు. చేపలుపట్టే నాకు సత్తెం బోధపడింది. ఈ ఎరుకే నేను ఏం జెయ్యాలే పబోదిస్తోంది. చేపలుపట్టటం బతుకుతెరువేగాని, అంతకుమించి ఏదో చెయ్యాలి... కాని నేను ఏమి చేయగలను? కాని ఏదో చెయ్యాలి, ఏదోచెయ్యాలి. కలవరిస్తూనే పున్నయ్య నిద్రలోకి జారుకొన్నాడు.

* * *

మర్నాడు

చీకటిని చీల్చుకుంటూ ఉదయకిరణాలు చొచ్చుకొని తమశక్తిని ప్రసరిస్తున్నాయి. పాక బయటపడుకొన్న పున్నయ్యకు తనమీద నులివెచ్చని లేతకిరణాలు ప్రసరించేసరికి ఏదో కొత్తశక్తి వచ్చినట్టనిపించింది. వేపపుల్ల పుచ్చుకొని పళ్ళుతోముకుంటుంటే నిన్న ఆ సైంటిస్టు ఎముక చెప్పిన విషయాలు గుర్తుకువచ్చాయి. పంటి ఎముక, తుంటి ఎముకలు బాగా గట్టిగా ఉంటాయి. నిజమే అందుకనే పళ్ళు అంతగట్టిగా చాన్నాళ్ళు ఉంటాయి. గట్టి గట్టివన్నీ కొరుక్కు తినగలుగుతున్నాం. ఛీ.. ఎంతసేపటికీ తిండిగురించేనా. బతికున్నప్పుడేకాదు, చచ్చిన తరువాత కూడా అవి ఎన్నో ఆనవాళ్ళను తెలుపుతాయట. కాస్తగంజి తాగి వెంటనే వెళ్ళి ఈ రోజైనా నా వలను తెచ్చుకోవాలి' ఆరాటపడ్డాడు పున్నయ్య

లోపలకు వెళ్లేసరికి అప్పటికే భార్య గంజిపోసిన గరాటాను అందించింది. ముభావంగా ఉన్న భార్యతో "ఒసేయ్ ! కోపంగా ఉండకే.. ఈయాళ తొందరగా వస్తాలే. వస్తూ వస్తూ రంగు గాజులు తెస్తాలే. నీచేతులకు బాగుంటాయి" అంటూ భార్య చేయిపట్టుకొని నిమురుతూ ఒకసారి చిలిపిగా చూసి మూలనున్న రబ్బరు జాకెట్టును, నీళ్ళల్లో కాస్త కనపడే కళ్ళద్దాలు తీసుకొని ఒడ్డుకేసి నడిచాడు.

ఒడ్డు దగ్గరకు చేరుకొనేసరికి 'బావా !' అనే పిలుపు విని ముఖం తిప్పిచూసాడు. "బావా! నిన్న నీ పడవనుతెచ్చి ఒడ్డున లాకువేసి పెట్టాను. ఏమిటీ, ఎంతసేపైనా జాడలేకుండా ఉన్నావు.

ఇంతకీ నీ వలదొరికిందా?" అని అడుగుతుంటే ఏమి చెప్పాలో అర్థంకాక తికమకపడ్డాడు పున్నయ్య. "సరేలే బావా ! నా పడవలో కొంతదూరం వెడదామా. అక్కడ పెద్దచేపలు పడతాయి".

"అయితే వస్తానుండు. నిన్నటి నా వల చిక్కుకొనిపోయింది. తెచ్చుకుంటా" అన్నాడు. పున్నయ్య "ఓహో ! పెద్ద తుమ్మకొమ్మలు కొట్టుకొచ్చి నీళ్ళల్లో అడ్డంగా పడి ఉన్నాయేమో వాటికి వల పట్టి ఉంటుంది" అంటూనే బావమరిది వల విసిరేయటం, పున్నయ్య నీళ్ళల్లో దూకటం ఒకసారే జరిగింది. పున్నయ్య వలపట్టిన చోటుకు చేరుకొన్నాడు. ఎలాగైనాసరే ఈ రోజు వలను పైకి తీసుకురావాలి అనుకుంటూ వలను లాగబోతుంటే "తప్పెవరిది, తప్పెవరిది?" రాళ్ళలాంటి ఎముకలను వేగంగా కొట్టుకుంటున్న నీళ్ళు చప్పుడుచేస్తున్నాయి.

అదిరిపోయిన పున్నయ్య 'నిన్నటి శబ్దాలవంటివిలే మామూలేగా.' మనసులో అనుకొన్నా ముందుకు సాగలేకపోయాడు. వలలోని ఒక ఎముక పెద్దగా అరుస్తున్నట్టు అనిపించింది. అప్పుడే సైంటిస్టు ఎముక పున్నయ్యతో "మిత్రమా ! ఈ రోజు మళ్ళీ నీ వలకోసం వస్తావని ఎదురుచూస్తున్నా. ఇది కొత్త ఎముక. నిన్ననే నీళ్ళల్లో పడేసారు. ముందు వద్దని అనుకొన్నా. కాని ఆ ఎముకలో గూడుకట్టుకొని ఉన్న ద్వేషం తెలియాలని ఈ ఎముకలోకి కాప్స్యూల్ చిప్ ఏర్పాటుచేసా. దీని ఘోష వినపడుతుంది నీకు." అన్నాడు.

పున్నయ్య ఆ ఎముకను తీయబోయాడు. చాలా తాజాగా ప్రక్షాళన అయినట్టనిపించింది. వలలో పైకి కిందకు పడుతూలేస్తూ ఉంది. తేలికగా ఉండటంతో పున్నయ్య ఆ అస్థికను సులభంగా తీసి పట్టుకొని ఒడ్డుపైకి తెచ్చాడు. ఆ ఎముక ఇంకా గట్టిగా అరుస్తున్నట్టే అనిపించింది.

* * *

తొమ్మిదవ అస్థిక కథ

"తప్పెవరిది, తప్పెవరిది? అని ఆలోచించలేరు కాని కన్నపిల్లలను చంపానని నన్ను ఉరితీసినందుకు మీ మనసు ఇప్పుడు చల్లబడిందా? అమానుషం అని నన్ను తిట్టుకొన్నారుగాని ఆ పాపానికి వెనక ఉన్నదేంటో ఎవరికీ పట్టలేదు" ఆశ్చర్యపడుతున్న పున్నయ్య రబ్బరు జాకెట్టువేసుకొన్నా నీళ్ళల్లో ఎక్కువసేపు ఉండలేక ఆ ఎముకను చేతిలోకి తీసుకొని ఒడ్డును చేరుకొన్నాడు.

"నిజమే మమకారం చంపుకొని కన్నపిల్లలను చంపుకోవటం పాపమే. నవమాసాలు మోసి,

కనిపెంచిన మమతల మనసును అణచివేసిన లోగుట్టు పెరుమాళ్ళకెరుక. నాకు నా తల్లిదండ్రుల మీద పగ. దాన్ని పిల్లలమీద చూపించాను. అందుకే సమాజంచేత ఛీ కొట్టించుకున్నా బాధ పడలేదు.”

ఆ శబ్దాల భావాలకు పున్నయ్య మనసు స్పందించటం మొదలుపెట్టింది.

“నా పగకు అర్థం తెలిస్తే నా మీద సానుభూతి కలుగుతుందేమో? నిజమే పిల్లలను మట్టుపెట్టటం ఘోరపాపమే. నాకు నరకం వస్తుందని తెలుసు. నా అస్థికలు ఈ కృష్ణమ్మను అపవిత్రం చేస్తాయని, మిగల్చకూడదని యముడొచ్చి తీసుకెడతాడు. అందుకే ఇక ఆలస్యం చేయకుండా నా పగను నీకు తెలియజేస్తా...”

‘మనుషులలో పగలు, పతీకారాలే తప్ప పేమలు ఉండవా.’ పున్నయ్య మనసు విలవిలలాడింది.

ఆ ఎముక మళ్ళీ భావాల దొంతరలను విప్పింది. “నా తల్లిదండ్రులు ఆతడి ఆస్తిని రాయించుకోవటానికై నాకంటే చాలా పెద్దవాడైన వాడికిచ్చి నన్ను కట్టబెట్టారు. ఆనాడే వద్దని మొత్తుకున్నా. కన్నవారికి డబ్బుతప్ప కంటికి ఏమి కనపడలేదు. ‘మగపిల్లాడికోసం చూస్తే అందరూ ఆడపిల్లలే పుట్టారు. మా అదృష్టం ఇలా ఉంది. ఏంచెయ్యాలి. పెట్టి పోషించలేము. మిగిలినవారికి పెళ్ళిచెయ్యాలి. తింటానికి తిండే కరువు. రెక్కాడితేగాని డొక్కాడని యిల్లు. ఇంటాయన ఆరోగ్యం బాగాలేదు. ఆ యింటా ఈ ఇంటా అంట్లుతోమి బతుకు ఈడుస్తున్నాం. అందుకే నీకంటె పెద్దవాడైనా సరే, రెండోపెళ్ళి అయినాసరే అతడు రెండెకరాల భూమిని మా పేర రాసిస్తానని అన్నాడు. నీకు మాకు తిండికి కరవుండదని ఈ పెళ్ళిచేస్తున్నాం అంటూ నాకు బలవంతంగా పెళ్ళిచేసారు.”.

అయ్యయ్యో..! ఈ పిల్లను అంత వయసు తేడా వాడికిచ్చి పెళ్ళిచేసారా. దురదృష్టం. పిల్ల మనసులోని కోరికలను తెలుసుకోవటానికి వీలులేకుండా పేదరికం పెద్దశాపం పెట్టింది. పున్నయ్య మనసు రొదపెట్టింది.

“పెళ్ళిబట్టలతో మొగుడింటికి కాపురానికి వెళ్ళాను. భర్త వయసు మీరినవాడైనా అతనికి మొదటిభార్య విషయంలో కంటె నాతో సంపర్కమే ఎక్కువ తృప్తినిస్తోందని అనేవాడు. నాకుమాత్రం యాంత్రికంగా ఉండేది. నా మనసు ప్రమేయం లేకుండానే ముగ్గురు పిల్లలకు తల్లిని చేసాడు నా మొగుడు. పిల్లలమీద కాస్త మమకారం ఏర్పడింది. వాళ్ళు నా పిల్లలనే భావన మొదలైంది. వాళ్ళను విసుక్కుంటే వాళ్లు నా సొత్తు అని నా మనసు ఎదురు తిరిగేది.”

మరి ఎందుకు చంపావు తల్లీ ! పున్నయ్యమనసు ఘోషించింది.

“పగలు కూలిపనికి వెళ్ళినా ధరలు పెరిగిపోవటం, ప్రభుత్వ ఉచితాలు అందకపోవటంతో డబ్బుసరిపోక నా మొగుడు రాత్రిపూట కాపలాదారి ఉద్యోగంలో చేరాడు. పిల్లలు పడుకున్న తరువాత నా మనసు దేనికోసమో ఆరాటపడేది. రోజు నిద్ర పట్టక పిచ్చి ఎక్కేది. పిల్లలు కాస్త పెద్దవాళ్ళవుతున్నారు. మొగుడు తెచ్చే నాలుగు రాళ్ళు కూటికే సరిపోయేవికావు. మంచి తిండికి బట్టకు కరువు. నా మనసులోని చిన్నప్పటి కోరికలు నా వయసుతోపాటే పెరుగుతున్నాయి. ఒకరోజు కిరాణాషాపులో ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. మంచి క్రాపు, జీన్ ప్యాంటు నల్లకళ్ళద్దాలతో హుషారుగా కనిపించాడు. ఆ రోజునుంచి నామనసు నాలో లేకుండాపోయిందనేది నాకు తెలియలేదు.”.

బాబోయ్ !.. ఈ వివాహిత ఆ యువకుడిని యిష్టపడిందా ఏమిటీ.. కొంపదీసి. పున్నయ్య మనసు ఆందోళనతో కొట్టుమిట్టాడింది.

“ఆ యువకుడితో పరిచయం పెరిగింది. మెడలో నల్లపూసలు అడ్డమనిపించి వాటిని తీసేసాను. ఆ విషయంలో నా మొగుడికి ప్రశ్నించే సమయమే ఉండేది కాదు. పిల్లలు బడికి పోయిన తరువాత ఇద్దరం పార్కులో కలుసుకుంటూ ఉండేవారం. సహజీవనం అనుకొన్నాడో ఏమో ఆ తోటమాలి ఏమి అనేవాడుకాదు. ఆ యువకుడు కాదు కాదు.. నా ప్రియుడు నాకు ఎన్నో బహుమతులను తెచ్చి యిచ్చేవాడు. తనదగ్గర ఉన్న రెండవ సెల్ ఫోనును నాకు యిచ్చి మాట్లాడుతూ ఉండు అంటూ యిచ్చాడు. ఒకరోజు ఇంటికివచ్చాడు. పుట్టినప్పటినుండి బంగారం ముఖమే చూడని నాకు నెక్లేసు తెచ్చి యిచ్చాడు. ఆ నగ నాపాలిటి యమపాశం అవుతుందని ఆనాడు తెలియలా.. నన్ను మురిపించి తేల్చాడు. కోరికలతో రగులుకున్న నాకు మొదటిసారిగా సంతృప్తిని కలిగించాడు. అలా మొదలై రోజు రోజుకు నాలో కోరికలు పడగలిప్పటం, కానుకలను స్వీకరించటం షరా మాములైంది...”

ఏమిటమ్మా ! కోరికలు, కానుకలు. వివాహితవు. తిన్నాతినకపోయినా భర్తపిల్లలతో జీవితమే స్వర్గమనుకోవాలికదా ! నీది తప్పుకదా ! పున్నయ్య మనసు నిలవలేకపోయింది. తన భార్య యింటిదగ్గర ఎలా ఉందో అని మనసు కాస్త నీరసించింది..

“అయ్యా ! నీ మనసులోని భావాలు నాకు తెలుస్తున్నాయి. నువ్వు నాదే తప్పంటున్నావు. అందరూ అలానే అన్నారు. నా మొగుడికి తెలిసింది. పెళ్ళాంమీద చెప్పటానికి అందరూ రెడీగానే ఉంటారుగా”.

అయ్యో పాపం !.. అవును మగవాడికేనా పడకసుఖం. ఆడవాళ్ళదీ శరీరమేకదా ! దానికి సుఖం కావాలని అనుకోవటంలో తప్పుందా? ఆలోచనలో పడ్డాడు పున్నయ్య.

“పిల్లలు శెలవలకని వాళ్ళ నానమ్మ ఊరికి వెళ్ళినప్పుడు నా ప్రియుడు ఇంటికి వచ్చేవాడు. ఇలాంటి విషయాలలో ఇరుగుపొరుగువాళ్ళ నిఘా ఉంటుందిగా. నా మొగుడికి ఆ యువకుడి విషయం తెలిసి బెల్టుతో చావబాదాడు.

ఏ మొగుడైన పెళ్ళాన్ని దారిలో పెట్టాలంటే చేసే పని ఇదే.

నాలో తల్లిదండ్రుల మీద పగకు తోడు మొగుడి మీద కూడా పగ పెరిగింది. ఇక నుంచి నా ప్రియుడు ఇంటికివస్తే చంపేస్తానన్నాడు. మొదటిసారి నాలో భయం చోటుచేసుకుంది. నన్ను చంపితే నా పిల్లలు అనాథలవుతారని అనిపించింది. అప్పటికి మౌనం తప్ప నాకు ఇంకొకమార్గం తోచలేదు. ప్రియుడులేకుండా ఉండలేనని అనిపించి చచ్చిపోవాలనే ఆలోచనలు వచ్చాయి.”

అయ్యో తల్లీ ! పిల్లలను గురించి ఆలోచించాలి కదమ్మా ! ఆ మొగుడు కాసేపు ఆమె ఎందుకు అలాగా ప్రియుడితో గడుపుతోందో తెలుసుకొనే ప్రయత్నంచేస్తే బాగుండేది. పున్నయ్య మనసు చిన్నగా సమాధానం వెతుక్కుంటోంది.

“అలా రెండురోజులపాటు నా మొగుడి నిఘాలో గడిపాను. నేను బెదిరిపోయానని మళ్ళీ ప్రియుడితో మాట్లాడనని నా మొగుడికి కాస్త నమ్మకం వచ్చింది. ఊరికి వెళ్ళిన పిల్లలు ఇంటికి వచ్చారు. అమ్మో ! నేను చచ్చిపోతే పిల్లలను ఎవరుచూసేవారు. భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటే, ఆ వచ్చే సవతి వీళ్ళను సరిగా చూడదు. వాళ్ళు అనాథలుగా, దొంగలుగా మారుతారు అనే ఆలోచన వచ్చి, నేను చావకూడదని గట్టిగా అనుకొన్నా. పిల్లలు వచ్చారు కదా అని భర్త ఏమి ఇక జరగదులే అనే భరోసాతో కూలి పనికి వెళ్ళాడు. కాని గడ్డితినే మనసు చాలా గట్టిది”

కొంపతీసి బుద్ధిగడ్డితిన్నదా మళ్ళీ.. పున్నయ్య మనసు శంకించింది.

“ఫోన్ చేసి నా ప్రియుడికి జరిగినది అంతా చెప్పాను. ఇక మనిద్దరం కలవలేమని చెప్పాను. మధ్యాహ్నం ఇంట్లో పనిచేసుకుంటూ అంట్లు తోముకుంటుంటే తలుపు చప్పుడైంది. అనుమానంతో నా మొగుడే వచ్చి ఉంటాడని అనుకొన్నా. ఆ మసి చేతులతోనే వెళ్ళి తలుపుతీసాను. ఎదురుగా నా ప్రియుడు. మనసులో మోహం పొంగిపొరలింది. నీ కర్మ ఏమి కాలిందని ఈ పనులుచేస్తూ నీ మృదువైన చేతులకు మసిపట్టిస్తున్నావు. నాతో వచ్చెయ్. రాణిలాగా బతకొచ్చు. నిన్ను పువ్వుల్లో

పెట్టుకొని చూస్తాను. నా చేతులను నిమురుతూ అన్నాడు. అప్పుడు నాచేతులు చూసుకుంటుంటే నాకే అసహ్యం వేసింది.”

అలానే ప్రతివాడు మాటలతో మాయచేస్తాడు. ఆ మాయలో పడకూడదమ్మా. పున్నయ్య మనసు ఘోషించింది.

“మాయ ఏమో నాకు తెలియదు కాని నేను చెయ్యి కడుక్కొని వచ్చాను. నన్ను దగ్గరకు తీసుకొనిముద్దులతో నింపాడు. భర్త చేతిలో చావుదెబ్బలకు నా ప్రియుని ముద్దులు మందు రాస్తున్నట్లుగా అనిపించింది. నా గాయాలు తగ్గినాయి. కాని భయంతో దూరంగా జరిగి ఇకనుంచి నన్ను మరచిపొమ్మని చెప్పాను. భర్త పిల్లలను చూసుకోవాలి కదా అన్నా నువ్వు నాతో వచ్చేస్తే నీ భర్త మరో పెళ్ళిచేసుకుంటాడులే అన్నాడు. మరి పిల్లలో అన్నా...”

అమ్మయ్య ! నీ పిల్లలే నిన్ను కాపాడాలి పున్నయ్య మనసు కాస్త తేలికయింది.

“నా ప్రియుడు నా తల నిమురుతూ ఒహో ! అదా నీ బాధ.. నేనుండగా నీకు పిల్లలతో ఏం పని ? నీ జీవితంలోకి నీ ప్రమేయం లేకుండా ఎలా వచ్చారో అలాగే వెళ్ళిపోతారు అన్నాడు. ఎలాగా? అని ప్రశ్నార్థకంగా ప్రియుడివైపు చూసా. వాళ్ళను వదిలిపెట్టి నాతో నువ్వు వస్తే నీ పిల్లలు అనాథలుగా పెరుగుతారని భయపడుతున్నావా.? నేను చెప్పేది విను..

ఏమిటి చెప్పేది. వాడి మొహం పాడుగానూ. పున్నయ్య మనసులో కోపం కట్టలు తెంచుకుంటోంది.

“ఆ క్షణంలో నా మనసులో భయం చోటుచేసుకొంది. నీ మొగుడు పెద్దవాడవుతున్నాడు. ఇక కూలి పనిచేయటం కష్టమవుతుంది. పెళ్ళాం బిడ్డలను పోషించలేడు. పిల్లలను చదివించలేడు. పిల్లలు పెరిగి అడ్డ గాడిదలుగా తయారవుతారు. దొంగలుగా మారుతారు. అత్యాచారాలకు, హత్యలకు ఒడికడతారు. అమ్మో అని అరిచా. నామీద ప్రేమతో వారిమీద మమకారాన్ని చంపుకో. వాళ్ళకు ఎలాగైనా ఉరి తప్పదు. కాబట్టి చిన్నప్పుడే వాళ్ళను మట్టుపెట్టు. నాతో వచ్చెయ్ నీ కోరికలను తీర్చుకో అసంతృప్తులు పోగొట్టుకో. నా ప్రియుడు వెళ్ళిపోయాడు.”

అమ్మా.. తల్లీ ! వాడిమాటలు విని కన్నబిడ్డలను చంపుకుంటారా అమ్మా !... అలా చెప్పిన వాడు నీకు ప్రియుడా? నువ్వు ఎలాంటి వాడిని ఇష్టపడ్డావో అర్థమయిందా?.. పున్నయ్య మనసు ఆందోళన చెందింది.

"పిల్లలు బడి నుండి వచ్చి 'ఏమన్నా పెట్టమ్మా' అని అడిగారు. మధనపడుతున్న మనసుతోనే వారికి పల్లీలు పెట్టాను. వాళ్ళు ఆటలాడుకొని వచ్చేసరికి నా మనసు మారిపోయింది. మనసు ప్రియుడితో సుఖపడాలని ఆరాటపడుతోంది. ఆతడి దగ్గరే నాకు సుఖం. పగలు పనిమనిషిగా రాత్రి వేశ్యగా చూస్తున్న భర్త దగ్గర నాకేమి సుఖం ఉంది. ఈ జీవితం నుండి విముక్తి కావాలి. అతడి దగ్గరే కావలసినవన్నీ పొందగలుగుతాను. ఈ ముసలిమొగుడితో, పేదవాడి భార్యగా నేను సుఖపడలేను. ఈ పిల్లలను ప్రేమతో కనలేదు. నన్నడిగి నా పిల్లలు పుట్టలేదు. ఈ పిల్లలు నా సుఖానికి అడ్డు. వీళ్ళను వదిలించుకోక తప్పదు. "

'అయ్యో ! అమ్మతనం అంటే ఇదేనా? తమ కన్నపిల్లలను పక్షులు కూడా రెక్కలొచ్చేంతవరకు వదిలిపెట్టి వెళ్ళవుకదా.' పున్నయ్య మనసు గిలగిల కొట్టుకొంది.

"పొద్దుగుంకుతుంటే పిల్లలు వచ్చి అన్నం పెట్టమని అడిగారు. పదేపదే చెవులలో ప్రియుడు చెప్పిన మాటలు మారుమ్రోగుతున్నాయి. నాలో పైశాచికత్వం పడగలిప్పింది. పాలిచ్చి పెంచిన పిల్లలే నాకా క్షణంలో శత్రువులుగా అనిపించారు. మూలన ఎలుకలమందు కనపడింది. ఇక ఆలస్యం చేయకూడదని మనసు తొందరపెట్టింది. ప్రియుడు మీది మక్కువతో వాళ్ళుతినే పెరుగన్నంలో ఆ మందు కలిపేసి పెట్టా. 'కాస్తచేదుగా ఉందమ్మా' అంటే దానిలో కాస్త పంచదదార వేసా. తొందరగా తిని పడుకోమని చెప్పా".

కలికాలంలో అమ్మలకు దయ్యం పడితేనే ఇలాంటి పనులుచేస్తారు. భర్తపట్టించుకోకపోతే, పిల్లలను పోషించలేక వారికింత విషమిచ్చి తాను తిని చావటం విన్నాం. కాని ప్రియుడికోసం పిల్లలకు విషంపెట్టిన తల్లివి నువ్వొక్కదానివే అయ్యుంటావు. ఛీ, నిన్ను ఆ దేవుడు కూడా క్షమించడు. పున్నయ్య మనసు కకావికలమైంది.

"రోజు చదువుకోమని చెప్పే అమ్మ ఇవ్వాళ తొందరగా పడుకోమని చెప్పినందుకు ఆ చిన్నిగుండెలు వాళ్ళమ్మకున్న ప్రేమ ఎవ్వరికీ లేదనుకొన్నారు. చాపమీదకు ఒరిగారు. చూసేవాళ్ళకు హాయిగా నిద్ర.. కాదు శాశ్వతనిద్రలోకి వెళ్ళిపోయారు. నా మొగుడు తాను వచ్చేసరికి ఆలస్యం అవుతుందని బయటనే అన్నం తింటానని ఇంటిదగ్గర వాళ్ళ ద్వారా కబురు పంపాడు. 'అమ్మయ్యా' అనుకున్నా. ఏమిచేయాలో తోచటంలేదు. మొగుడు అడిగితే ఏమని చెప్పాలో తెలియటంలేదు. ప్రియుడువస్తే బాగుండునని అనుకొన్నా. నా ప్రేమంతా నా ప్రియుడిపైనే.. మొగుడు వచ్చేలోపే ఏదో ఒకరకమైన కారణాలను వెదకి నమ్మింపజేయాలి.."

ఛీ 'అమ్మవేనా? హంతకురాలా !' పున్నయ్య మనసు క్రోధంతో రగిలిపోయింది.

"పక్కింటి వాళ్ళను పిలిచి పిల్లలు బయట ఏదో మిఠాయి కొనుక్కొని తిన్నామని చెప్పారు. పిల్లలకు వాతం వచ్చి నిద్రలోనే బిగుసుకొని పోయారనిచెప్పా. వాళ్ళు నమ్మలా. నా ప్రియుడి గురించి వాళ్ళకి తెలుసుగా. పిల్లలు అడ్డని నేనే చంపానని నువ్వు అనుకున్నట్లే ఊరి జనం అనుకొన్నారు. నా మొగుడికి కబురుపెట్టారు.."

'నీకు ఉరి శిక్ష పడాలి !' పున్నయ్య మనసు కకావికలమైంది.

"నిజమే పోలీసులు వచ్చేలోపే, మా ఊరి జనం పొలిమేరలోని చింతచెట్టుదగ్గరకు నన్ను ఈడ్చుకెళ్ళి నా మొగుడి కళ్ళముందే ఉరిబిగించారు. విలవిల లాడాను. కాని నా మనసును వాళ్ళెవరూ తెలుసుకోవాలని అనుకోలేదు. తప్పంతా నాదే అన్నారు. అసలు తప్పెవరిది? బీద యింట్లో పుట్టి, పేదవాడి ఇల్లాలయినందుకా, వయసు కోరికలను ముసలివాడితో లేకపోయినందుకా.. కామ కోరికలు తీరకుండా, నా ప్రమేయం లేకుండా నన్నొక సంతానయంత్రగా మార్చిన భర్తదా? నేను పూర్తిగా ఎదగకముందుపే కడుపులోకి వస్తున్నామని చెప్పకుండా వచ్చిన నా పిల్లలదా? తప్పెవరిది? నిజమే లోకవిరుద్ధంగా అమ్మతనాన్ని అవహేళన చేసానని అనిపిస్తున్నా వాస్తవానికి వెనకాల ఉన్న పరిస్థితులను ఒకసారి కళ్లను మనసునూ జోడించి చూడండి నేను చేసినది పాపమా?"

ముమ్మాటికీ పాపమే ! పిల్లలను చంపకుండా వెళ్ళిపోయి ఉంటే సరిపోయేదిగా. పున్నయ్య మనసు ఉడికిపోతోంది.

"నేను భర్తను వదిలిపెట్టి ప్రియుడి దగ్గరకు వెళ్ళినా నన్ను ఈ లోకం బతకనిచ్చేదికాదులే. మీకు పాపమనే అనిపిస్తుందిలే. నేను నరకానికే వెడతానని అనుకున్నారుగా. కాదు, నన్ను మీరు ఉరితీస్తే నా ప్రాణం పోయిందేమోకాని. నా ఆత్మకి మాత్రం ప్రియుడితో గడిపిననాటి అనుభూతులే స్వర్గాన్ని గుర్తుచేస్తుంటాయి"..

పున్నయ్యకు వళ్ళు గగుర్పొడిచింది. "భవిష్యత్తులో ఇలా జరుగుతుందని వీరి పెళ్ళికి ముందుగా ఆమె మనసును కొలిచే యంత్రాన్ని కనిపెట్టి చెప్పే తెలివిని ఈ సైంటిస్టు కనిపెడితే, పిల్లలు చచ్చిపోకుండా ఉండేవారు. ఇలా జరగకుండా ఉండేది.. ప్చ్..." బాధగా పున్నయ్య హృదయం మూలిగింది.

"ఇంకా యిది ప్రచ్ఛాలనచెందాలి." పున్నయ్య ఆ అస్థికను తిరిగి నీళ్ళల్లో వేయగానే అది వెళ్ళి ఆ సైంటిస్టు ఎముకను అంటుకొంది.

పున్నయ్య నీళ్ళ లోపలికి వెళ్ళి వలను లాగుతుంటే “బెస్తమిత్రమా ! నువ్వు ఇప్పుడు విసిరిన ఎముకను ఒడిసి పట్టుకున్నది ఎందుకో తెలుసా. నీ భావాన్ని గ్రహించాను. నేను మునిగిపోతున్నప్పుడే ఈ కొత్త ఎముకలను కృష్ణనదిలో విసిరేసారు. అందుకే కొత్త ఎముకలైన ఈ రెండిటికి కూడా చివరగా ఎ ఐ క్యాప్స్యూల్ జొరబడేటట్టు నీటితోపాటు పీడనను కలిగించా. ప్రతి మనిషిలో భవిష్యత్తులో కలగబోయే ఆలోచనలను ఎముకలలోనే ఎలా నిక్షిప్తమయి ఉంటాయో కృత్రిమమేధతో తెలుసుకొనే పరిశోధన జరుగుతోంది. ఇదేదో జాతకాలు చెప్పేలాంటిదని మాత్రం అనుకోకు.”

ఆ పక్కనే పడున్న మరొక ఎముక గలగలచప్పుడుచేస్తూ “శరీరం ఉన్నప్పుడు నేను చేసిన తాంత్రికసాధనతో భవిష్యత్తును చెప్పగలను. కాని ఇలా ఎముకనయ్యా కదా. అయినప్పటికీ, నన్నొకసారి నీటిపైకి తీసుకొని వెడితే అమరేశ్వరుడిని చూస్తూ చెప్పగలనని“ దాని భావాన్ని నీటి చప్పుడుతో గొణిగింది.

‘పనిలో పని. ఇది ఎలా భవిచ్ఛత్తును చెప్పగలదో తెలుసుకుంటే పోలా !’ పున్నయ్య ఆ ఎముకను చేతిలోకి తీసుకొని ఒడ్డుమీదకు చేరుకొన్నాడు.

⁕ ⁕ ⁕

పదవ అస్థిక కథ

భవిష్యత్తును చెపుతాను అన్న ఆ మాటలకు కుతూహలం పెరిగిన పున్నయ్య తన అరచేతిలోని ఎముకను పూజ్యభావంతో చూస్తూ ‘సామీ ! నీకు విద్యలు తెలుసని అన్నావు. మరి ఇలా బొక్కగా మారే సంగతి నీకు ముందుగా తెలియదా?’ మనసులోనే మథనపడ్డాడు పున్నయ్య.

ఆ అస్థిక “శిష్యా ! నీ సందేహం అర్థం అయింది.” నాకు ముందే తెలుసు శివైక్యం అవుతానని. నన్ను గురువుగా తలచుకో ! నీకు నేను చెప్పే వింతవిషయాలు వంటబడతాయి.”

‘ఆఁ.సామి !’ మనసులో దండంపెట్టుకొన్నాడు పున్నయ్య.

“జాగ్రత్తగా విను నేను చెప్పేది. నేను పేదయింట్లో పుట్టా. తిండి లేక చిన్నతనంలోనే శరీరత్యాగం చేద్దామనుకొన్నా. మా ఊరికి వచ్చిన సాధువు తనతోపాటు తీసికొని వెళ్ళాడు. కొన్ని శ్లోకాలు నేర్పాడు. సాధువులా తిరుగు. బతుకుతెరువును చూసుకో అన్నాడు. నేను పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి చిన్నవయసులోనే కొన్ని మహిమలను పొందాను. కుంభమేళాలో అఘోరీసాములను చూసా.

వాళ్ళు ఎవరితోను మాట్లాడరు. వాళ్ళలోకం వాళ్ళది. మంత్రాలను మనసులోనే జపిస్తారు. అప్పుడు నాకు మంత్రోపదేశం అయింది నేను కూడా పైకి మంత్రాలను చదవను. మనసులోనే వారికోసం మంత్రాలను చదువుతూ వారికి మంచి చేస్తా. వాటితో జనాల్ని రక్షించాలని బయలుదేరాను. లోకకళ్యాణం కోసం సనాతనదీచ్ఛ పట్టా".

'చిత్తం సామి ! లోకకళ్యాణం అంటే పెళ్ళిళ్లు చేయించటమా !' పున్నయ్య మనసులో మరొ సందేహం.

"అవును శిష్యా ! బాగా గ్రహించావు. పెళ్ళికాని ఆడపిల్లలకు పెళ్ళి అయ్యేటట్టుచేస్తా".

మంచిదిసామి ! తల్లిదండ్రులు కట్నాలు యివ్వలేక ఆడపిల్లలకు పెళ్ళిళ్లు కావటంలా. వాళ్ళచుట్టూ పోకిరీలు తిరుగుతున్నారు. ఆ కన్నెలేమో ఎవర్ని పడితే వాళ్ళని ప్రేమించాడని నమ్మి వాళ్ళ మాయలో పడి తల్లిదండ్రులకు చెప్పకుండా వాళ్ళతో లేచిపోతున్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లలను పెళ్ళిపేరుతో మోసం చేయటానికి అబ్బాయిలు జేబులో పసుపుకొమ్మున్న తాళిబొట్టుదారాలను పెట్టుకొని రకరకాల వేసాలతో కన్నెపిల్లల మీద కన్నేసి తిరుగుతున్నారు. మీలాంటి సాములే వారిని కాపాడాలి." పున్నయ్య మనసు భక్తిభావంతో మొక్కింది.

"శిష్యా ! లోకం పోకడ బాగానే పసికట్టావు. అందుకే ఆడపిల్లలను నా ఆశ్రమంలో ఉంచుకొని మాతాదీక్షను యిప్పించి వాళ్ళకు పెళ్ళిళ్లుచేస్తా".

'ఈయన గొప్పసామి లాగున్నాడు' పున్నయ్య మనసు మరోసారి మొక్కింది.

"శిష్యా ! నువ్వు అనుకున్నదాంట్లో నిజం లేకపోలేదు. దానికి కూడా నా దగ్గర కొన్ని భైరవవిద్యలు ఉన్నాయి. ముందు ముందు నీకు కూడా నేర్పిస్తాలే."

'వద్దులేసామి ! నాకు ఆ విద్యలు వంటబట్టవు. నేనేదో చేపలు పట్టుకొని పెళ్ళాంబిడ్డలను పోషించుకొనే వాడిని. ఇంతకీ ఈ సామి శివైక్యం ఎప్పుడు చెందారో చెప్పనేలేదు.' తెలుసుకోవాలని పున్నయ్య మనసు ఉవ్విళ్ళూరుతోంది.

"శిష్యా ! నేను మంచి పనులు చేద్దామని అనుకుంటే జనం నన్ను నమ్మలేదు".

'అదేంటి సామి !' పున్నయ్య మనసు సందేహపడింది.

"నేను ఆడపిల్లలను రక్షిద్దామని అనుకొంటే ఒక అమ్మాయివచ్చి సామి ! నేనొక ఆశ్రమం

పెట్టి సేవచెయ్యాలనుకొన్నా దీవించండి అంది. నన్ను నమ్మి నా దగ్గరకు వచ్చిన ఆ అమ్మాయి తనని భర్త వదిలిపెట్టాడని, తనకు సంసారం అంటే రోత కలిగిందని, సేవచేసుకొని బతకాలనుకుంటున్నానని చెప్పింది. ఆ అమ్మాయి దగ్గర డబ్బు ఉందని గ్రహించా. సరే నువ్వుపెట్టే ఆశ్రమానికి నా తోడు ఉంటుంది అన్నా. అలా ఆమెకు మాతాదీక్షలో భాగంగా తాళి కట్టా. ఆ అమ్మాయి తనమెడలో తాళి పడగానే నన్ను తన మొగుడిగా భావించింది".

'ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడా ! ఈ సామి దొంగసామియా?' పున్నయ్య మనసులో ఆందోళన కలిగింది.

"ఆశ్రమం పేరుతో చాలా డబ్బు నాకు ఇచ్చింది. కొన్నాళ్ళకు అనుమానం వచ్చినా తన జీవితాన్ని బయటపెట్టదలచుకోలేదు. అది గ్రహించా నేను. ఎప్పుడు ఆ అమ్మాయి దగ్గరే ఉంటే లోకం ఒప్పుకోదని చెప్పి నేను మరొక ఊర్లో సంచారం మొదలుపెట్టాను. నేను కారుకొని డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెడుతుంటే కాస్త భక్తి ఎక్కువగా ఉన్న ఒక చదువుకొనే అమ్మాయి నా దగ్గరకు వచ్చి శివయ్యదీక్షను యిమ్మంది".

'మళ్ళీ లోకకల్యాణం కోసం బయలుదేరాడా ! ఈ దొంగ..' పున్నయ్య మనసు కుతకుతలాడిపోతోంది.

"ఆ అమ్మాయిని చూడగానే నాకు సరైన శిష్యురాలు దొరికిందని అనుకొన్నా. వయసులో ఉన్న ఆ అమ్మాయితో గిలిగింతలమాటలు మాట్లాడి ఆ పిల్లలో ఉద్రేకాన్ని కలిగించా. అంతే ఆ అమ్మాయి తన తల్లిదండ్రులను వదిలిపెట్టి నాతో లేచి వచ్చింది. పొట్టకూటి కోసం వేసుకొన్న సాధువేషం ఉద్యోగం చేసుకోవాల్సిన అవసరం లేని ఎన్నో డిగ్రీలవిలువ. రొట్టెముక్క విరిగి నేతిలో పడ్డట్టయింది. ఇద్దరం పెళ్ళిచేసుకొన్నాం. వేరే ఊరికి ఇద్దరం పరారయ్యేసరికి వాళ్ళు కేసుపెట్టారు.

'పోలీసులు నిన్ను పట్టుకొని చితకబాది ఉంటారు' పున్నయ్య మనసులో క్రోధం చోటుచేసుకుంది.

"ఆ విషయం తెలుసుకొని మేము పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంలో గడిపాము. నా భార్య అన్నదమ్ములు వచ్చి నన్నుకొట్టి వాళ్ళ చెల్లెను తీసుకొని వెళ్ళారు. నరమాంసం రుచిచూసిన పులిలా నేను ఆ అమ్మాయికోసం వాళ్ళ ఊరువెళ్ళాను. వాళ్ళు నన్ను ఎముకకు ఎముక, కీలుకు కీలు లేకుండా చితకబాదారు. సామి సమాధిలో శివైక్యం చెందాడంటూ చితాభస్మాన్ని ఊళ్ళో వాళ్ళకు చూపించి వాళ్ళందరి సమక్షంలో మిగిలిన నా ఎముకలను ఈ కృష్ణలో కలిపారు".

'మంచి పనిచేసారు. లోకకల్యానం అంటే ఇదే. అమ్మ దొంగసామి ! నేను కూడా ముందు నిన్ను నమ్మానుకదరా. ఇదిగ్రా.. నీ సనాతనదీచ్చ. ఛీ ! ఈ ఎముక నా చేతిలో కసేపు ఉంటే నా చేతులు కూడా కోసుకోవాలనిపిస్తుంది. దీన్ని కృష్ణలో కాదు. శునకాలకు ఆహారంగా విసిరెయ్యాలి. అమ్మో ! సాధువువేషంలో కొన్ని మేకవన్నె పులులుంటాయన్నమాట. "అమ్మాయిలూ జాగ్రత్త ! ఇలాంటి వాళ్ళను నమ్మకండి. దేవుడ్ని మనసులో తలచుకొండి. కష్టపడి చదువుకొని మంచి పనులు చేయండి. యవ్వనంలో వచ్చే ఉద్రేకాలను అదుపుపెట్టుకొంటూ ఇంట్లోనే కూర్చొని మౌనంతో సాధన చేయండి. మీకు మీరే గొప్ప జ్ఞానులు అవుతారు." పున్నయ్య పెద్దగా అందరికీ వినపడేలా అరిచాడు.

ఆ దగ్గరలోనే తచ్చాడుతూ తిరుగుతున్న కుక్క నోటి దగ్గరకు ఆ దొంగసామి బొక్కను విసిరేసాడు.

పున్నయ్య వలను తీసుకోవటానికి మళ్ళీ నీళ్లల్లోకి దూకాడు. వలమీద చెయ్యివేయగానే లోపలినుంచి బుడబుడ మనే శబ్దం వినపడింది. బుడగచప్పుడు అనుకుంటూ కళ్ళకు పెట్టుకొన్న నీటి అద్దాలతో చూడాలని ప్రయత్నించాడు.

"పిచ్చి నాకా ! నీకా ?" అన్నట్టుగా ఆ బుడగల చప్పుడు పున్నయ్య మనసుకు చెప్పినట్టనిపించి 'పిచ్చి ఏంది? దాని పిచ్చిఏమిటో !' తెలుసుకోవాలనిపించి పున్నయ్య ఆ బొక్కను పట్టుకొని నీళ్ళపైకి చేరుకొన్నాడు.

* * *

పదకొండవ అస్థిక కథ

"నాకు పిచ్చిపట్టిందని కొందరు, మానసికంగా బలహీనపడిందని కొందరూ ఎవరికి తోచింది వాళ్ళు అనుకొన్నారు. చివరికి డాక్టరు కూడా దాన్నే నమ్మాడు. నా మనసు తెలుసుకోవాలని ఎవ్వరూ ప్రయత్నించలేదు. కావాలంటే చచ్చిపోతాగాని ఆ నీళ్ళుతాగనని మొండికేసా. ఇదంతా పిచ్చి అనుకొన్నారు. నిజమే వాళ్ళు అలా అనుకోవటంలో తప్పులేదు. ఎందుకంటే నీళ్ళకి రుచిపచి ఉండదుగా. ఎంత దాహమేసినా నీళ్ళు తాగనంటోంది అని అందరూ బాధపడుతూ నా వేపు జాలిగా చూసేవారు తప్ప నేనుచెప్పిన మాటలను వాళ్ళంతా పట్టించుకోవటంలేదు. పైగా నన్నే పిచ్చిదాన్నంటున్నారు. నిజమే వాళ్ళంతా ఆ నీళ్ళే తాగుతున్నారు. కాని నాకు తెలిసిన సత్యం

వాళ్ళకి చెప్పినా అర్థం కావటంలేదు. కాదు కాదు అర్థమైనా అర్థం కానట్టుగా ఉంటున్నారు. అంతే ఏంచేస్తారు వాళ్ళు మాత్రం !"

'అందరూ పిచ్చి అంటున్నారంటే కొంత పిచ్చి ఉండే ఉంటుంది. ఆ పిచ్చి వెనకాల ఉన్న సత్యం ఏమిటో ఎలా తెలుస్తుంది.' పున్నయ్య మనసు ఆత్రపడింది..

"ఇదిగో నువ్వు మనిషివేకదా ! నా మనసు నీకన్నా అర్థం అయితే బాగుండు.." చేతిలో బొక్క చిన్నగా ప్రేలాపనలు చేస్తున్నట్టనిపించింది పున్నయ్యకు.

'అమ్మా ! చెప్పమ్మా ! నీకు పిచ్చి అని ఎందుకు అన్నారు వాళ్ళు. దానికి ఏదో కారణం ఉండి ఉంటుంది !'

"ఓ మానవా.. ! నేను డబ్భైఏళ్ళ ముసలిదాన్ని. నా మనసును అర్థంచేసుకోవాలనుకొన్న వాడివి నువ్వేదొరికావు. నీకు తెలియజెయ్యాలనిపిస్తోంది. అప్పుడు నాకు నిజంగా పిచ్చి ఉందో లేదో నువ్వే అర్థం చేసుకోగలవు.."

'నాకు అర్థం అవుతుందిలే తల్లీ !' పున్నయ్య మనసు స్పందించింది.

"ఇంట్లో పనితోనే సరిపోతుంది కాబట్టి సాధారణంగా నేను బయటకుపోను. ఒకరోజు నాకు జ్వరం వచ్చింది. రెండిళ్ళపక్కనే ఉన్న డాక్టరు దగ్గరకు మా ఇంటాయన తీసుకొని వెళ్ళాడు. ఆయన మందిచ్చాడు. తిరిగి ఇంటికి వస్తుంటే దారిలో మా ఇంటికి వేసిన నీళ్ళపైపు కనబడింది. చూసా. గుండె గుబేలుమంది. మళ్లీ పరీక్షగా చూసా... పెద్దమురుగు కాలువలో మునిగిపోయి పైకి కొద్దిగా కనబడుతున్న మునిసిపాలిటీపైపు లైను కనబడింది. ఆ పైపులైను నిండా తుప్పుపట్టిన చిల్లులనుండి ఉబుకుతున్న నీళ్ళు. పైగా ఆ కాలువను వంకరటింకరగా కట్టటంతో నీళ్ళు సాఫీగా వెళ్ళక అక్కడే గూడు కట్టుకొని నిలవ ఉన్నాయి. మా ఇంటాయనకు చూపించి ఆ నీళ్ళేకదా మనం రోజూ తాగేది" అన్నా.

"అవును. మున్సిపాలిటీవాళ్ళు నీళ్ళు బాగా వస్తాయని చెప్పి కొంత డబ్బుతీసుకొని ఇక్కడినుండి మనింటికి పైపులైను వేసారులే. అంతేలే. అటుచూడకు పద, తొందరగా పద అంటూ నన్ను ఇంటికి తెచ్చాడు. మందువేసుకోమంటూ నీళ్ళగ్లాసు తీసుకొనివస్తే నాకు ఆ పైపులైను నుండి వచ్చిన మురుగునీళ్ళు కదా అనిపించింది. తాగనన్నా. మందేసుకోవటానికి భయపడుతున్నా అని అనుకొన్నాడు. ఆ నీళ్ళు.. అంటూ ఏదో చెప్పబోతుంటే 'ముందు మందేసుకో తరువాత చెప్పుదువు..' అంటూ తొందరపెట్టాడు. నీళ్ళగ్లాసు నోటికి అందించగానే భళ్ళున డోకు వచ్చింది".

'అయ్యోతల్లీ..' పున్నయ్య మనసు బాధపడింది.

"జ్వరానికి తోడు ఈ డోకులు కూడా వచ్చాయి. నా భర్త భయపడి మళ్ళీ డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. ఆయన మళ్ళీ మరొక మాత్ర యిచ్చాడు. మా ఇంటాయన మళ్లీ మాత్ర తెచ్చి వేసుకోవటానికి నీళ్ళగ్లాసు అందిచ్చాడు. మళ్ళీ డోకు. నేను తాగను మురుగు నీళ్ళు అన్నా. దానికి మా ఇంటాయన ఇన్నాళ్ళనుండి ఆ నీళ్ళే తాగుతున్నాము కదా ఇవ్వాళే ఎందుకు తాగనంటున్నావు అని అడిగాడు. అప్పుడు అనిపించింది. అజ్ఞానమంత సుఖంలేదని ఆ నీళ్ళని ససేమిరా తాగనన్నాను."

'నిజమే కలుషితమైన నీళ్ళు తాగితే ఇంకొక జబ్బుకూడా వస్తుంది'. పున్నయ్య మనసు గిలగిలా కొట్టుకుంది.

"మున్సిపాలిటీ వాళ్ళకు మా ఇంటాయన చెప్పిచూసాడు. మీరొక్కళ్ళకేనా అందరి ఇళ్ళకీ పైపులైన్లు ఇలానే ఉంటాయి. అని వాళ్ళు పట్టించుకోలేదు. ఏమిచెయ్యాలో తెలియక మా ఆయనకు నామీద మొదటిసారి కోపం వచ్చింది. మందేసుకుంటావా లేదా అని నా వేపు కళ్ళెర్రచేసి చూసాడు. నేనేమి భయపడలేదు. సత్యానికి భయముండదుగా. చేదుగా ఉన్నా వట్టి మాత్రనే మింగాను. గొంతుకు అడ్డంపడింది. అయినా సహించాగాని ఆ నీళ్ళు తాగబుద్ధి వేయలేదు. మనం ఒక్కళ్ళం అడిగితే పైపులైను మార్చరు గాని వీధిలో వాళ్ళంతా కలిసి మొరపెట్టుకుంటే పైపు లైను మారుస్తారేమో చూడమని మా ఇంటాయనను అడిగా"

"ఈ వీధిలో ఉండే ఇళ్ళవారితో మాట్లాడా. కాని వాళ్ళు.." "మున్సిపాలిటీవాళ్ళు పట్టించుకోరు. మేమంతా తాగటంలేదా ! నీళ్ళవల్ల ఏదైనా అనారోగ్యంవస్తే మందులేసుకోవాలిగాని మేము ఏమి చేయలేమని వాళ్ళు చేతులెత్తేసారు"..

అలా అనటమేమిటండీ?

"పిచ్చిమొద్దూ ! వీధిలో చాలామంది రూల్సుకు వ్యతిరేకంగా బజారు వరకు ఇళ్ళను పెంచి కట్టుకున్నారు. ఇప్పుడు అడిగితే వాళ్ళ ఇళ్ళనే లేపేస్తారని వాళ్ళ భయం".

"అదేమిటి? అలా కట్టుకుంటుంటే మున్సిపాలిటీవాళ్ళు ఎందుకు ఊరుకొన్నారు "

"మరి లంచాలను మరిగిన వాళ్ళు చూసిచూడక వదిలేస్తారులే" అన్నాడు మా ఇంటాయన

"నాకు వళ్ళుమండింది." కంప్లైంటు ఇద్దామన్నా.."

"పైకి పెద్దగా అరవకు. నీ మాటలు ఆనోటా ఈనోట వ్యాపించి నిజమే అనుకొని వీధిలోని

కబ్జాదారులు మనల్ని బతకనీయరు. సమాజంపోకడ నీకు అర్థంకావటం లేదు. నాకు మాత్రం తెలియదా, నువ్వు ఎందుకు నీళ్ళు తాగనంటున్నావో. నీ కోసం రిగ్గు వేయుస్తాలే" అన్నాడు.

"మర్రోజు కూడా నేను నీళ్లు తాగకపోయేసరికి మా ఇంటాయన బోరుపంపు వేయించాడు. ఆ నీళ్ళైనా తాగి భార్య బతుకుతుందనుకొన్నాడు. నేను దొడ్లోకి వెళ్ళి రిగ్గువేసిన చోటును చూసా.. అంతే ఇక్కడ ఎందుకు వేసారని అడిగా మా ఆయనను. ఈశాన్యం మూలన ఉండాలని అక్కడే బోరుపంపు వేశారులే" అన్నాడు.

"అయ్యబాబోయి ! అదేంటండీ ఇంటి వెనకాలవాళ్ళు తమస్థలానికి ఆగ్నేయం అని మన గోడంబటే లెట్రిను టాంకు కట్టారుకదా. పైపెచ్చు మలం కాస్త భూమిలోకి ఇంకేటట్టు కట్టారని ఆ ఇంటావిడే చెప్పింది. అక్కడే బోరువేస్తే నేనెలా తాగుతాను"

"మళ్ళీ మొదలుపెట్టావు. మళ్లీ మొదటికి వచ్చిందని మా ఆయన విసుక్కోవటం, కసురుకోవటం మొదలుపెట్టాడు. నేను నీళ్లు తాగలేకపోవటం, నాకు పిచ్చి పట్టిందని నీళ్ళులేకుండానే మాత్రలు మింగించటం షరా మాములే".

'అయ్యోతల్లీ ! ఎంత కష్టం వచ్చిందీ' పున్నయ్య మనసు బాధతో మూలిగింది.

"మర్నాడు కాస్త జ్వరం తగ్గింది. లేచి మొహం కడుక్కుంటుంటే ఆ మురుగుకాలువ అందులోనుండి వచ్చిన పైపులైను కళ్ళముందు కదలాడాయి. ఆ మధ్య కూడా నీళ్ళువాసనవస్తుంటే మంచినీళ్ళబిందె సరిగా తోమలేదని మళ్ళీ మళ్ళీతోమి పట్టినా వాసన వచ్చేది. ఆనాడు నా భ్రమ అనుకొన్నా. కాదు కాదు. నాది భ్రమ కాదని అర్థమయింది. ఇక ఆ నీళ్ళుతాగకూడదని నిశ్చయించుకున్నా".

"అయ్యో అదేమిటమ్మా ! ఎలా బతుకుతావు..?" పున్నయ్య మనసు కకావికలమైంది.

"ఇంట్లో వాళ్ళకుచెప్పినా వాళ్ళు రోజువారి అలవాటుగానే తాగేవాళ్ళు. బహుశ వాళ్ళు ఏమిచేసేది లేక ప్రాణాధారంలాంటి నీళ్ళను తాగకుండా ఉండలేక అలా అలవాటు పడ్డారని అనిపించింది. కాని నేను తాగకుండా ఎన్నాళ్ళని ఉంటాను. ఎలా బతుకుతానని ఇంట్లో వాళ్ళందరూ ఆందోళనలో మునిగిపోయారు. డాక్టర్ల దగ్గరకు తీసుకెడుతున్నారు. నాకు మానసిక రోగమన్నారు వాళ్ళు. మందుబిళ్ళలను నీళ్ళతో వేసుకోవటంలేదని పిచ్చికుదరటానికి ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఆ మందులకు నాకు మగతవచ్చేది కాని నా మనసు ఆందోళనగానే ఉండేది. నా రోగం గురించి తెలిసి నన్ను చూడటానికి ఇంటికి వచ్చిన బంధువులందరూ నాకు పిచ్చిపట్టిందనే అనుకొన్నారు".

'అయ్యో ! నీకు కాదమ్మా పిచ్చి వాళ్ళకే' పున్నయ్యమనసు ఆమె మనసుకు మద్దతు ఇచ్చింది.

."అలా ఎన్నాళ్ళు చివరికి నీరసించి నీరసించి చచ్చిపోయాను. నా శవాన్నిచూడటానికి వచ్చిన వాళ్ళందరూ చనిపోయే చివరిరోజుల్లో పిచ్చిగా బతికింది. ఇక ఈ జీవికి పిచ్చి చచ్చిపోయిందిలే.. ఎవరికి తోచింది వాళ్ళనుకోటం అక్కడక్కడే తిరుగుతున్న నా ఆత్మకు తగిలి నేను చచ్చిన తరువాత కూడా నన్ను చూడటానికి వచ్చినవాళ్ళు 'పిచ్చిది' అంటుంటే నా ఆత్మ మరింత పిచ్చిదయింది."

'అయ్యో ! పిచ్చి తల్లీ !'

"నాకు ఆ నీళ్ళతో శవ స్నానం చేయకుండా ఉంటే బాగుండునని అనుకొన్నా. ఎప్పుడు నన్ను తగలబెడతారా అనీ, ఎప్పుడు నా అస్థికలు ఈ కృష్ణమ్మలో కలుపుతారా. అన్నాళ్ళు నేను తాగిననీళ్ళ కాలుష్యాన్ని కడిగేసుకోవాలని నా మనసు ఆరాటపడింది. సేదతీరాలనిపించింది.. నా శవం ముందు మా ఇంటాయన నిస్సహాయపు చూపుల్తో నన్ను నమ్మించలేక పోయినందుకు బాధపడ్డాడు. నాకా పిచ్చి? సమాజానికా? మునిసిపాలిటీకా? లంచగొండులను పట్టించుకోని ప్రభుత్వాలకా? ఎవరికి? ఎవరికి పిచ్చి నువ్వైనా చెప్పు తల్లీ! చాముండేశ్వరి దేవీ!".

'నీకు పిచ్చి అన్నవాళ్ళకేనమ్మా పిచ్చి..' పున్నయ్య మనసు ఆక్రోశించింది.

"నువు చెప్పు అన్నా !. నాకు పిచ్చిపట్టిందా నన్ను పిచ్చి అన్నవాళ్ళకు పిచ్చా !. శుభ్రమైన చోటనుండి పైపులైను వేసి మంచినీళ్ళు అందించని పాలకులదా ? ఆలోచించు".

ఆ తల్లి బొక్క విలపించినట్టనిపించిన పున్నయ్య ఆ ఎముకవైపు చేరిపార చూసాడు..

ఆ ఎముకలో నుండి బొటబొటా నీళ్ళుతపతపమంటూ కృష్ణమ్మవైపు జాలువారుతున్నాయి.

"పిచ్చి నీకు కాదమ్మా!.. నీ సమస్యను అర్థం చేసుకోలేని వాళ్ళకేనమ్మా ! పిచ్చి". పున్నయ్య కళ్ళల్లో నుండి వచ్చిన కన్నీళ్ళు ఆ బొక్కను తడుపుతున్నా అది మరింతగా తేలికయినట్టనిపించి ఆశ్చర్యంగా చూసాడు.

ఆ ఎముకను అతి పవిత్రంగా పట్టుకొని పున్నయ్య మళ్ళీ నీళ్ళలోకి దూకి ఆ అస్థికను వల పక్కన స్వచ్ఛమైన నీటి అడుగున జాగ్రత్తగా ఉంచాడు. వలను తీసుకెళ్ళలేనా అని పున్నయ్యకు బలహీనత ఆవరించింది. అయినా ప్రయత్నిద్దాం అని అనుకుంటుంటే "వాడు నా కడుపున చెడపుట్టాడు. వాడ్ని బతకనీయొద్దు"... పెద్ద పెద్దగా మరో కన్నతల్లి ఆక్రోశానికి గగుర్పాటు కలిగింది

పున్నయ్యకు. ఆ ఎముక ఆక్రోశానికి మది చలించిన పున్నయ్య ఆ తల్లి ఎముకను అరచేతిలో పట్టుకొని ఒడ్డుకు చేరాడు.

❊ ❊ ❊

పన్నెండవ అస్థిక కథ

ఆ ఎముక మధ్యలో కొంత చితికినట్టుంది. 'ఈ ఎముకను ఎవరైనా బలంగా కొట్టి ఉండవచ్చు. ఈ బొక్క బాధ ఏమిటో తెలుసుకోవాలి. ఇప్పుడు తెలుసుకొని మాత్రం ప్రయోజనం ఏమి ఉందిలే. కాని ఆ ఎముక బాధను తెలుసుకొనే వాళ్ళున్నారంటే ఆ జన్మాంతర దుఃఖం కొద్దిగా తీరుతుందేమో' పున్నయ్య ఆ ఎముకవేపే తదేకంగా చూస్తూ మనసులో బాధ పడ్డాడు. ఇంతలో ఆ అస్థికమధ్యలో ఉన్న పెద్దకన్నం నుండి జలజల నీళ్ళు పిండినట్టు బయటకు వస్తున్నాయి.

"నా కెందుకు ఈ ఆడపుట్టుక వచ్చింది. మేము ఈ అమరేశ్వరుడి దగ్గర ఊరిలోనే ఉండే వాళ్ళం. చచ్చిన తరవాత ఎముకలను కృష్ణలో కలుపుతారుకదా కాని బతికినన్నాళ్ళు నే పడ్డబాధను మరచిపోవచ్చునుకొన్నా. ఇప్పుడు ఈ కృష్ణమ్మ ఒడిలో సేదతీరుతుంటే ఎవరో నన్ను ఒడ్డుకుతెచ్చి పాపం మూటకట్టుకోవాలనుకుంటున్నాడు. పూర్వజన్మలో చేసిన పాపమేమిటో"....ఆ ఎముకలో నుండి భావప్రవాహం ఉబికి ఉబికి వస్తోంది. పున్నయ్య మనసు విలవిల లాడింది.

'తల్లీ నీ మాటలు విన్న తరువాత నా మనసు చలించిపోయింది. నీ కొడుకుమీద అంత ద్వేషం ఎందుకు కలిగిందో, నాకు కూడా ఒక కొడుకున్నాడమ్మా. నీ బాధను నాతో పంచుకోతల్లీ' అని పున్నయ్య మనసు గిలగిలకొట్టుకుంది.

ఆ బొక్క తనలోని నీళ్ళను కక్కుతూ "ఏమి చెప్పాలి ఒక్కగాను ఒక్క కొడుకని అల్లారు ముద్దుగా పెంచాము. చిన్నప్పుడు బాగానే ఉన్నాడు. పదహారేళ్ళు నిండాయి. చెడుస్నేహాలు అబ్బాయి. గంజాయి అలవాటయింది. డబ్బుల కోసం రోజు పీక్కు తినేవాడు. ఒక రోజు డబ్బులు లేవన్నందుకు తండ్రిని గోడకేసి బాదాడు. ఆ రోజు పడిపోయిన ఆ తండ్రి మళ్ళీ లేవలేదు. మానసికంగా నలిగిపోయి గుండె జబ్బు ఎక్కువై నా పెనిమిటి చనిపోయాడు.

'అయ్యో !. రామ రామ !' పున్నయ్య మనసులోనే బాధపడ్డాడు.

"ఆనాటినుండి నాలో భయం ఆవరించింది. తండ్రిపోయినప్పుడైనా వాడిలో మార్పు వస్తుందేమోనని ఆశపడ్డా. ఇంటి మగదిక్కు పోయేసరికి ఇక తనకు ఎదురులేదనుకొన్నాడు. పొలం

అమ్మేసాడు. ఊరంతా అప్పులు చేసాడు. వాళ్ళు ఇంటిమీదకు వచ్చి అప్పు జమకింద ఇల్లు తమకు అమ్మినట్టు రాయించుకొన్నారు. నేను ఎక్కడికిపోవాలి ఎక్కడ ఉండాలని అయోమయంలో పడిపోయాను. రెండు రోజులకు తేరుకొని నన్ను నేను సంబాళించుకొని అక్కడ బతకలేక, కొడుకుకు కూడా చెప్పకుండా వేరే ఊరికి చేరుకొని పొట్టపోసుకుంటుండేదాన్ని..”

‘ఎంత కష్టం వచ్చింది తల్లీ’ పున్నయ్య తనలో తనే అనుకొన్నాడు.

“ఒక ఏడాది గడిచిందో లేదో ఒక రోజు ఊరిమీద పిడుగు పడ్డట్టు నా కొడుకు ఒక అమ్మాయిని పెళ్ళిచేసుకొని ఇంటికి తెచ్చాడు. కొడుకుకు కాస్త బాధ్యత తెలుస్తుందిలే బాగుపడతాడని అనుకొన్నా. వీడి నాన్న మళ్ళీ నా కోడలి కడుపున పుడితే చూసుకోవచ్చని అనుకొన్నా. కాని వాడు మారలేదని పెళ్ళాన్ని జుట్టుపట్టి ఈడ్చి కొట్టిన రోజే అర్థమయింది.”.

‘నిజంగా ఆడపుట్టుక కష్టాలకోసమే పుట్టిందేమో’. పున్నయ్య మనసుకు తోచింది.

“పాపం ఆ అభాగ్యురాలు ఏం చేస్తుంది. ప్రేమించాననంటే నమ్మి మోసపోయింది. నా సంపాదనతోనే ముగ్గురం తింటున్నాం. పుట్టింటివాళ్ళ దగ్గర నుండి డబ్బు తెప్పించమన్నాడు. ఆ అమ్మాయి నేను అడగను అంది. అంతే ఇష్టమొచ్చినట్టు ఆ అమ్మాయిని చావబాదాడు. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు అని ఆ అమ్మాయి వీడ్ని వదిలిపెట్టి వెళ్ళిపోయింది.

‘ఆ అమ్మాయి మంచి పని చేసింది’.. పున్నయ్య మనసు కాస్త ప్రశాంతతను పొందింది. ఇంకా ఆ బొక్కలో నుండి నీళ్ళు ఉబికి వస్తూనే ఉన్నాయి.

“ఒకరోజు నన్ను తాగటానికి డబ్బులు అడిగాడు. నా దగ్గరలేవు అన్నా అంతే ‘ముండా..! ఎక్కడెక్కడో తిరిగి బాగానే సంపాదిస్తున్నావ్ కదే, డబ్బు ఇస్తావా, చస్తావా?’ బెదిరించాడు. వీడెందుకు మళ్ళీ నా యింటికి వచ్చాడు వీడిని వెళ్ళగొట్టాలని అనుకొన్నా. మనసులో కన్న మమకారం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఇక్కడినుండి వెళ్ళిపో అని అరిచా..”. ‘నువ్వు అసలు తల్లివేనా’ అని నా అమ్మతనాన్ని అపహాస్యంచేసాడు. దేవుడు నాకెందుకు ఈ ఆడపుట్టుకనిచ్చాడని దుఃఖం వచ్చింది. డబ్బిస్తే వెడతానన్నాడు. నాదగ్గరలేవని గట్టిగా అరిచా. అంతే కోపంతో రగిలిపోతూ మీదమీదకి వచ్చి నాగుండెల మీద పిడిగుద్దులు గుద్దాడు.”

‘అయ్యో తల్లీ.. ! ఆ నీచుడికి దూరంగా వెళ్ళకపోయినావా తల్లీ ఈ రోజు నీకీ స్థితి వచ్చేది కాదు.’.. పున్నయ్య మనసు గంభీరం అయింది.

"ఛీ.. వీడికా పాలిచ్చి పెంచాను. ఆనాడే నాకెందుకీ ఆడజన్మను ఇచ్చావని పెద్దగా ఏడ్చాను. కన్నతల్లి అని కూడా చూడకుండా 'ఏమిటే? మర్యాదగా డబ్బులిమ్మంటే ఇవ్వనన్ని ఏడుస్తున్నావా ఇక నీకు నూకలు నిండాయి. అందుకే ఇంత మొండికేస్తున్నావు ఆడవాళ్ళంతా మొండివాళ్ళే. వీళ్ళను బతకనీయకూడదు' అంటూ తనని నవమాసాలు మోసిన నా కడుపు మీద బలంగా కాళ్ళతో ఎడాపెడా తన్నాడు. కాదు కాదు కుమ్మేసాడు. కుప్పకూలాను. తరువాత నా ఎముకలు ఈ నీళ్ళలోకి ఎలా వచ్చి పడ్డాయో నాకు తెలీదు".

"అయ్యో ! అయ్యో ! అనుకున్నంతా జరిగిందీ. కన్నతల్లిని కడదేర్చినవాడు కొడుకే కాదు. ఛీఛీ ! వాడు మనిషేకాదు." పున్నయ్య మనసు పెద్దగా గావుకేక పెట్టింది. చుట్టూర ఉన్న మనుషులు' పిచ్చివాడులాగా ఉన్నాడు' పున్నయ్యవైపు తేరిపారజూస్తున్నారని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు పున్నయ్యకు.

"ఎముకలకు లింగ భేదం ఉండదుగా. శరీరం ఉంటే కన్నకొడుకు కూడా చంపటానికి వస్తాడు. బహుశ నా ఎముకలన్నా సేదతీరుతాయంటూ ఆ అమరేశ్వరుడే నన్ను ఈ కృష్ణమ్మతల్లి ఒడిని చేర్చి ఉంటాడు. కాని కడుపున చెడబుట్టిన కొడుకును మరిచిపోలేక నా ఎముకలలో దాగిన నిప్పులాంటి నిజాలు లోకానికి తెలిస్తే కొడుకులు పుట్టాలని ఏ స్త్రీకూడా ఆశపడకూడదనే సత్యాన్ని తెలియచెసి పుణ్యంకట్టుకో. నా చివరి ఆశయం కూడా ఇదే. అందుకే నా అస్థికలలోని నీళ్ళు తన్నుకొచ్చి బయటకు రావాలని తపనపడ్డాయి. నన్ను మళ్ళీ ఆ నీళ్ళలోనే ఉండనియ్యి. నేను ఈ లోకాన్ని భరించలేను. ఆ చాముండేశ్వరిని తలచుకుంటూ పడి ఉంటే నాకు ముక్తి కలుగుతుంది. నా జీవితం నీకు అర్థమయి ఉంటుంది. నువ్వే లోకంలో మంచి కొడుకులుగా వాళ్ళు ఉండకపోతే, అలాంటివాళ్ళను మట్టుపెట్టాలి. లేకపోతే కొడుకుల చేతులలో తల్లులు హతమౌతారు" అంటూ బొటబొటా నీళ్ళను వదిలింది.

చేతిలో ఎముక కాస్త తేలికయింది. 'అయ్యో ఈ బొక్క కోరికతీర్చి నేను కొడుకులు చేసిన పనులకు పాప పరిహారం చేయాలి.' పున్నయ్య కృష్ణమ్మ ఒడిలోకి దూకి వల పక్కనే ఆ తల్లి ఎముకని భద్రంగా పెట్టాడు.

తన వలమీద చేయివేయగానే "ఒరేయ్ ! దుర్మార్గుడా ! నన్ను పొట్టనపెట్టుకున్నావు కదా. నువ్వు ఒక మనిషివేనా? నీ చదువులు ఇవేనా? నీకంటే చాకలాడు మంచి వాడుకదరా ! నమ్మి నీ దగ్గరకు రావటమే నేను చేసిన తప్పురా. వట్టి పుణ్యానికి చంపావు కదరా ! చచ్చిన తరువాత

అయినా నా రోగం తగ్గిపోతుందని నావాళ్ళు ఈ కృష్ణమ్మలో నన్ను పడేసి పుణ్యం కట్టుకొన్నారు".. కృష్ణమ్మ సుళ్ళుతిరుగుతోంది.

పున్నయ్యలో ఉత్కంఠ చోటుచేసుకొంది. రెండునిముషాల కంటే నీళ్ళల్లో ఉండలేక ఆ ఎముకను పొదవిపట్టుకొని నీళ్ళపైకితెచ్చి ఒడ్డున కూర్చొన్నాడు. పున్నయ్యకు ఆ ఎముకలో దాగున్న వ్యధలను తెలుసుకోవాలనుకోవటంలో విసుగు తగ్గి సత్యాన్వేషణ చేస్తున్నట్టు అనిపించింది.

పదమూడవ అస్థిక కథ

"ఓ డాక్టరూ ! ఛీ..! నిన్ను ఆ పేరుతో పిలవాలన్నా అసహ్యంగా ఉంది. వైద్యుడు అంటే ప్రాణాలను నిలబెట్టేవాడని నమ్మి రోగులు నీ దగ్గరకు వస్తారురా. నువ్వొక తెల్లబట్టలేసుకొన్న హంతకుడువి. చాకులతో విద్య నేర్పింది శరీరాన్ని కోయటానికే గాని వాటిని కత్తుల కింద మార్చి మనుషులదేహాన్ని కుళ్ళబొడచటానికి కాదురా. ఆఫీసులో నలతగా ఉండి మెడికల్ షాపులో మాత్ర కొనుక్కొని వేసుకుందామని రోడ్డుమీదకు వచ్చా. కాని అలాంటి మందులు వేసుకోవద్దని డాక్టర్లు టీవీలలో చెబుతుంటారని గుర్తుకు వచ్చింది. పైగా ఊళ్ళో అంటురోగాలు ఉన్నాయని ఆ నోట ఈ నోట చెప్పుకుంటుంటే విన్నా. అందుకని ఆసుపత్రికి వెడితే ఏ భయం ఉండదు దారిలోనే ఉంది కదా ఆస్పత్రి అని నీ దగ్గరకు వచ్చా"..

'మంచిపని చేసావుగా సామి !' పున్నయ్య మనసుకు రోగం తగ్గినంతగా అనిపించింది.

"జరం వచ్చిందని ఇంటికి వెడుతూ నీ దగ్గరకు వస్తే ఇంజెక్షను చేసావురా... వళ్ళంతా విషమెక్కి నట్టయిందిరా. విలవిల లాడిపోయా. నా ఇంటికి ఫోనుచేసి చెప్పా. వాళ్ళు వచ్చి చూసేసరికే నా ఒంటిమీద చర్మం పొరలుపొరలుగా ఊడిపోతోంది.

'అయ్యో ! కొండనాలుకకి మందేస్తే ఉన్న నాలుక పోయినట్లు !' అదేదో సామెత గుర్తుకు వచ్చింది పున్నయ్యకు.

మా ఇంట్లోవాళ్ళు కంగారుపడి డాక్టరుని పిలిచి 'ఏమయిందండీ ఈయనకు? పొద్దున టిఫెన్ తిని చక్కగా ఆఫీసుకు వెళ్ళారు. ఏమయిందండీ? డాక్టరూ !' అని అడిగారు. అలా అడుగుతుంటే నీ నిర్వాకం దాచిపెట్టి 'ఇందాక అతడేదో బయట తిండి తిన్నానని చెప్పాడే మరి. అది విషంగా మారినట్లుంది. కడుపును క్లీన్ చెయ్యాలి. అవసరమైతే ఆపరేషన్ కూడా చెయ్యాలన్నావు."

'మరి రోగం అలాంటిదేమో?' పున్నయ్యలో ఆందోళన చోటుచేసుకొంది.

“నేను అలా చెప్పలేదని తలూపుతుంటే మా యింటి వాళ్ళు గమనిస్తారని నువ్వు గ్రహించి, వాళ్ళమాటలను దాటేస్తూ వారిని హడావుడి పెట్టి అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలి అన్నావు. పాపం వారు గాబరాపడి ఇంకొక ఆలోచనకూడా చెయ్యలేని స్థితిలో నేను గండం నుంచి బయటపడితే చాలని నా భార్య పిల్లలు దండాలుపెట్టి ‘సరే డాక్టరు ఇక ఆలస్యంచేయవద్దు ఆపరేషన్ వెంటనే చేయండి’ అన్నారు. దానితో నీ పాపపు బలం రెట్టింపయింది. ‘ఆపరేషన్ కి రెండు లక్షలవుతుంది. ముందు డబ్బు కట్టిన రసీదు చూస్తేగాని ఆపరేషన్ చేయటానికి ఆసుపత్రి యాజమాన్యం ఒప్పుకోదు’ అన్నావు..”

‘అమ్మో ! రెండులక్షలే ! అప్పటికప్పుడు ఎలా తెస్తారయ్యా? ‘పున్నయ్య మనసులో కోపం చోటుచేసుకొంది.

“నా పిల్లలు తమది మధ్యతరగతి కుటుంబం అని ఫీజు కాస్త తగ్గించమని ప్రాధేయపడ్డారు. కనికరం ఉంటే కదా కసాయివాడికి. తల అడ్డంగా ఊపి అర్జంటు పని ఉన్నట్టు ఫోజుపెట్టి అక్కడి నుండి నువ్వు వెళ్ళి పోతుంటే, మా వాళ్ళు నీ కాళ్ళు పట్టుకున్నంత పనిచేస్తూ ‘సరే డాక్టరు గారు గంటలో తెచ్చి యిస్తాము. ఈ లోపల చికిత్స చేస్తూ ఉండమంటే.. ‘అలా కుదరదు. డబ్బులు కడితేనే ఆపరేషన్ చేస్తా ఈ లోపల పేషంటుకేమయినా అయితే బాధ్యత మాదికాదు’. అంటూ. నర్సును పిలిచి ‘ఇదిగో ఈ పేషంటును బయట ఉన్న అరుగుమీద పడుకో పెట్టండి.” అన్నావు.

‘అయినా వాళ్ళు డబ్బు తెచ్చిస్తామనే అంటున్నారుగా ! ‘పున్నయ్య మనసు ఘోషించింది.

“డబ్బు తేవటం ఆలస్యమయి పేషంటు చస్తే మనకి సంబంధం ఉండదు. వాళ్ళే బయటనుండి బయటే శవాన్ని తీసుకొని వెడతారు’ అని గట్టిగా మా వాళ్ళకు వినపడేటట్టు అరిచావు. అక్కడి వాళ్ళు వాడిని ఎవరూ ఏమి అనలేకపోయారు. మరి ఆసుపత్రి వాడిదేనని మా వాళ్ళకు తరువాత తెలిసింది”.

‘ఇంతకీ వాళ్ళ కుటుంబీకులకు డబ్బు దొరికిందో, లేదో’ పున్నయ్య మనసు గాబరాపడింది.

“ఇక మా వాళ్ళు నన్ను బతికించుకోవటమే ముఖ్యమనుకొని నా భార్యకు ధైర్యంచెప్పి అక్కడే ఉండమని చెప్పి, డబ్బుకోసం బయటకువెళ్ళారు. అరగంట గడిచింది. ఈ లోపల డాక్టరు మూడుసార్లు డబ్బు తెచ్చారా? అని నర్సులచేత కబురు పంపాడు. ఇదంతా మత్తుగా పడుకొన్న నాకు లీలగా అర్థమవుతూనే ఉన్నాయి. కాని నేనేమి చేయలేని అయోమయంలో ఉన్నా. ఈ గండం గడిచిన తరువాత ఇక ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి అని మనసులో అనుకుంటున్నా., నా

పిల్లలు డబ్బు కట్టిన వార్త డాక్టరుకు రిసెప్షను కౌంటరువాళ్ళు తెలిపారు. అంతే డాక్టరు పేషంటును ఆపరేషన్ చేయటానికి తెమ్మన్నారని చెప్పి నన్ను స్ట్రెచర్ మీద పడుకోబెట్టారు. నా భార్య ఘొల్లుమంది. నా పిల్లలు నాకు ధైర్యంచెపుతూ 'రేపు ఇంటికి పంపిస్తారట ఈ ఒక్కరోజుకు ఓర్చుకో' అంటూ ఆశతో నన్ను ఆపరేషన్ థియేటర్లోకి పంపారు"..

'అమ్మయ్య ! నీ పిల్లలు ఎంత మంచివాళ్ళయ్యా ! అప్పటికప్పుడు డబ్బు పుట్టిందంటే !' పునయ్య మనసు ఊరడిల్లింది.

"అదే వాళ్ళు నాకు చెప్పిన వీడ్కోలు అని వాళ్ళకు అప్పుడు తెలియదు. ఎనస్తీషియా ఇవ్వాల్సిన మొత్తం డోసు ఇవ్వకుండా మిగుల్చుకున్నారేమోగాని నాకు అంతా వాళ్ళేంచేస్తున్నారో తెలుస్తూనే ఉంది. ఇద్దరు నర్సులు నేను లేవకుండా నా రెండుచేతులు, కాళ్ళు, గట్టిగా కట్టేసారు. మూతికి మాస్కు కట్టుకుంటూ డాక్టరు వచ్చి కడుపును కోస్తుంటే నాకు విలవిలా కొట్టుకోవాలనిపించింది. అయినా జరంవచ్చి వస్తే ఇదేంటి ఇలా చేస్తున్నారని వాళ్ళను పట్టుకొని అడగాలనిపించింది"..

'నిజమే !' పున్నయ్య మనసు బిగపట్టుకుంటోంది.

"కాని కట్టేయటంతో నిస్సహాయ పరిస్థితి నాది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఊపిరి ఆడటంలేదు ఆపరేషన్ ఆపేయండి అని అరవాలనిపించింది. కాని నోరు పెగలక మూలిగాను. డాక్టరు "ఒరేయ్ ఇంకాస్త మత్తు ఇవ్వండిరా" అని పక్క రూములోకి వెళ్ళాడు. నేను మత్తులో ఉన్నాననుకొని పక్కనున్న నర్సు మరొక నర్సుతో 'ఈ డాక్టరుకి డబ్బు తప్ప జబ్బు గురించి పట్టదు. వీడు జరానికి ఇవ్వాల్సిన ఇంజెక్షన్ కాకుండా వేరేది రాసాడు. అప్పటికీ ఇది కాదని చెప్పిచూసా. కోపం వచ్చిన సారు 'నేనా? నువ్వా? డాక్టరు కోర్సు చదివింది. ఇక్కడ ఉద్యోగం చెయ్యాలను కుంటున్నావా లేదా' అని కసిరేసరికి నోరుమూసుకోవల్సివచ్చింది. ఇవ్వకూడని ఇంజక్షన్ ఇచ్చేసరికి ఇతడిలోని అవయవాలన్నీ క్రమంగా దెబ్బతింటున్నాయి. నిష్కారణంగా ఈ పేషంటు ఏమవుతాడో ఏమో' అని అనేసరికి నా పైప్రాణాలు పైకి ముందుగానే పోవటానికి సిద్ధమయ్యాయి."

'ఛీ..ఛీ.. ఎంతఘోరం కలికాలం అంటే ఇదేనేమో.' పున్నయ్య కోపం కట్టలు తెంచుకుంది.

"అయ్యో పేషంటుకు ఊపిరి పడిపోతోంది. శ్వాసపీల్చుకోలేకపోతున్నాడు డాక్టరును పిలుద్దాం" అని నర్సు హడావుడి పడటం, డాక్టరు వచ్చేలోపే నా ఊపిరి ఆగిపోవటం జరిగింది. ఆ డాక్టరు తప్పుచేసానని అనుకొని, నా చివరిక్షణంలో దానికి విరుగుడుగా మందిస్తాడేమో అని ఎదురు చూసిన నాకు ఊపిరి ఆగటమే నయమనిపించింది. ఈ అన్యాయపు లోకంలో ఇక బతకలేనని

అనిపించింది. నర్సులతో 'ఒరేయ్ ! వీడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళమని, అక్కడ పెద్దవైద్యం చెయ్యాలని చెప్పి మీరే అంబులెన్సులో వీడిశరీరాన్ని ఎక్కించండి అన్నావు."

'అయ్యో ! అయ్యో ! శాంతి, శాంతి !' పున్నయ్య మనసు బాధతో విలవిలలాడింది.

"ఆ డాక్టరు పీకపిసికెయ్యాలని అక్కడక్కడే నా ఆత్మ తిరుగుతూనే ఉండటంతో ఇదంతా నాకు అర్థమవుతూనే ఉంది. మా వాళ్ళు ఇంకా ఆ డాక్టరును నమ్మి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. ఈ డాక్టరు శిష్యులే అక్కడ జూనియర్ డాక్టర్లుగా ఉండటంతో ఏదో వైద్యం చేస్తున్నట్టు నటించి శవానికి విందు పెట్టినట్టు ఆక్సిజను సిలిండరు పెట్టారు. చచ్చిపోయున్న నా పొట్ట ఆ గ్యాసుగాలికి కాస్త కదులుతుంటే మా వాళ్ళు దేవుడిరూపంలో ఉన్న ఆ డాక్టరు పెద్దాసుపత్రికి పంపటంతో ఇక నేను బతుకుతానని అనుకొన్నారు."

'ఇంకేమి బతుకు బూడిద బతుకే ! ఛ్ఛ ఛ్ఛ' పున్నయ్య మనసు విరక్తి చెందింది.

"మా వాళ్ళందరినీ బయటే కూర్చొని ఉండమని చెప్పి నా దేహాన్ని లోపలి గదిలో పడుకోబెట్టి చుట్టూరా కర్టెను పెట్టారు. చూడటానికి వచ్చిన ఆ సీనియర్ గవర్నమెంటు డాక్టరుతో ఈ జూనియర్ డాక్టరు ఏదో మాట్లాడాడు. వాళ్ళమాటలనుబట్టి సగం కమీషను వీళ్ళకు దక్కుతుందని అర్థమయింది. నా వాళ్ళతో ఈ అన్యాయం గురించి చెప్పాలనుకొంటే నేను మూగజీవినయ్యాను. వాళ్ళకు దూరంగా నన్నెవరో తీసుకెడుతున్నారని నా ఆత్మకు తెలుస్తూనే ఉంది. నా కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న మావాళ్ళతో ఆ సీనియర్ డాక్టరు వచ్చి 'మా ప్రయత్నం మేము చేసాము దురదృష్టం చనిపోయాడు. శవాన్ని తీసుకొని వెళ్ళండి.' అన్నాడు. మా వాళ్ళంతా ఘొల్లుమని ఏడుస్తున్నారు. వాళ్లతో డబ్బులకోసం డాక్టరు చేతిలో బలి అయ్యాను ఇంకెవరూ ఇలా కాకుండా చూసుకోండని వాళ్ళతో చెప్పాలనిపించింది. నా నోరు పనిచేయటంలేదు".

'ఇంకేమినోటిమాట..' పున్నయ్యనోట్లో మాట పెగిలి రాలేదు.

"నిస్సహాయంగా ఉన్న నా మనసును అదే నా ఆత్మను అదిమిపెట్టుకుంటుండేసరికి బాధ భరించలేక తొందరగా నావాళ్ళు నన్ను తగలేస్తే బాగుండునని అనుకొన్నా. నా వాళ్ళను, ఇంటిని ఆఖరుసారి చూసుకుంటూ పాడెక్కాను. మర్నాడు దుఃఖాన్ని కాస్త తగ్గించుకొన్న నా వాళ్ళు మా అస్థికలను ఈ నీళ్ళల్లో కలిపి పుణ్యం కట్టుకొన్నారు. నీవెందుకు నన్ను ఒడ్డుకు తెచ్చావు. నా ఎముకలు కూడా మిగలకుండా పీక్కుతిందామనుకొంటున్నావా."

'వట్టిపుణ్యానికి చంపావంటూ నీ ఎముకలో నుండి శబ్దాలు వినపడేసరికి నీ బాధను పంచుకోవాలనే నిన్ను నీటి వొడ్డుకి తెచ్చాను'. పున్నయ్య మనసు సమాధానపరిచింది.

"సరే నా బాధ అర్థమయిందిగా. నీకు చేతనయితే డాక్టర్లు చేస్తున్న మోసాలను లోకానికి తెలిపి ప్రాణికోటిని కాపాడు. ఈ భూమిమీద నన్ను పడేయవద్దు. తిరిగి నా ఎముకను కృష్ణమ్మ ఒడిలోకి చేర్చి పుణ్యంకట్టుకో. అవినీతి లోకానికి నన్ను తిరిగి పంపించవద్దనీ, నాకు మరుజన్మ లేకుండా చేయమని, ఈ కృష్ణమ్మని వేడుకొంటా." లబలబమని నీళ్ళతో రొదచేస్తున్న ఆ బొక్కను నీళ్ళల్లోనే జాగ్రత్తగా పెట్టటానికి పున్నయ్య నదిలోకి దూకి తన వల దగ్గరకు చేరుకొన్నాడు.

మరొకసారి తన వలను లాగుదామని పున్నయ్య చేయి పెట్టగానే "నా ఉద్యోగానికి తాళి కట్టావనుకోలేదురా ! నువ్వు చావాలిరా. కడుపులోని నాబిడ్డ ఏం తప్పు చేసిందిరా. నా వాళ్ళు నిన్నువదిలిపెట్టరురా. నిన్నుచంపి ఈ కృష్ణమ్మలోనే పడేస్తారురా. నీ ఎముకలను పీక్కుతినాలనే ఇచ్ఛతో ఈ కృష్ణమ్మలోనే ఎదురుచూస్తుంటా". వలలో నాజుకైన ఒక బొక్క తనలోని నీళ్ళను పైకి వెదజల్లుతూ శబ్దంచేస్తున్నట్టనిపించి పున్నయ్య మరింత కుతూహలంతో ఆ ఎముకను సున్నితంగా పట్టుకొని నీటి పైకి తెచ్చాడు.

* * *

పదునాల్గవ అస్థిక కథ

"ఒక పక్క ఉద్యోగం మరోపక్కన తాళి అని,.. ఈ ఎముక బహుశ పెళ్ళయి ఉద్యోగం చేస్తున్న మహిళకు సంబంధించిన ఎముకని అర్థం అవుతోంది. కాని ఆమెందుకు చచ్చిపోయిందో, ఎందుకు తన మొగుడు చావాలని కోరుకుంటూ శబ్దం చేస్తోందో ! ఇదేదో తెలియాలి". పున్నయ్య మనసులో జిజ్ఞాస కలిగింది.

పున్నయ్య మనసు అర్థమైనట్లుగా "అన్నా ! మనదేశంలో పెళ్ళయిన ప్రతి స్త్రీ తన మొగుడు బాగుండాలనే కదా కోరుకునేది. నేను ఎటువంటి పూజలు చేయకుండానే నా మొగుడు నన్ను సుమంగళిగా కాటికి పంపాడు. దాని ఫలితంగానే నేను నా భర్త చచ్చిపోవాలని కోరుకుంటున్నా అప్పుడేకదా వాడి ఎముకలను పీక్కుతినొచ్చు." ఆ బొక్కల నుండి రాళ్ళనుండి జాలువారుతున్న సెలయేటి ధ్వని వినపడింది.

'అదేమిటీ, అతని ఎముకలను పీక్కు తినాలని ఎందుకు అనుకొంటున్నావు? 'పున్నయ్య మనసు ఆశ్చర్యానికి లోనయింది.

"అలా ఆశ్చర్యపోకు అన్నా ! నా చావుకు కారణం తెలిస్తే నువ్వు అదే మాట అంటావు. ముందుగా నా ఉద్యోగం గురించి చెబుతా. మా తల్లిదండ్రులు గుంటూరులో ఉంటారు. వాళ్ళు నన్ను అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసి ఇంజనీరింగు చదివించారు. పెళ్ళిచేస్తామంటే అప్పుడే వద్దు కొన్నాళ్ళు ఉద్యోగం చెయ్యాలి అన్నా. సరేనని బెంగుళూరు పంపించారు. శని, ఆదివారాలు సెలవని గుంటూరు వస్తుంటే బస్సులో వాడు పరిచయం అయ్యాడు. తాను బెంగుళూరుకు దగ్గరలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని చెప్పి తమది హైద్రాబాద్ అని, నా ఉద్యోగం, నా వాళ్ళ గురించి అడిగాడు. ఏదో మాములుగా అడిగాడనే అనుకున్నా కాని మనసులో స్వార్థంపెట్టుకొని అడిగాడని అనుకోలేకపోయా."

'ఆతని స్వార్థమేమిటో?..' పున్నయ్య మనసు ఆరాటపడింది.

"నీ మనసు అర్థమైంది అన్నా ! సోమవారం తిరిగి బెంగుళూరు వెడుతుంటే ట్రైన్లో ప్రత్యక్షమయ్యాడు. తాను హైద్రాబాదునుండి వస్తున్నట్టుచెప్పి, ఈ సారి నా ఆఫీసు, నా ఫ్రెండ్స్, నా జీతం గురించి విషయాలను రాబట్టాడు. సరేలే తెలుగువాడేకదా, రైల్లో బోరుకొట్టకుండా ఉంటుంది అనుకొంటూ అతని ఆఫీసు ఎక్కడ ఉందీ, తన పని గురించి చెబుతుంటే విన్నా. అలా పరిచయంపెంచుకొని, ప్రేమిస్తున్నా అంటూ నాతో పెళ్ళివరకు వచ్చాడు. ఇంట్లో చెప్పగానే నా తల్లిదండ్రులు నా యిష్టాన్ని ఆమోదించారు. వాడివైపు వాళ్ళు ఎగిరినంత పనిచేసారు."

'ఇంకేమిటమ్మా పెద్దలు పెళ్ళికి ఒప్పుకున్నారుగా !' పున్నయ్య మనసు కాస్త సంతోషపడింది.

"పెళ్ళి అయింది. పెళ్ళిలోనే ఆతని కుటుంబవ్యక్తులు నా జీతం గురించే మాట్లాడుకుంటుంటే విన్న పెళ్ళికొచ్చిన మా వాళ్ళు పెళ్ళికూతురు బాగుందనో లేదా ఏదో వంకపెట్టో మాట్లాడుకుంటారుగాని ఇలా వీళ్ళు పెళ్ళికూతురి జీతం గురించే మాట్లాడుకుంటుంటే పిల్ల భవిష్యత్తు ఏమయిపోతుందో అని మావాళ్ళకు ఆ రోజునుంచే బెంగ మొదలయింది. కాని నా మనసు బాధపడుతుందని నాతో ఆ విషయాలు అప్పుడు చెప్పలేదు."

'ఇష్టపడి చేసుకుంటున్నావు కదా ! చెప్పితే నువు బాధపడతావని అనుకొని ఉంటారులే... 'పున్నయ్య మనసు సమాధానపడింది.

"మా వాళ్ళు నాతో అని ఉంటే వాడు నా ఉద్యోగానికి తాళి కట్టాడని ఆనాడే నాకు అర్థమయ్యేది. జాగ్రత్తపడేదాన్ని. ఇలా ప్రాణం మీదకు వచ్చేదికాదు. "

'అయ్యో ఏమయిందమ్మా అమ్మా ! డబ్బు విషయంలో భార్యాభర్తలమధ్య తేడాలేమిటిలే తల్లీ ఆ తరువాత ఏమయింది?..' పున్నయ్య మనసు సందేహంతో రెపరెపలాడింది.

"మా వాళ్ళు చీర-సారె, సామానుతో, నగలతో నిండుగా నన్ను కాపురానికి పంపారు. ఇల్లు తీసుకొని బెంగుళూరుకు వెడుతుంటే నా భర్త నాతో నగలన్నీ మా అమ్మదగ్గర దాచిపెట్టు. అక్కడ అంతా కొత్తకదా చుట్టుపక్కల ఎలాంటివాళ్ళు ఉంటారో అన్నాడు. ముందుజాగ్రత్త అనుకొన్నాగాని ఇలా మోసంచేస్తారనుకోలేదు.."

'అదేంటమ్మా ! అలా ఎందుకు అనుకొన్నావు?' పున్నయ్య మనసులో శంక చోటుచేసుకొంది.

"కొత్తసంసారం నా అంత అదృష్టవంతులు లేరనుకొంటుంటే ఎన్నో కలల సౌధాలు కళ్ళముందు సినిమా రీలులా కదిలేవి. పెళ్ళయి కాపురంపెట్టిన పదిహేనురోజులకే నా మొగుడు కాస్తకాస్త అర్థం అవసాగాడు. నేను ఉద్యోగానికి వెళ్ళగానే తాను ఉద్యోగానికి వెడుతున్నాడని అనుకొన్నా. జీతం తెచ్చి ఇవ్వు అని అడిగేసరికి మనిద్దరి సంసారంకోసమేగా ఏమయినా కొంటాడనుకొన్నా. ఆ డబ్బును తీసుకొని కొంత వాళ్ళకు పంపాడు. సరేలే తనవాళ్ళకు అర్జంటు అవసరం ఏమైనా వచ్చిందేమోలే అనుకొన్నా. తన జీతం గురించి అడిగినా చెప్పేవాడుకాదు. నాకు పెద్ద అవసరాలు ఉండేవికావు. నాకు టీ, కాఫీ అలవాటుకూడా లేదు. కంపెనీ వాళ్ళే మధ్యాహ్న భోజనం సప్లై చేసేవారు. ఇంటికి క్యాబ్ కూడా పంపి మళ్ళీ దించేవారు".

'నీది మంచి ఉద్యోగం కదా ఇక బాధలేమిటీ?' పున్నయ్య మనసు గందరగోళానికి లోనయింది.

"అలా ఒక నెలరోజులు గడిచాయి. లోపల ఏదో తెలియని బాధ ఉన్నా ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఆతని ప్రేమవాక్కుల వలలో మైమరచిపోయేదాన్ని. రెండవనెల జీతం కూడా అడిగి తీసుకొన్నాడు. నేను ఇవ్వనని గట్టిగా అరవాలనుకొన్నా. ఏదో నిస్సహాయస్థితి. మంచివాడు నిజాయితీపరుడని ఇంట్లో చెప్పి పెళ్ళికి వప్పించా. కడుపుతో ఉన్నానని, కడుపు నకనకలాడుతోందని అన్నా. నీరసం ఆవహిస్తోంది. వాడితో చెపితే ఆనందించకపోగా 'ఎవరివల్ల' అని కళ్ళెగరేసి వెకిలిగా నవ్వాడు. సంతోషించకపోగా 'ఇదొక తలనొప్పికూడా వచ్చిందీ' అన్నాడు. కాళ్ళకింద భూమి కుంగి పోయినట్టయింది. అప్పుడు ఆతని మైకంలో ఉన్న నాకు ఆ మాటలలోని గూఢార్థం కొంత అర్థం అయి, కాకుండా ఉంది. గందరగోళంలో పడిపోయా"..

'ఆనంద క్షణాలను పంచుకోకుండా అలా ఎందుకు అలా అన్నాడు?' పున్నయ్య మనసు ఆలోచనలలో పడింది.

“ఇంట్లో సరుకులు తెచ్చుకోవాలి. అతడు తేవటంలేదని మా వాళ్లిచ్చిన కట్నం డబ్బు అయినా ఇమ్మని అడిగా. లేవు. ఆ డబ్బు పెట్టి నా తమ్ముడికి ప్లాటు కొనిపెట్టా అన్నాడు. ‘ఒహో ! నన్ను పెళ్ళిచేసుకొంది నీ వాళ్ళను పోషించటానికా?’ నా మనసులో శంక మొదలయింది. అసలే వాడి తమ్ముడు తాగుబోతు, అమ్మాయిల పిచ్చి, డబ్బు వేశ్యలకు తగలేస్తాడని పెళ్ళిలో అనుకుంటుంటే నా స్నేహితురాలు విని నాకు చెప్పింది. నా మరిదిని గురించి కాదులే అని అప్పుడు దాని మాటలు తోసిపుచ్చా. తన వాళ్ళు బాగా సుఖపడాలని భావించాడన్నమాట. ఛీ.. ! ఇతనికి నామీద ప్రేమ లేదని అర్థం అవటానికి ఎంతో సేపు పట్టలేదు. నీ పుట్టింటి నుండి తెప్పించుకో అన్నాడు. అదేమిటి నాకు జీతం వస్తోంది. నీకు జీతం వస్తోందిగా అన్నా. అప్పుడు చెప్పాడు తనకు ఉద్యోగం లేదని చెప్పి గబగబా బయటకు వెళ్ళి పోయాడు.”

‘పెళ్ళికి ముందు నీతో ఈ విషయాలన్నీ చెప్పలేదా!. ఎంత మోసం..’ పున్నయ్య మనసు ఘోషించింది.

“మోసపోయానని మొదటిసారి అనుకొన్నా. కాని ఏమిచేయాలో తోచలేదు. ఇంట్లో వండాలంటే కిరాణా సామాన్లు లేవు. అలా ఆలోచిస్తూ పెళ్ళివిషయంలో నేను తీసుకొన్న నిర్ణయానికి నా మనసును సమాధానపరచలేని స్థితిలో ఉన్నా. పొద్దుపోయిన తరువాత తాగి ఇంటికివచ్చాడు. ఆ వాసనకు నాకు కడుపులో తిప్పినట్టయింది. తాగుడు అలవాటుకూడా ఉందా? పెళ్లికి ముందు చెప్పలేదేమిటీ? అని మనసు ఉగ్గబెట్టుకొని అడిగా. ‘డియర్ పెళ్ళామా ! నీకు చెప్పాలా? మగాడన్న తరువాత లక్షాతొంభై అలవాట్లు ఉంటాయి..’ ఇంకా ఏదో వాగుతుంటే నా మనసు వినాలని అనుకోలేదు. నాకళ్ళు బైర్లు కమ్మాయి. కుప్పకూలిపోయా.”

‘అయ్యో ఎంతపని అయిందమ్మా’ పున్నయ్య మనసు విలవిల లాడింది.

“ఆ రాత్రి పీడ కలల రాత్రి అయింది. నిద్రపోలేదు. తెల్లారి ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి. అమ్మానాన్నలతో మాట్లాడాలి. ఉద్యోగానికని నేను బయటకు వెళ్లినప్పుడు వాళ్ళతో మాట్లాడాలను కొన్నా. ఇంతలో వాడి తమ్ముడి దగ్గరనుండి ఫోను. అటునుండి ‘అలవాటయిన లాయరేగా ! ఎలాగో అలాగా తిప్పలుపడి డబ్బులు తెచ్చి యిస్తానని చెప్పి పోలీసుస్టేషన్ నుండి బయటపడ్డాలే. ఏమంటోందిరా’ అది పుట్టింటినుండి డబ్బుతెస్తానంటోందా ? లేదా ? నాకు అర్జంటు అవసరం. నేను కట్నం తీసుకొని మొదట పెళ్ళిచేసుకొన్న అమ్మాయి మరొక అమ్మాయి మెడలో నేను తాళికడుతున్న ఫోటోలుపెట్టి పోలీసు స్టేషన్లో కేసుపెట్టింది. అర్జంటుగా నీ పెళ్ళాం పుట్టింటి నుండి డబ్బు తెప్పించు.

నా ఫ్రెండు ఫోనుకు పే చెయ్యి అర్జంటు' అంటూ హడావుడిగా ఫోను పెట్టేసాడు.

'ఎంత దగాకోరు కుటుంబం. పచ్చిమోసం..' పున్నయ్య తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు.

"ఏం డబ్బు ఇవ్వనంటోందా?' ఆలస్యం అయితే ఆ లాయరు ఒప్పుకోడు. మళ్ళీ పోలీసుస్టేషన్‌కి పంపుతానంటాడు. ఆనాడు డబ్బుకోసమో దానికి పుస్తె కడుతున్నానని మమ్మల్ని ఒప్పించావుగా అని అవతలనుండి మళ్ళీ ఫోనుచేసి అంటుంటే, 'ఇది మాటవినటం లేదురా' ఇవతలనుండి జవాబు. 'అయితే చేతులకు పనిచెప్పు' అవతలి నుండి హెచ్చరిక. మొగుడనేవాడి విశ్వరూపం చూపించాడు. నా తలకాయి పట్టుకొని గోడలకేసికొట్టిన దెబ్బలు. అప్పుడే ఇక బతకకూడదని అనుకొన్నా. కాని కడుపులో బిడ్డ గుర్తుకు వచ్చింది. తొందరగా ఆఫీసుకని బయటకువెళ్ళి నన్ను నేను కాపాడుకోవాలనుకొన్నా."

'మంచి ఆలోచన చేసావమ్మా. అక్కడే ఉంటే చంపేస్తాడమ్మా' పున్నయ్య మనసు బాధతో మూలిగింది.

"నా మనసును పట్టుకోవటం వాడికి వెన్నతో పెట్టిన విద్య. నేను ఏదో ఒకటి చేసే లోపలే గుట్టుచప్పుడు కాకుండా నన్ను కడతేర్చాలనుకొన్నాడు. నా గొంతుపట్టి పిసుకుతుంటే వాడి తమ్ముడి దగ్గరనుండి ఫోను. చంపావా, లేదా అని. ఆ చంపుతున్నా. శవాన్ని మాయంచేయటానికి ప్లానువేస్తున్నా. అవతలినుండి. ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడు. మళ్ళీ కట్నం తీసుకొని పెళ్ళిచేసుకోవచ్చు జాగ్రత్తగా డీలు చెయ్యి సాయానికి నన్ను రమ్మంటావా ఇలాంటి వాటిలో నాకు మంచి అనుభవం ఉందిగా. మళ్ళీ బతకకుండా గొంతుగట్టిగా నొక్కు ఇటు నుంచి శవాన్ని గుర్తుపట్టకుండా ముక్కలుకోసి సూటుకేసులో పెట్టి ఎవరికీ అనుమానం రాకుండా రాత్రికి కృష్ణలో పడేస్తా అన్నాడు. చచ్చిన తరువాత మెదడు మరో పదినిముషాలు బతికే ఉంటుందిగా. అన్నీ అర్థమవుతున్నాయి. ముక్కలైన నా ఆత్మకు ఇవన్నీ తెలుస్తూనే ఉన్నాయి. రైలు పట్టాలమీద పడేస్తాలే. నేను రేపు హైద్రాబాదుకు చేరుకుంటా స్టేషనుకు వచ్చి నన్ను కలు అని పెట్టాసాడు.

'అయ్యయ్యో ! ఎంత ఘోరం జరిగిపోయిందమ్మా' పున్నయ్య మనసు ఆక్రోశించింది. కాసేపటికి తేరుకొన్న పున్నయ్య మనసుకు నిన్న జరిగిన విషయం గుర్తుకు వచ్చింది.

'ఓహో ! నిన్ననే ఒకడికి అమరావతి హైకోర్టులో ఉరిశిక్షవేస్తే వాడి శవాన్ని తెచ్చుకొని బంధువులకు తెలియకుండా కుటుంబసభ్యులు తగలేసారు. వాడి తమ్ముడు ఇందాకనే ఈ కృష్ణలోనే వాడి నీచమైన ఎముకల్ని కలిపి వెళ్ళారు. వాటిని నీ దగ్గరకు చేరుస్తా నీ కసి తీర్చుకో' అంటూ ఆ

ఎముకను ఒకచేతిలో పట్టుకొని ఒడ్డుదగ్గరే తేలుతున్న ఆ మొగుడి ఎముకలను మరోచేత్తో పట్టుకొని రెంటినీ నీటి అడుగుకు తీసుకెళ్ళాడు. ఆమె ఎముకదగ్గరగా ఈ ఎముకలను పెట్టగానే ఎముకల పై పిడిగుద్దులు గుద్దుతున్నట్టు నీళ్ళ చప్పుడు వినపడింది.

పున్నయ్య బాధపడుతూ పైకి వస్తుంటే "ఒరేయ్ ! కామాంధుడా ! నీకు గురువన్న పదానికి అర్హతలేదురా. నువ్వేకాదురా, నీలాంటి మొగాళ్ళు సమాజంలో చాలామంది ఉన్నారురా. బీదవాళ్ళం ఏమి చేయలేరులే అనేకదా మీ బరోసా. ఆడది తలచుకుంచే ఏమయినా చేయగలదురా ! "నీటి గలగలలలో వలలోనే తేలుతున్న ఎముక అరుస్తున్నట్టనిపించింది. ఎవరినో తిడుతోంది ఈ ఎముక ఎవరబ్బా ! ఆ రావణాసురుడు ఆ బొక్కను నీళ్ళపైకి తెచ్చి నిట్టూర్చాడు పున్నయ్య. ఆ నిట్టూర్పులకు చలనం వచ్చిన ఎముక కొద్దిగా నీళ్ళను బైటకు కక్కుతూ "ఓ కామపిశాచులారా ! మీలాంటివాళ్ళను బతకనీయకూడదురా" నీళ్ళ నుండి శబ్దాలు వినపడ్డాయి. ఆ ఎముకనుండి పైపైకి నీళ్ళు వస్తుంటే పున్నయ్య ఆ ఎముకను తదేకంగా చూస్తూ ఏమయిందమ్మా !' పున్నయ్య మనసు బరువెక్కుతోంది.

పదిహేనవ అస్థిక కథ

ఆ ఎముకనుండి బయటకు వస్తున్న నీళ్ళచప్పుడు "ఓ అన్నా ! కూతురిని పెట్టుకొని నా తల్లితో ఉంటున్నా. ఆ చచ్చినాడు వేరేదాన్ని చూసుకొని ఎప్పుడో నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. అప్పటినుండి సంగానికి కూడా లోకువ అయ్యాం. ఆ యింటా ఈ ఇంటా పనిచేసుకుంటూ రోజులు వెళ్ళబుచ్చుతున్నా".

'అందుకే అంటారు ఆడోళ్ళకే కష్టాలన్నీ' పున్నయ్యకు జాలికలిగింది.

"నా కూతురన్నా చదువుకుంటే దానికి నాలాంటి కష్టాలు ఉండవని అనుకొని దాన్ని గవర్నమెంటు స్కూల్ లో వేసా. పిల్ల రోజూ స్కూల్ లో టీచర్లు చెప్పే పాఠాలన్నీ ఇంటికొచ్చి నాకు అర్థం కాకపోయినా నాతో చెప్పేది. పిల్ల బాగా చదువుకుంటోందని సంతోషించా. నేను దాన్ని నాకు వీలయినంతవరకు పెద్దచదువులు చదివించాలని కలలు కన్నా. బీదయింట్లో దీపకళికలా ఉండేది. అందరూ నాపిల్లనుచూసి చిదిమి దీపం పెట్టొచ్చు అనేవారు. మా అమ్మ ఇంటిదగ్గరే ఉంటుంది. పిల్లకేమి పని చెప్పద్దని అనేదాన్ని. అట్టా అట్టా పిల్ల ఎనిమిదో తరగతికి వచ్చింది. ఇంటిదగ్గర శ్రద్ధగా చదువుతుంది. ఇక అది పెద్దదవుతుంది అనుకుంటే భయం వేసేది. అబ్బాయిల కళ్ళు దీనిమీద పడకుండా చూసుకోవాలనుకొన్నా.. "

'అవును ఈ రోజుల్లో పోకిరీగాళ్ళు ఎక్కువయ్యారు.' పున్నయ్య మనసు ఏదో శంకించింది.

"ఒకరోజు మాస్టారు క్లాసులో మా అమ్మాయి పక్కన కూర్చొన్న అమ్మాయిని మార్కులు రాలేదని తిట్టాడట. పైపెచ్చు టి.సి ఇచ్చి ఇక చదవకుండా ఇంటికి పంపిస్తా అన్నాడట. ఆ అమ్మాయి మానాన్నతో చెబుతా అని ఎదురు మాట్లాడిందట. ఎంత బలుపే అని మరొక దెబ్బ వేసాడట. ఆ అమ్మాయి నీ సంగతి చెబుతా అంటూ బయటకువెళ్ళి మళ్ళీ తిరిగి బడికి రాలేదట. ఇదంతా మా అమ్మాయి ఇంటికొచ్చి నాతో చెప్పింది. కొన్నాళ్ళు గడిచాయి. మా అమ్మాయి మనసులో ఆ విషయం పదే పదే గుర్తుకు వచ్చి నాతో చెప్పేది. ఒకరోజు మా అమ్మాయి లెక్క సరిగా చేయలేకపోయిందట. ఆ మాస్టారు వచ్చి నేను నీకు చక్కగా చేసి చూపిస్తా అంటూ దగ్గరగా నుంచొని భుజంమీద చేయివేసి లెక్కచేసి చూపించాడట. ఆ మఱ్రోజు అదే పనిగా మా అమ్మాయి దగ్గరకు వచ్చి లెక్కలు చెబుతున్న సాకుతో మా పిల్ల వంటి మీద తాకరానిచోట చేతులు వేసేవాడట."

వాడు గురువుకాదు. వాడిమీద హెడ్మాస్టారికి పిర్యాదుచేసావా తల్లీ ! పున్నయ్య మనసు ఆత్రుత పడింది.

"అమ్మా భయమేస్తోందే అనేది. గురువంటే తండ్రితో సమానం అమ్మా ! పొరపాటున చేయి తగిలిందేమో అన్నా. ఆ రోజుకు ఎలాగో అలాగా సద్దుకుంది పాప. మఱ్రోజు స్కూల్ టైము అయిపోయిన తరువాత నీకు ప్రత్యేకంగా లెక్కలు చెబుతా. తరగతి గదిలోనే ఉండు. లేకపోతే నువ్వు తప్పుతావు అన్నాడట. దానితో పిల్ల అమ్మచెప్పిందికదా టీచరు అంటే తండ్రివంటి వాడని. సరేలే అనుకొంది. తన చదువుమీద ఆశలుపెట్టుకొన్న తల్లి ఏమయిపోతుందనుకుందో ఏమో ? భయపడి తరగతిగదిలోనే కూర్చుండి పోయింది.

అయ్యో చిట్టితల్లి ఎంత అమాయకురాలు. వాడు లెక్కలు చెప్పాడా, ఏం జరిగిందో ! పున్నయ్య మనసు కీడును శంకిస్తోంది.

"వాడు లెక్కలు చెబుతున్నట్టే కాసేపు నటించాడట. స్కూల్ నుండి అందరూ వెళ్లిపోయారట. ఇక వాడు కామ పిశాచంలా మా పిల్లమీద పడ్డాడని అది ఇంటికొచ్చి ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది. నాకు భూమి కింద కాళ్ళు కదిలిపోయాయి. ఆసుపత్రికి తీసుకొని వెళ్ళా. డాక్టర్లు పిల్లమీద అత్యాచారం జరిగిందన్నారు. బీదోళ్ళంకదా. వాళ్ళు కనీసం పోలీసులకు రిపోర్టు ఇవ్వలేదు. వీధిలో వాళ్ళకు చెప్పి వాళ్ళను తీసుకొని స్కూల్ కి వెళ్ళి ఆ మాస్టారుసంగతి తేలుద్దాం అనుకుంటే విషయం బయటకు పొక్కితే నీ పిల్లకు పెళ్ళి అవుతుందా? అని వాళ్లు నన్ను భయపెట్టారు. ఏమి చెయ్యాలో తోచలేదు. నేను ఒక్కదాన్నే వెళ్ళి హెడ్ మాస్టరుకు ఫిర్యాదుచేసా. నేను కనుక్కుంటానమ్మా. పిల్లను ఇంటిదగ్గరే ఉంచు అన్నాడు".

అంతేనా, ఆ మాస్టారును వాడిని అప్పటికప్పుడే ఉద్యోగంలో నుంచి పీకిపారయ్య లేదా. అయినా పిల్లకు జరిగిన అన్యాయం తీరుతుందా ! పున్నయ్య మనసు కుతకుతలాడిపోయింది.

"నాలుగు రోజులు చూసా. మా అమ్మాయిని ఇంటిదగ్గరే చదువుకో. భయపడవద్దు పరీక్షలు రాద్దువుగాని పైక్లాసుకు ప్రైవేటుబడిలో చదివిస్తాలే అన్నా. ఆ చీడపురుగుని ఉద్యోగం లోంచి తీసెయ్యలేదు. నాకు వళ్ళుమండిపోతోంది వాడ్ని పీకపిసికి చంపాలనుకొన్నా. కాని నా కూతురు మరింతగా అనాథ అవుతుందని ఆగా. పనికి పోతున్నాగాని మనసు రగిలి పోతోంది. అయినా ఉండ బట్టలేక వాడి ఇంటికి వెళ్ళి వాడి భార్యకు ఆమె మొగుడి నిర్వాకం గురించి చెప్పా. ఆమె నమ్మలేదు. పైపెచ్చు నీకూతురే మంచిదికాదేమో అంది."

అంతేనమ్మా లోకంతీరే అది. అందుకే మగాళ్ళు రెచ్చి పోతున్నారు. పున్నయ్య మనసు నిరాశచెందింది.

"మా వీధిలో ఒక పెద్దాయన ఉన్నాడు. పెద్దమనిషిలా చెలామని అవుతుంటాడు. అందరికీ ఎరుకే. సమాజంలో బీదోళ్ళమాటలకు విలువ ఉండదుగా. ఆ మాస్టారి సంగతి చూస్తాడేమో అని ఆయనదగ్గరకు వెళ్ళి మొత్తుకున్నా. పెళ్ళయిన వాడన్నావుగా. పెళ్ళిచేసుకోమని చెప్పలేముకదా. కేసు పెడదాములే. నష్టపరిహారం అడుగుదాం అన్నాడు. సారూ ! నా పిల్లజీవితానికి ఖరీదు కట్టకండి. వాడు మరో అమ్మాయిని నాశనంచేయకుండా చూస్తారని మీ దగ్గరకు వచ్చా. అన్నా."

నిజమే అమ్మా ! వాడు అటువంటి వాడే. అభం శుభం తెలియని ఆడపిల్లలను కబళించేవాడే. పున్నయ్య మనసు కోపంతో రగిలింది.

"ఆ పెద్దమనిషి సాయంకాలం నాకు తెలిసిన లాయరుతో మాట్లాడుదాం రమ్మన్నాడు. లాయరుతో మాట్టేదేసరికి పొద్దుపోయింది. వాడిలో చీకటి చోటు చేసుకుంది. దార్లో ఒక పాడుబడ్డ భవనంలోకి తీసుకెళ్లాడు. వాడి బుద్ధి అర్థం అయింది. వాడు నామీద చెయ్యి వేసాడు. నేను విదిలించుకున్నా. ఎక్కడికీ నువు తప్పించుకోలేవు అంటూ జేబులోని మందు సీసా తీసి తాగుతున్నాడు. అదే అదను అనుకొన్నా. అంతే నన్ను కాళికా దేవి ఆవహించింది. దగ్గరలో ఉన్న పెద్ద ఇనపగొట్టం తీసుకొని నెత్తిమీద కొట్టా. కుప్పకూలిపోయాడు. మళ్ళీ మళ్ళీ నెత్తిమీద, ఒంటి మీద చావబాదా. వాడు సచ్చాడు. నా పగ సగం తీరింది.

అయ్యో ఎంతపని చేసావమ్మా ! ప్రమాదాన్ని నెత్తిమీదకు తెచ్చుకున్నావుగా పున్నయ్యకు ఏడుపొచ్చినంత పనయింది.

"ఏమీ తెలియనట్టు ఇంటికి వచ్చి నా పిల్లను దగ్గరకు తీసుకొని బోరున ఏడిచా. ఏమయిందని? నా ముసలి తల్లి, కూతురు అడుగుతూ వాళ్ళూ ఏడ్చారు. ఏమి కాలేదులే... అని చెప్పినా వాళ్ళునమ్మలేదు. కాసేపటికి ఒక నిశ్చయానికి వచ్చా. అన్నం పెడతా రా తల్లీ ! అంటూ కూతురికి అన్నం పెట్టి దగ్గరే పడుకొన్నా. అదే ఆఖరేమో అనుకొన్నా. నా మనసు రగిలిపోతోంది. నా దాహం తీరలేదు. ఆ రాత్రి కాళరాత్రి. చీకట్లో తడుముకుంటూ ఆ మాస్టరు ఇంటికి మళ్ళీ వెళ్ళి తలుపు తట్టా"

ఎందుకమ్మా ! కొరివితో తల గోక్కోవటానికి వెళ్ళావు ! పున్నయ్యకు భయం ఆవహించింది.

"వాడు బయటకువచ్చి రాత్రిపూట ఎందుకు వచ్చావు ? ఇలా ఇంటి దగ్గర అరవకు. కాస్త దూరంగా మాట్లాడుదాం అంటూ వాడి చావుకు వాడు దగ్గరయ్యాడు. వాడి కళ్ళు కోరికతోపాటు భయపడుతున్నట్టుకూడా కనిపించాయి. నాకు రెట్టింపు ధైర్యం వచ్చింది. ఎందుకు నా కూతురిని చెరిచావు ? ఈ రోజు నా చేతుల్లో నీ చావు రాసిపెట్టి ఉంది. ఇక జీవితంలో నీ లాంటి వాళ్ళు ఏ ఆడపిల్ల జోలికి వెళ్ళకుండా తగిన సిచ్ఛ వేయాల్సిందే నా కూడా తీసుకెళ్ళిన కూరగాయలకత్తితో కుళ్ళబొడిచా. వాడు నా శక్తిని ఊహించలేకపోవటంతో అరవనుకూడా అరవలేకపోయాడు.".

అయ్యో రామరామ ! ఒకటికి రెండు అయినాయి. నిన్ను ఏ దేవుడు కాపాడుతాడు తల్లీ! పున్నయ్య మనసు శూన్యం అయిపోయింది.

"కుప్పకూలాడు వాడి ఊపిరి ఆగిపోయిందని నిర్ధారించుకొని పోలీసు స్టేషనుకు వెళ్ళి న్యాయం గురించి ప్రశ్నించి జరిగింది చెప్పా. నన్ను జైల్లోపెట్టారు. డబ్బులేని వాళ్ళవిషయంలో సిచ్ఛలు తొందరగానే పడతాయి. ఇద్దరిని చంపిన నాకు ఉరిసిచ్ఛవేసారుగాని నేనెందుకు చంపాల్సి వచ్చిందో చెప్పినా ఎవరూ అర్థంచేసుకోలేదు. ఆ దమ్మ దేవత కూడా ఏమి చేయలేక కళ్ళకు గంతలు కట్టుకుంది."

అంతేలే. న్యాయానికి చెవులేకాదు మనసుకూడా ఉండదని రుజువయింది. పున్నయ్య మనసు అల్లకల్లోలమయింది.

"నన్ను ఉరితీసి మా వాళ్ళకు శవాన్ని అప్పగించుతున్నప్పుడు నా కూతురు, తల్లి తమకు ఇంక దిక్కెవరని మేముకూడా నీతోనే వస్తాం అంటూ ఏడవటం నా మనసులో నిలబడిపోయింది. ఆ తరువాత వాళ్ళు ఏమయిపోయారో అని నాకు తెలియకుండా ఉండేందుకే నన్ను ఈ నీళ్ళల్లో వదిలి పెట్టి వెళ్ళారు. కాని వాళ్లు ఈ లోకంలో బతకలేరు. రేపోమాపో నా తల్లీ, నా కూతురు ఇక్కడికే

వస్తారు, వాళ్ళకోసం కృష్ణమ్మ ఒడిలోనే ఎదురుచూస్తా. నన్ను మళ్లీ నీళ్ళల్లోనే ఉంచు". తన భావాలు అర్థమయేవిధంగా బొటాబొటా కారుతున్న నీళ్ళతో బుడగలను కక్కింది ఆ ఎముక.

పున్నయ్య ఇక అక్కడ ఉండలేక ఆ ఎముకను వలపక్కనే ఉంచి గుండె బరువెక్కగా ఇంటికి వెళ్ళాలని ఆత్రతపడ్డాడు.

ఒడ్డుకు చేరుకుందామనుకొనే లోపల "ఉచ్చులో పడ్డావా ? ఉరేదారి !" అనే భావశబ్దాలు వినపడ్డ వేపు చూసిన పున్నయ్యకు వలలోంచి బయటకు కొంతభాగం పడ్డ మరో ఎముక కళ్ళపడింది. దాన్ని బయటపడేయ్యాలనుకొన్నా మనసు రాక దాని ఉచ్చు గురించి తెలుసుకోవాలనుకొన్న పున్నయ్య అక్కడ ఎంతోసేపు నిలవలేక ఆ బొక్కను ఒడ్డుకు తెచ్చాడు.

పదహారవ అస్థిక కథ

ఈ పుణ్యాత్ముడికి నా బాధ అర్థమయి ఎవరూ ఇలాంటి పాపానికి పాలుపడకుండా ఈ మానవుడు చేస్తే బాగుండు. తన భావాన్ని తెలియజేస్తూ కన్నీళ్ళు కారుస్తున్నట్టుగా ఆ బొక్క నీటి బుడగలను వెలిగక్కుతోంది. పున్నయ్య ఆ నీటిని వేళ్ళతో పక్కకు రాలుస్తుంటే "అన్నా ! నీ స్పర్శ చచ్చి పోయిన నాలో జీవంపోసినట్టనిపిస్తోంది. నీకు నా బాధ తెలిస్తే ఇంకెవరూ నాలాగా ఉచ్చులో పడి ఉరేసుకొని చావకుండా నువు వాళ్ళను కాపాడగలవని అనుకుంటేనే నాపాపం పోతుందని పిస్తోంది" దాని భావాల చప్పుడు వినీ వినపడనట్టుగా ఆ ఎముక మళ్ళీ నీటి బిందువులను వదులుతోంది.

ఈ బొక్క ఎటువంటి ఉచ్చులో పడిందో ఎందుకు ఉరివేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందో తెలిస్తే ఉరి వేసుకోవాలనుకున్న వాళ్ళను కాపాడగలనుకదా ! అని మనసులో మథనపడ్డాడు పున్నయ్య.

"అన్నా ! ఇక్కడకు దగ్గరలోనే మా తల్లిదండ్రులు ఉండేవారు. వాళ్ళకు నేను ఒక్కడినే కొడుకును. నాకు ఏ కష్టం తెలియకుండా పెంచారు. కష్టపడి పనులు చేసుకుంటూ డబ్బు ఖర్చుపెట్టి నాకు సివిల్ ఇంజనీరు చదువు చెప్పించారు. కాని ఏమి ప్రయోజనం.ప్చ్.. ప్చ్.."

అదేమిటి ? నిరాశ చెందటం ఎందుకు ? పున్నయ్య మనసు ఆవేదన చెందింది.

"ఉద్యోగాల వేట మొదలుపెట్టా. ఇంటర్వ్యూలకు వెళ్ళా. పరపతి, డబ్బు లేనిదే ప్రభుత్వ ఉద్యోగం రాదని గ్రహించటానికి ఒక ఏడాది పట్టింది. చివరకు ఒక కాంట్రాక్టరు దగ్గర చేరా. పనికి అంతూ పొంతూ ఉండేది కాదు. పోనీలే తల్లిదండ్రులకోసం కష్టపడాలనుకొన్నా. ఆ కాంట్రాక్టరు

సరిగా జీతమిచ్చేవాడు కాదు. ఎంతమంది కాంట్రాక్టర్ల దగ్గరకు వెళ్ళినా ఇదే తంతు. విసిగివేసారినా ఎలాగైనా డబ్బు సంపాదించి నా తల్లిదండ్రులను సంతోషపెట్టాలనుకొనేవాడిని.

నిజమే ! తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడినందుకు, బిడ్డలు వాళ్ళను సుఖపెట్టాలికదా ! వాళ్ళు ఎన్నాళ్ళు కష్టపడగలరు మరి? పున్నయ్య మనసు ఒక్క క్షణం భావోద్రేకం చెందింది.

“కాని ఏం లాభం అన్నా ! ఆ కాంట్రాక్టరు సాయంకాలం పూట రోజూ తాను తాగుతూ కష్టం మరిచిపోతావంటూ నన్ను బలవంతపెట్టి నాకు తాగుడు అలవాటుచేసాడు. నేను మానసికంగా బలహీనుడయ్యాను. నేనెంత తాగకూడదనుకొన్నా రాత్రి అయ్యేసరికి షరా మామూలే. ఇంటికి డబ్బు పంపించటం కష్టమయింది. నా తల్లిదండ్రులు పంపలేదేమని అడిగేవారు కాదు. అలాంటివాళ్ళకు పుట్టిన నా అదృష్టం తలకిందులవటానికి డబ్బుకోసం బెట్టింగు మార్గం ఎన్నుకొన్నా.”

అయ్యో ! డబ్బుకోసం ఆ మార్గం ఎన్నుకొన్నావా ! అంతకంటే మంచిమార్గం నీకు కనపడలేదా? నీ ఆలోచన సరియైనది కాదు. పున్నయ్య మనసు ఘోషించింది.

“నీ ఉద్దేశం కరెక్టే అన్నా ! బెట్టింగ్ అనేది జూదం లాంటిది. ఆ బెట్టింగ్ యాప్ లలో ఎన్నికలప్పుడు, క్రికెట్ పోటీలప్పుడు, హీరోల సినిమాల రిలీజులప్పుడు బెట్టింగ్ ఆటలు మొదలవుతాయి. ఇవన్నీ దేశభక్తిలో భాగమవుతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ లాగా ఈజ్ ఆఫ్ మనీకోసం బెట్టింగ్ అలవాటవుతుంది. మన ఊరుపేరు తెలుసుకొన్న తరువాత మెల్లగా మన కుటుంబపరిస్థితులను తెలుసుకుంటారు. మొదట్లో డబ్బు వచ్చేటట్టుగా ప్రోగ్రామ్ ఉంటుంది. క్రమంగా మన దగ్గర డబ్బులేకపోయినా యాప్ నిర్వాహకులే మరొక యాప్ లో అప్పులు పుట్టేటట్టు చేస్తారు. అలా ఉచ్చులోకి దింపుతారు.”

ఛీ. దుర్మార్గులు. అయినా వాళ్ళను తిట్టుకోవటం ఎందుకు? మనబుద్ధి ఏమయింది? పున్నయ్య కళ్ళు ఎర్రబడ్డాయి.

“నాలాంటి డబ్బులేని బలహీనుడు దాని ఉచ్చులో తొందరగానే పడతాడని వాళ్ళకు బాగా తెలుసుకాబట్టే వాళ్ళవ్యాపారం నిరాటంకంగా సాగిపోతుంది. నేను ఇంటికి డబ్బుపంపటం మానేసి మరీ బెట్టింగ్‌లో పాల్గొనేవాడిని. ఎప్పుడూ నష్టపోవటమే. వెనక్కి చూసుకుంటే అప్పులే.”

అయినా బుద్ధిరాలేదా ! చేతిలో ఉన్న ఎముకను విసిరేద్దామనుకొన్నాడు.

“అన్నా ! నా మీద కోపం వచ్చిందని తెలుసులే. ఎవరికైనా అలాగే ఉంటుందిలే. నాదగ్గర

డబ్బు అయిపోయి అప్పులు తీర్చని పరిస్థితిలో వాళ్ళు మన మీద ఒత్తిడి తెచ్చి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటిని అమ్మేటట్టు చేస్తారు. నేనెంతటి పాపిష్టి వాడినంటే ఒకరోజు ఇల్లును అమ్మమని అడిగితే మా నాన్న ఒప్పుకోనందుకు ఆయన గొంతు పిసికేయాలనిపించింది. డబ్బు యిచ్చి వాళ్ళు అద్దె ఇంటికి వెళ్ళి బతికిపోయారు..”

ఉద్ధరించావులే. ఛీ. పున్నయ్యకు ఆ ఎముకమీద మరింత అసహ్యం వేసింది.

“అప్పుకొంత తీరింది. కాని మిగిలిన అప్పు తీరుద్దువుగాని ఈ సారి నీ బెట్టింగే గెలుస్తుంది అంటూ బెట్టింగ్ ను నడిపే వాళ్ళు నన్ను మరింతగా ఉచ్చులోకి లాగారు. మళ్ళీ ఓడిపోవటం డబ్బుపోగొట్టుకోవటం అప్పులు పాలవటం జరిగింది. నా తిండి నేను తినలేని పరిస్థితి. ఏ పనికి వెళ్ళినా అప్పులే నాకంటే ముందుండేవి. జీతం చేతికి రాకుండా అప్పులవాళ్ళే ఎగరేసుకు పోయే వాళ్ళు. చేతిలో పైసా లేదు. స్నేహితులనేవాళ్ళు లేరు. తల్లిదండ్రులకు మొఖంచూపించలేని పరిస్థితి.”

నీలాంటివాడిని కన్నందుకు ఆ తల్లిదండ్రులు క్షోభ పడటానికే కదా !

“డబ్బులు లేక కనపడ్డ చీప్ కల్లు తాగి తాగి ఆరోగ్యం క్షీణించింది. పనిచేయలేని స్థితి. అద్దెకున్న ఇంటివాళ్ళు అద్దె కట్టకపోయేసరికి ఇల్లు ఖాళీ చేయమన్నారు. నిలవనీడలేదు. ప్రపంచం అంతా చీకటిమయం దారితెన్ను కనపడటంలేదు. కన్నవాళ్ళకు దూరమయ్యాను. ఒంటరి బతుకు. జీవితంలో అన్ని దారులు మూసుకుపోయాయి. అటు బెట్టింగ్ అప్పులు, ఇటు బాధ మరిచి పోవటానికి తాగుడు. ఇవన్నీ విడదీయరాని బంధనాల యొక్క అల్లిక. నాకు నాలో నేను మథనపడటం మొదలుపెట్టాను.”

అంతకంటే ఏమి చేయగలవులే. పున్నయ్యపెదవులపై చేదు చోటుచేసుకుంది.

“అవే ఉరితాళ్ళుగా అనిపించాయి నాకు అవే దిక్కు అనిపించి తల్లిదండ్రులను క్షమాపణ అడిగి ఉరితాడు బిగించుకున్నా.”

అయ్యో..అయ్యయ్యో... వారికి కడుపుశోకం మిగిల్చావు కదా ! నీకు ప్రాణం విలువ తెలియకపోయిందా. పున్నయ్య కళ్ళల్లో కన్నీటి తెర అడ్డుపడింది.

“నా తల్లిదండ్రులు లబోదిబోమని ఏడుస్తూ నా అస్థికలను కృష్ణలో కలపటం వరకు బాగా గుర్తు ఉంది. కృష్ణమ్మ కూడా నా పాపాన్ని కడగలేకపోతోంది. అన్నా ! నా లాగా ఎవరూ బెట్టింగ్‌కు పాల్పడకుండా కాపాడు అన్నా ! బెట్టింగ్ నిర్వాహకులను శిక్షించేటట్టు చెయ్ అన్నా ! నీకు పుణ్యం ఉంటుంది. అంతవరకూ నా బొక్కలకు పాపప్రక్షాళన ఉండదు.

చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవటం అంటే ఇదేలే..

"నీకు నేనంటే అసహ్యంవేసి నా బొక్కను బయటకు విసిరివేయాలనిపించినా ఆ శునకాలు కూడా ముట్టవు. తిరిగి నీళ్ళల్లోనే వేస్తే చీకిచీకి నశిస్తా. ఈ లోపలే నాలాంటివాళ్ళు బతికి ఉన్నప్పుడే బెట్టింగ్‌లో కూరుకొని పోకుండా ప్రక్షాళనచెందేట్టు చెయ్ అన్నా ! ఇదే నా ఎముక కోరేది."

పున్నయ్య మనసు అల్లకల్లోలం అయింది. సుళ్ళు తిరుగుతున్న కృష్ణమ్మలో ఆ ఎముకను విసిరివేసాడు. పొద్దుగుంకుతోంది. ఇల్లు గుర్తుకు వచ్చింది. తన పిల్లలను జాగ్రత్తగా పెంచాలనుకొని ఇంటి ముఖం పట్టాలనుకొన్నాడు.

కాని ఇంతలో "నా అంత పాపిష్టుడు పుట్టిన రోజే గిట్టాలి. లేకపోతే అమ్మతనమే బతకదు". నీళ్ళలో నుండి ఒకప్రేలాపన వినపడింది. పున్నయ్య పరికించి చూడగా అక్కడ వలలోంచి ఎగిరెగిరి తుళ్ళిపడుతున్న ఒక పుల్లలాంటి బొక్క. బొక్కలోనుండి నీళ్ళు ఎగిరెగిరి చిమ్ముతుంటే అదొక నీటి యంత్రంలా అనిపించి దాన్ని చేతిలో పెట్టుకొని ఒడ్డుకు తెచ్చాడు.

పదిహేడవ కథ

ఆ ఎముకలో నుండి చొంగ కారుతున్నట్టనిపించిన పున్నయ్య దానిని తుడవబోయాడు. ఏదో చప్పుడు వినిపించింది. "ఆగు మిత్రమా ! ఆగాగు. ఈ చొంగవంటి నీళ్ళలోని మత్తు చచ్చినవాళ్ళకు స్వర్గాన్ని చూపిస్తుంది. అదే నా లోకం. చనిపోకముందు నేను గంజాయిని తీసుకుంటే లోకం నవ్వేది.. నేను తాగినందుకు ఇంట్లో వాళ్ళు ఏడ్చారు. నేను మాత్రం మత్తులో జోగేవాడ్ని. నా ప్రపంచం అంతా హాయి హాయి..."

బాబోయ్ వీడిది గంజాయి కేసా? అని పున్నయ్య ఆ బొక్కను విసిరేయాలనుకొన్నాడు.

"వద్దు వద్దు. బయట ఎవరైనా నన్ను ముట్టితే వారి ఉసురుపోతుంది. నిజమే నేనంటే నీకు అసహ్యం. కాని నేనెందుకు అలా మత్తుకు బానిసనయ్యానో తెలుసుకుంటే నీకు నామీద జాలి కలిగి అసహ్యం పోతుందిలే !"

నీమీద జాలిపడాలా చాలు చాల్లే ! పున్నయ్య మనసు అసహ్యంతో రగిలిపోతోంది. కాని వీడిగురించి తెలుసుకుంటే లోకానికి నేనేదైనా చేయగలనేమో అని ఆ బొక్కగాథ వినాలనుకొన్నాడు.

"మిత్రమా ! నువ్వు తప్ప నాకు మిత్రులు ఎవరూ లేరు. నాతల్లిదండ్రులే నాకు శత్రువులు.

ఇక మిత్రులు ఎవరుంటారు. నేనొక ఒంటరి పక్షిలాగానే పెరిగాను. నా తల్లికి నాకంటే కాలనీలో ఇరుగుపొరుగున ఉన్నవాళ్ళే ఎక్కువ. వాళ్ళతో గడపటం, షాపింగ్ లు చేయటం ఇష్టం. మాకు డబ్బుకు కొదవలేదు. మానాన్న ప్రభుత్వ ఉద్యోగి. కావలసినంత డబ్బు సంపాదించేవాడు. రాజకీయనాయకులకు అండగా ఉండేవాడు. వాళ్ళు తమ పనులకోసం మా నాన్నకు తాగబోయించేవాళ్ళు."

సరేలే ! అర్థమయింది నీసంగతి అని మనసులో అనుకొన్నాడు పున్నయ్య.

"ఆయన ఏ అర్థరాత్రో ఇంటికి చేరుకునేవాడు. అమ్మ కూడా స్నేహితులతో సినిమా చూసి పొద్దుపోయిన తరువాత ఇంటికి వచ్చేది. ఈ లోపల పని అమ్మాయి వంటచేసి పెట్టి వెళ్ళేది. ఇంటికొచ్చి అమ్మ "ఏరా ! అన్నం తిన్నావా ?" అని అడిగేది. అప్పటికే గంజాయి మత్తుతో ఉన్న నేను "ఊఁ .. ఊఁ" అంటూ మత్తులో మూలిగేవాడ్ని.. "ఒహో నిద్రపోతున్నావా?" అంటూ ఆమె దోవన ఆమె పడుకోవటానికి వెళ్ళేది. అర్థరాత్రి ఇంటికి వచ్చిన తండ్రి తలుపులు టపటపా బాదేవాడు. అమ్మ లేచి తలుపుతీయంగానే ఏమే ఎవడితో తొంగున్నావు ఇంతసేపు తలుపు తీయటానికి అని అరవటం, అమ్మ తాగొచ్చి నామీద జులుం చూపుతావా నోరుమూసుకొని పక్కరూములోకి వెళ్ళి పడుకో అని ఆయన్ని కసురుకోవటం జరిగేది.. ఒసేయ్ నీకు నాలుగు తగిలిస్తేగాని నువ్వు నోరుమూసుకు పడి ఉండవు అంటూ నాన్న అమ్మను తగులుకునేవాడు. ఇది మా ఇంట్లో జరిగే రోజువారి భాగోతం."

బాగుంది సంబడం పున్నయ్య మనసులో ఏవగింపు చోటుచేసుకుంటోంది.

"నా గురించి నా చదువు గురించి పట్టించుకోవటానికి వాళ్ళకు టైము ఉండేదికాదు. మా ఇంటి పరిస్థితులు నన్ను మరింతగా గంజాయికి అలవాటు పడేట్టు చేసాయి. ఇంట్లో నాకోసం ఎవరూ లేరనే పరాయితనం అనిపించేది. స్కూల్‌లో సీనియర్లు నన్ను దగ్గర తీసేవారు. నా గురించి తెలుసుకున్నారు. ఒకరోజు నాకు చాక్లెట్ అంటూ తినమని ఇచ్చారు. దాన్ని చప్పరించేసరికి ఏదో తెలియని హాయి అనిపించింది. అలా వాళ్ళు రోజుకు రెండు నుంచి మూడు బిళ్ళలను ఇచ్చేవారు."

ఏంబిళ్ళలు అవి? ఎవరిస్తే వాళ్ల తీసుకోకూడదని చిన్నప్పుడు మీ అమ్మ చెప్పే ఉంటుంది కదా పున్నయ్య మనసు సందిగ్ధ పడింది.

"వాళ్ళు నాకు ఆప్తులుగా అనిపించేవాళ్ళు. ఒకరోజు వాళ్ళు నాకు ఆ బిళ్ళలు ఇవ్వకపోయేసరికి నా నాలుకంతా పీకుతున్నట్టనిపించింది. ఆ సీనియర్ విద్యార్థుల దగ్గరకు వెళ్ళి బిళ్ళలు కావాలని అడిగా. వాళ్ళు నవ్వుకుంటూ దానికి డబ్బులు కావాలన్నారు. పొద్దున నోటుబుక్కు కొనుక్కోవటానికి

ఇచ్చిన వంద రూపాయలు వాళ్ళచేతిలో పెట్టా. అంతే శభాష్ అంటూ వాళ్ళు నాకు రెండు బిళ్ళలు చేతిలో పెట్టారు. అవి వేసుకొని ఇంటికి వెళ్ళాను. సరాసరి నా గదిలోకి దూరుదామనుకొనేసరికి అమ్మ నన్ను పట్టుకొని ఏమిటి అలా తయారవుతున్నావు నాకు పక్కింటి ఆంటి చెప్పింది. వాళ్ళ చుట్టం ఒక పోలీసు ఆఫీసరుట. ఆయనకు తెలిసింది నాకు సీనియర్లు గంజాయి బిళ్ళలను ఇచ్చినట్టు, అవి నేను వాళ్ళకు డబ్బులిచ్చి కొనుక్కునట్టు అమ్మకు చెప్పారట."

చేసిన తప్పు తెలియకుండా పోతుందా? పున్నయ్య మనసు ఆందోళన చెందింది.

"నోటుబుక్కు కొనుక్కోవటానికి పొద్దున డబ్బులిచ్చానుగా బుక్కు కొన్నావా చూపించమని అమ్మ గద్దించింది. అంతవరకు నా గురించి పట్టించుకోని నా తల్లి నన్ను ప్రశ్నించేసరికి ఆమె మీద కోపం వచ్చింది. అవన్నీ అబద్దాలు అని చెప్పి నేను చదువుకోవాలంటూ గదిలోకి వెళ్ళి గడియపెట్టుకున్నా. మనసంతా అల్లకల్లోలం అయింది. అమ్మ మీద కోపం వచ్చింది. నాలిక దేనికోసమో తాపత్రయం పడింది. కాసేపు కాళ్ళుచేతులు కొట్టుకుంటూ జట్టు పీక్కొంటూ చివరికి నిద్రపోయాను."

ఇప్పటికైనా ఆ తల్లి మేల్కొంది నయం. పున్నయ్య మనసులో ఏదో ఆశా కిరణం.

"తెల్లవారి అమ్మకు మొహం చూపించలేకపోయాను. ఇక ఆ సీనియర్ల దగ్గరకు వెళ్ళకూడదనుకొన్నా. ఆ రోజు స్కూల్ అయిపోగానే ఇంటికి రావటానికి సైకిల్ ఎక్కుతుంటే.. తెలియని వ్యక్తి వచ్చి నాతో స్నేహం కలిపి మళ్ళీ కలుస్తాను అనుకుంటూ వెళ్ళాడు. ఆ రోజు అమ్మ నాకోసం ఎదురుచూస్తూ ఇంట్లోనే ఉంది. నా చదువు గురించి పరీక్షలను గురించి అడిగింది. చెప్పేసరికి ఆమెకు నామీద కాస్త నమ్మకం కుదిరింది. ఆ రోజు ఎలా తెల్లవారిందో నాకు తెలియలా. కాని స్కూలు గుర్తుకు రాగానే డబ్బులు కావాలనిపించింది. నిన్ననే అమ్మ ఇచ్చిందిగా ఇక అడిగినా ఆమె ఇస్తుందనే నమ్మకం లేక ఆమెకు తెలియకుండా ఆమె పర్సులోని డబ్బును కొట్టేసా".

"దొంగతనం కూడా అలవాటయిందా ఇక పతనం మొదలయిందన్నమాట" పున్నయ్య మనసు దడదడ కొట్టుకుంది.

"ఆ రోజు సాయంకాలం నిన్న పరిచయమైన ఆ వ్యక్తి నాదగ్గరకు వచ్చి నీదగ్గర డబ్బులుంటే నీకు కావలసినది ఇస్తా అన్నాడు. ఇంకేమి ఆ మాటలతో నా నరాలు జివ్వుమన్నాయి. అలా ఆ రోజు గంజాయిని లాగించి ఇంటికొచ్చి నాగదిలోకి వెళ్ళి ఒంటరిగా గడిపాను. అమ్మ నేను చదువుకుంటున్నానని భావించి తాను ఫ్రెండింటికి వెళ్ళింది. మర్నాడు పరీక్ష ఉన్నా నాకు చదువుకోబుద్ది

పుట్టలేదు. తెల్లారి మాములుగా స్కూలుకి అని బయలుదేరినా. కాని మధ్యలోనే ఆగిపోయా. నిన్నటి స్నేహితుడు వచ్చి రేపు డబ్బులు ఇవ్వచ్చులే అంటూ ఆ రోజు కొత్త సిగారును ఇచ్చాడు. దమ్మంటే దమ్మురా.. అనే పాట చెవులలో రింగుమన్నది. సాయంకాలం వరకు రోడ్లంబట తిరిగి ఇల్లు చేరుకున్నా".

చెడిపోతున్న విషయం నీకు తెలియటంలేదా ప్చ్.. పున్నయ్య మనసు చికాకు పడింది.

"స్కూలు వాళ్ళు నేను పరీక్షకు రాలేదని చెప్పటంతో అమ్మ నామీద కారాలు మిరియాలు నూరుతూ ఇంటి గడపలోనే ఎదురొచ్చి నన్ను ఈడ్చుకెళ్ళి అరుస్తూ కొట్టటం మొదలుపెట్టింది. నాలో పౌరుషం చచ్చిపోయింది. ఎదురుతిరగలేదు. ఏంచేస్తావో చేసుకో అన్నట్టు ఉండిపోయా. అమ్మ కొట్టి కొట్టి నాన్న రాగానే నా సంగతిచెప్పి గొడవపడింది. నాన్న నాకు గంజాయి అలవాటవటానికి అమ్మే కారణం అన్నాడు. అమ్మేమో నాన్న తాగుడే కారణం అంటూ ఇద్దరూ దెబ్బలాడుకుంటూ నా సంగతే మరచిపోయారు."

సంసారంలో మొగుడు పెళ్ళాలు కొట్టుకుంటూ తిట్టుకుంటుంటే పిల్లలు ఏం బాగు పడతారు. – పున్నయ్య మనసు రోతపడింది.

"నాకు బాగా ఆకలయింది. డైనింగ్ టేబులు దగ్గరకువెళ్ళి గిన్నెలలోనివి అన్నీ ప్లేటులోకి పెట్టుకొని ఆబగా తింటుంటే అమ్మ వచ్చి చూసి ఆశ్చర్యపోయింది. కొడుకన్న మమకారంతో అమ్మ ఏమీ అనలేదు. ఆ రోజు నాన్న అమ్మ అన్నం తినకుండానే పడుకొన్నారు. తెల్లవారింది. ఇక నేను గంజాయిని ముట్టుకోకూడదని అమ్మ మీద ఒట్టు పెట్టుకొన్నా. స్కూలుకువెళ్లా. "

పోన్లే, బుద్ధి కుదురింది. పున్నయ్య మనసు కాసేపు ప్రశాంతతను పొందింది.

"మాస్టారు చెప్పే పాఠం వినబుద్ధి వేయలేదు. బయటకు పోవాలనిపించింది. లంచుబ్రేకులో బయటకు వచ్చా. స్కూలు కాంపౌండ్ లో నుంచి ఆ వ్యక్తి చేయి చాస్తూ పిలిచాడు. నేను స్కూలు బయటకువచ్చా. మరి నా అదృష్టమో దురదృష్టమో కాని మా స్కూలువాళ్ళు స్ట్రిక్టుగా ఉండరు. నేను హాయిగా బయటకువచ్చా. అతడు నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి తన స్కూటరుమీద కూర్చోపెట్టుకొని ఒక సన్నని గొందులోకి తీసుకొని వెళ్ళాడు. గంజాయి హుక్కాని అందించాడు. స్వర్గమంటే అదే అనిపించింది. ఆ రోజు తానే దగ్గరుండి పబ్బుకు తీసుకొని వెళ్ళి అమ్మాయిలతో డాన్సు చేయించాడు ఆ అమ్మాయిలు కూడా గంజాయి మత్తులో ఉన్నారు. ఇక జీవితం అంటే ఇదే అనిపించింది."

అమ్మాయిలు కూడా అలవాటయ్యారంటే నిన్ను ఆ దేవుడు కూడా కాపాడలేడు. పున్నయ్య మనసు కుతకుతలాడింది.

"ఇంటికి లేటుగా వెళ్ళా. మా నాన్న రాలేదు. హాల్లో ఉన్న అమ్మ నన్ను చూస్తూనే భద్రకాళి అయింది. గంజాయి తీసుకునేవాడివి నువేమి బాగుపడతావురా. చెత్త వెధవలతో స్నేహం చేస్తున్నావు. నిన్ను ఎంతో ముద్దుగా పెంచినందుకు తగిన శాస్తిని కలిగించావులే..బాగా చదువుకొని మాకు మంచి పేరుప్రతిష్ఠలు తెస్తావనుకున్నా. ఇక నిన్ను ఇలా వదిలిపెడితే లాభంలేదు. మీ నాన్న వచ్చిన తరువాత నీ సంగతి తేలుస్తా. నిన్ను డాక్టర్ల దగ్గరకు తీసుకుపోయి చికిత్స చేయిస్తేగాని నీ రోగం కుదరదు. ముందుగా ఇంట్లో నీ కాళ్ళు చేతులు కట్టేసి కూర్చోపెడతా. రేపటినుండి నువ్వు కాలేజీకి కాదుకదా ఎక్కడికి వెళ్ళకుండా చేస్తా. ఎలా ఆ గంజాయి తాగుతావో చూస్తా అని అమ్మ అంటుంటే నాకు మర్రోజునుండి గంజాయి దొరకదనే భయం పుట్టుకొచ్చింది.

అమ్మయ్య ! ఇక మీ అమ్మ నీ తిక్కకుదిరిస్తుందిలే. ఇకనైనా బాగుపడుదువుగాని – పున్నయ్య మనసులో ఆవేదన కాస్త తగ్గుముఖం పట్టింది.

"నా నాలుక పిడచకట్టుకుపోతోంది. అప్పటికప్పుడే గంజాయి దమ్ము పీల్చాలనిపించింది. నాన్న వస్తే అమ్మ తన విశ్వరూపం చూపించి నన్ను కట్టేసినా కట్టేస్తుంది. ఈ లోపే ఏదో ఒకటి చేయాలనే తపన. నేనేమి ఆలోచిస్తున్నానో నాకే తెలియని స్థితి. అరిచి అరిచి అమ్మ అలిసిపోయి నీళ్ళకోసం ఫ్రిజ్ డోరు తెరుస్తుంటే అక్కడే ఉన్న నాకు డైనింగ్ టేబుల్ మీద ఉన్న కత్తి కనపడింది. ఇకేమి ఆలోచించే స్థితిలోలేని నేను వెంటనే కత్తితో అమ్మమీద వెనకనుండి దాడిచేసి మెడమీద వేటువేసా. ఇలా నేను చేస్తానని అనుకోని అమ్మ రక్తంలో తెళ్ళుతూ ఒరేయ్ ! నువ్వు నాశనం అవటానికి నేను మీనాన్న కారణం రా. నీ దోవన నిన్ను వదిలేసాం. దానిఫలితమే రా ఇలా నువ్వు. కన్నతల్లి అని చూడకుండా నా మెడను నరుకుతున్నావుట్రా.! అంటూ అరుస్తుంటే మరొక వేటువేసాను. మా అమ్మ కుప్పకూలిపోయింది.."

అయ్యో !.. నీకు ఏమి పోయేకాలం రా.. మత్తుకు బానిసయి కన్నతల్లిని చంపావా.. నీచుడా!.. పున్నయ్య మనసులో క్రోధం కట్టలు తెంచుకుంది.

"నేను ఇక అక్కడ ఉండలేక ఎవరికీ కనపడకుండా చాకుతోపాటు పరిగెత్తుకుంటూ వెళ్ళి గంజాయి స్నేహితుని కలిసి ఆ పాడుబడ్డ ఇంటిలో దాక్కొన్నాను. అతడు నాకు రక్షణ కలిపించాడు. అయితే అమ్మ మూలుగు వినిపించి వచ్చి చూసిన మాపక్కింటి వాళ్ళు పోలీసులకు కబురందించారు.

ఇంతలో నాన్న గుప్పుమనే వాసనతో ఇంటికి వచ్చేసరికి అప్పటికే మా ఇంటికి చేరుకొన్న పోలీసులు ఇరుగుపొరుగు వారిని విచారించటం, వాళ్ళు మా అమ్మా నాన్న రోజు గొడవపడే విషయం చెప్పటంతో వాళ్ళు మా నాన్నను అరెస్టు చేసి తీసుకెళ్ళటం జరిగింది. నాకీవిషయం తెలిసి నేను ఇంటికి వెళ్ళి అమ్మకోసం ఏడ్చేసరికి అందరూ నన్ను నమ్మారు."

మత్తులో కూడా బాగా నటించావురా ! పున్నయ్యలో ఆశ్చర్యం, అసహ్యం ఒకేసారి చోటుచేసుకున్నాయి.

"పక్కింటి వాళ్లు వచ్చి ఓదార్చారు. పోలీసులు ఇంటికి తాళం వేయటంతో పక్కింట్లోని ఆంటి పిలిచి పెట్టిన అన్నం తిని నేను మళ్ళీ ఆ సన్నని సందులో ఉండే ఆతని ఇంటికే తిరిగి చేరుకొన్నా. రెండురోజులపాటు విచారించిన పోలీసులకు ఆ హత్య మానాన్న చేయలేదనే నమ్మకం కుదిరింది. అయితే విచారణలో భాగంగా మా నాన్న నేను గంజాయి తీసుకోవటాన్ని గురించి చెప్పేసరికి పోలీసులు నాకోసం వెదకి నన్ను పట్టుకొచ్చి విచారించటం, మైనారిటీ కూడా తీరకపోయేసరికి నన్ను జువనైల్ జైలులో పెట్టటం జరిగిపోయింది."

మంచి పని చేసారు. పున్నయ్య పోలీసులను మనసులోనే అభినందించాడు.

"వాళ్ళు హాస్పటలులో ట్రీట్మెంటు ఇప్పించారు. కాళ్లుచేతులు కొట్టుకుంటూ ఉంటే నన్ను కట్టివేసేవాళ్ళు. నోరు తడి ఆరిపోతుంటే నేను పిచ్చి పిచ్చిగా వాగేవాడ్ని. కొన్నాళ్ళతరువాత నన్ను తిరిగి హాస్టల్ కి పంపారు. అక్కడ అప్పుడప్పుడు రహస్యంగా గంజాయి అందించేవాళ్ళుండే వాళ్ళు. మూడేళ్ళతరువాత నన్ను విడుదల చేసారు. కుక్కతోకబుద్ధి ఎక్కడకు పోతుంది. మా నాన్నకు అప్పగించారు. అప్పటికే మా నాన్న రెండోపెళ్ళి చేసుకున్నాడు. ఆమె నన్ను ఇంట్లోకి రానీయనని చెప్పింది. మా నాన్న వేరే ఊరికి పంపి హాస్టల్లో ఉంచాడు."

నీ తిక్క కుదిరి ఉంటుంది. అప్పటినుండి యైనా బాగు పడితే నీకీ గతి పట్టేది కాదులే. – పున్నయ్య వాడి జీవితాన్ని కాస్త కాస్త ఊహించగలుగుతున్నాడు.

"ఇంటికి రాకుండా ఉంటే చాలు అని మా నాన్న అడిగినంత డబ్బు పంపేవాడు. నాకు పట్టపగ్గాలు లేకుండా పోయింది. గంజాయి లేకుండా బతకలేని పరిస్థితి. ఒకరోజు డబ్బుకోసం ఇంటికి వెళ్ళే దారిలో ఒక అమ్మాయి కనపడింది. ఆ అమ్మాయిని పట్టుకొని నా మీదకు లాక్కొన్నా. ఏదో చెయ్యాలని తాపత్రయం పడ్డా. ఇంతలో ఆ అమ్మాయి నా గూబ గుయ్యుమనిపించింది. నన్ను ఒదిలిపెట్టి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది."

చాలామంచి పనిచేసింది. పున్నయ్య మనసుకు ఉత్సాహం కలిగింది.

"చేసేదిలేక ఇంటికివెళ్ళి గొడవపడ్డా. నాన్న మెడపట్టుకొని నొక్కే లోపలే నాన్న నన్ను కిందపడేసాడు. గంజాయి తాగటంతో నాలో అప్పటికే జవసత్వాలు నశించిపోయాయి. పట్టుతప్పి కింద పడ్డా. నాన్న నన్ను మళ్ళీ డీఎడిక్షన్ సెంటరులో పెట్టాడు. అక్కడ ఉండలేకపోయాను. గంజాయిలేని జీవితం వ్యర్థమనిపించింది. ఒకరోజు నన్ను ఎవరూ పట్టుకోకుండా పారిపోయి పరిగెత్తి పరిగెత్తి ఊరికి దూరంగా ఒక చెట్టుకింద కూలపడ్డా. దిక్కు తోచలేదు. ఆకలివేస్తోంది. నాలుక పిడచకట్టుకొని పోతోంది. ఇక నేను బతకటానికి దారులన్నీ మూసుకొని పోయినట్టని పించింది."

మరి స్వయంగా చేసుకొన్న పాపం కదా.. పున్నయ్యకు జాలికలగలేదు.

"ఆ పచ్చనిచెట్టు కిందకూడా నేను సేదతీరలేకపోయాను. ఏదో కావాలని అనిపించింది. నా శరీరం నిలవలేకపోతోంది. బతకాలని అనిపిస్తోంది. ఆశగా ఆకాశంవైపు చూస్తుంటే. కాని నాలో ఒక ఆలోచన రేగింది. ఆ చెట్టుకింద మామిడి కాయలు కోసుకొని వదిలి పెట్టిన గోతం, దాని తాళ్ళు కనపడ్డాయి. ఇక ఏమి ఆలస్యం చేయకుండా ఆ గోతంతాడును చేతిలోకి తీసుకొని ఉరితాడు బిగించుకున్నా. క్షణాల్లో నాబాధ తీరింది. గొంతు పొడారిపోయింది. మా నాన్న స్నేహితుడు నా శవాన్ని గుర్తుపట్టటం, మా నాన్నకు కబురుచేయటం, పోలీసుకేసు కాకుండా మానాన్న నాశవాన్ని కారులోకి ఎక్కించుకొచ్చి ఈ కృష్ణలో పడేసివెళ్ళటం బాగా గుర్తుంది. చచ్చేముందు చావు తెలివి అంటే ఇదే కాబోలు."

అనుకున్నంతా జరిగిందీ. నీ శిక్ష నువ్వు వేసుకోక తప్పదులే. పున్నయ్య మనసు నిర్వేదం చెందింది.

"తల్లిని చంపిన హంతకుడికి పుట్టగతులు ఉండవుగా. నాలాంటి కొడుకు పట్టనే పుట్టకూడదు. పొరపాటున పుట్టినా ఆనాడే గిట్టాలి. లేకపోతే తల్లి దండ్రులకు కీడు కలగటం ఖాయం. ఇదే నేను చెప్పే జాతకం. మిత్రమా ! నాలాంటివాళ్ళచేతిలో తల్లిదండ్రులకు చావు భయం లేకుండాఉండాలంటే లోకంలో మత్తుకు బానిసను చేసే డ్రగ్గు ముఠా వాళ్ళను కనిపెట్టి శిక్షించేటట్టు చెయ్యాలి. అప్పుడే ఈలోకంలో తల్లిదండ్రులకు రక్షణ ఉంటుందని నా జీవితం ఉదాహరణగా చెప్పి నీవు లోకాన్ని ఉద్ధరించు. అప్పుడే ఈ బొక్క పూర్తిగా రూపుమాపుతుంది. నా ఎముకలు ఈ కృష్ణమ్మను కలుషితంచేస్తే

ప్రవాహవేగం తగ్గుతుంది. మురికి చేరుకోకముందే నా ఎముకలను ఏరిపారెయ్యి మిత్రమా ! కృష్ణమ్మ నిన్ను కరణిస్తుంది. కృష్ణమ్మ తరఫున యువతను మత్తుమందులకు బానిస కాకుండా కాపాడు. నన్ను చితకబాది పొడిచేసి బూడిదగుట్టలో పడేసి చూర్ణం అయేట్టుచెయ్యి అన్నా ! నీకు పుణ్యం ఉంటుంది" ధారాపాతంగా చొంగనీరు కురుస్తూనే ఉంది.

పున్నయ్య ఆ బొక్కను దూరంగా తీసుకొని వెళ్లి, పొడిచేసి దగ్గర ఉన్న చేలల్లో వెదజల్లి ఎరువుగా అన్నా ఉపయోగపడు అంటూ పడేసి ఇంటిముఖం పట్టాలనుకొన్నాడు.

పున్నయ్య మాత్రం మళ్ళీ తన ప్రయత్నంగా వలను తీసుకోవాలని ప్రయత్నించాడు. వలలో రెండే ఎముకలు మిగిలాయి. ఒక పెద్ద ఎముక దానిపక్కనే ఉన్న చిన్న ఎముక చేతికి తగిలాయి. ఆ బొక్కల్లోనుండి వింతశబ్దాలు వినపడ్డాయి. షరా మాములే కదా అనుకొన్నాడు. పున్నయ్యకు వినబడేటట్టు ఆ ఎముకలలోని పెద్ద ఎముక గుడగుడమంటూ చప్పుడు చేసింది.

ఒహో ! దీనిలో ఏదో చిన్న పలకబిళ్లలాంటిది కొద్దిగా బయటకు వచ్చింది. ఓ సైంటిస్టు చెప్పిన చిప్పుబిళ్ళ ఇదేనా' దాన్ని జాగ్రత్తగా గోటికొనతో ఇంకాస్త లోపలికి తోసాడు. అయ్యో ! ఆ ఎముక లోపలినుండి ఉబుకుతున్న నీళ్ళల్లో నుండి వచ్చే శబ్దాలు స్పష్టంగా తోటి మనిషి మాట్లాడుతున్నట్టు అర్థం అవుతున్నాయి పున్నయ్యకు.

"వాడిని చంపేయాలి. ఆ రాక్షసుడ్ని బతకనీయొద్దు. "పెద్ద ఎముకలోంచి నీళ్ళు తుళ్ళి తుళ్ళి పడుతున్నాయి.

"ఎవడీ రాక్షసుడు? ఎందుకు చంపేయాలని ఇది పలవరిస్తోంది? పున్నయ్య ఆ ఎముకను రెండు చేతులతో పట్టుకొని ఒడ్డుకు తెచ్చి నిట్టూర్చాడు.

❊ ❊ ❊

పద్దెనిమిదవ అస్థిక కథ

"ఓ మిత్రమా ! ఏభై ఏళ్ళ వయసులోనే నా ఎముకలు ఎందుకు ఇలా నీళ్లల్లో పడి ఉన్నాయో నీతో చెప్పాలనే ఉంది. ఇలా నేను ఉండటానికి కారణం నా కారు. అదే లేకపోతే నాకీగతి పట్టేదికాదు."

'అయ్యో ! కారు ప్రమాదానికి గురి అయిందా' అని పున్నయ్య మనసు బాధకు లోనయింది.

"నీ మనసు నాకర్థమయింది మిత్రమా ! ప్రమాదం కాదు. అంతకంటె మించింది. నేను

అంతస్తుల భవన సముదాయంలో ఒక అపార్టుమెంటు కొన్నా. అంతస్తులపైన ఇళ్ళు ఉంటాయికదా. తమతమ కార్లు, స్కూటర్లు పెట్టుకోవటానికి ఇళ్ళ కింద ఉన్న ఖాళీ స్థలాన్ని పైన ఉన్న ఇళ్ళవాళ్ళందరి పేర రిజిస్ట్రేషన్ చేసారు.

ఇప్పుడు ఆ సోది అంతా నాకెందుకు చెపుతున్నావ్ ? పున్నయ్య మనసంతా గజిబిజిగా ఉంది.

“అక్కడికే వస్తున్నా. ఎందుకు చెబుతున్నానంటే అసలు నాచావుకు కారణం అక్కడే మొదలయింది.

ఇదేదో తెలుసుకోవాల్సిన విషయమే. పున్నయ్య మనసు కుతూహలపడింది.

“ఇంటి స్థంభాలమధ్యన కింద ఉన్న ఖాళీస్థలాన్ని పైన నివాసం ఉండేవాళ్ళందరికీ కొంతకొంత స్థలంలో తమ వాహనాలు పెట్టుకోవటానికి వినియోగించుకోవటానికి చట్టపరమైన నిబంధనలు ఉంటాయి. అయినా బుద్ధి గడ్డి తిన్న బిల్డర్లు కాసులకు ఆశపడి వాహనాలు పెట్టుకోవటానికి పైన ఇంటి వాళ్ళందరికీ ఇచ్చిన ఆ ఖాళీస్థలాలలో స్థంబాల మధ్యన గోడలు కట్టి ఇల్లు లాగా చేసి వేరేవాళ్ళకు అమ్మారు.”

మీ స్థలాన్ని మీకు తెలియకుండా ఎలా అమ్ముతారు? వాళ్ళు ఎలా కొనుక్కుంటారు? తరువాత నష్టపోవాల్సింది కొనుక్కున్నవాళ్ళేకదా ! పున్నయ్య మనసు అన్యాయాన్ని ప్రశ్నించింది.

“ఆ స్థలయజమాని, బిల్డరు కలిసి ఇళ్ళన్నీ అమ్ముకొని సొమ్ముచేసుకొని చిరునామాకూడా తెలియరాకుండా పరారయ్యారు.

వాళ్ళను ఎందుకు వదిలిపెట్టారు అపార్టుమెంటువాళ్ళందరూ పున్నయ్య సందేహపడ్డాడు

“నీ మనసు అర్థం అయింది మిత్రమా ! వాళ్ళంతా రియల్ ఎస్టేట్ వాళ్ళు. ముందు జాగ్రత్తగా రౌడీలను పెట్టుకొంటారని, వాళ్ళజోలికి ఎవరూ వెళ్ళదలచుకోలేదు.”

సరే వాళ్ళచావు వాళ్ళుచావనీ. మరి మునిసిపాలిటీవాళ్ళు చదువుకున్నారు కదా. రూల్సుకు వ్యతిరేకంగా ఇళ్ళను కడితే ఎలా ఊరుకొన్నారు ? పున్నయ్య తనలో తనే అనుకొన్నాడు.

“నిజమే మిత్రమా ! వీధులలో ఎవరైనా ఇళ్ళు కట్టుకుంటుంటే పరిశీలించటానికని వీధికొకరు మునిసిపాలిటీ ఉద్యోగస్థులు ఉంటారు కూడా. అయినా పట్టించుకోరుగా.

ఆం.. మాముళ్ళు ముట్టచెబితే చూసిచూడక వదిలేయటం మాములేగా ' పున్నయ్య మనసుకు తాను విన్న విషయాలు గుర్తుకు వచ్చాయి.

"మిత్రమా ! నువ్వు ఇంటికి వెళ్ళే వేళ అయిందేమోగాని నా ఘోషపట్టించుకునే వాడివి నువ్వు తప్ప ఎవరూ లేరు. నీతో పంచుకొని ముక్తి పొందుతాను. పైన ఇంటివాళ్ళు తమవాహనాలను పెట్టుకోవాలంటే ఖాళీచోటులేకుండా చేసి కింద అపార్టుమెంట్లు కట్టి అమ్మాడుగా. చాలామేర ఖాళీస్థలం అంతా ఇళ్ళుకట్టాడు. కింద ఇళ్ళముందు కొద్దిగా ఖాళీ స్థలం ఉన్నా, ఆ కింది ఇళ్ళను కొనుక్కున్నవాళ్ళు తమ ఇంటిముందు తామే పెట్టుకోవాలిగాని ఇతరుల వాహనాలను రానివ్వమని అంటారు."

ఇల్లు కట్టటమేకాకుండా పైగా అదో రుబాబా !

పైన ఉన్న అపార్టుమెంటువాళ్ళందరం బొక్కబోర్లాపడ్డామని గ్రహించి మున్సిపాలిటీకి అర్జీపెడదామనుకొన్నారు. కాని కింద ఉన్న ఇంటివాడు ఒక రౌడీ అని తెలిసి బతికుంటే బలుసాకు తిని బతకచ్చులే అని అయినకాడికి నష్టానికే ఇళ్ళు అమ్ముకొని పోయారు. బ్రోకరు గంపగుత్తిగా పై అంతస్తులలోని ఇళ్ళన్నీ ప్రవాసాంధ్రులకు అమ్మిపెట్టాడు. మిగిలిన ఇళ్ళవాళ్ళు పిరికివాళ్ళు".

సరే ఇంతకీ ఇతను ఇలా బొక్కకింద అయ్యాడెందుకో? అసలు విషయం అది చెబితే బాగుండు. తొందరగా ఇంటికి వెళ్ళాలి. పున్నయ్య మనసుకు విసుగనిపించింది.

"అక్కడికే వస్తున్నా ! నేను ఒకరోజు కిందఖాళీగా ఉందికదా. మాపేరన ఉన్న స్థలమే కదా అని నా కారుని పెట్టా. అంతే ఆ కింది ఇంటివాడు ఎక్కడినుండి వచ్చాడోగాని రాక్షసుడిలా నా వాహనాన్ని పడగొట్టి నామీదమీదకు వచ్చాడు. వాడు నన్నెక్కడ చంపుతాడో అని పరుగెత్తుకుంటూ పోలీసు స్టేషన్ కి వెళ్ళా జరిగింది చెప్పా. వాళ్ళు ఇది సివిల్ కేసు కోర్టుకు వెళ్ళమన్నారు. కోర్టుకు వెళ్ళా. లాభంలేదు. మా లాయరు వాడి లాయరు కుమ్మక్కయి కాసుకు గడ్డితిని వాడినే గెలిపించారు. నాకు న్యాయవాదులమీద నమ్మకం పోయింది. నేను కాస్త చదువుకున్నాగా బహుళ అంతస్తుల నివాసాలకు సంబంధించిన చట్టాన్ని చదువుకొని పై కోర్టువెళ్ళా. కాని నిజాయితీ పోరాటంలో అలుపుండదుగా. ఆ ధర్మదేవతను నమ్ముకొని ఉన్నతన్యాయస్థానంలో కేసువేసా."

అక్కడ చట్టాలను పట్టించుకుంటారని ఒక లాయరు చెప్పాడుగా. అక్కడ గెలిచే ఉంటాడు. పున్నయ్య మనసు నిశ్చింతను పొందింది.

“నేను గెలవటం కాదు. ఓడిపోయిన నీతి గెలిచింది”.

ఏమిటీ సామీ ! కాస్త అర్థమయ్యేటట్టు చెపితే బాగుండు. పున్నయ్య మనసు గందరగోళపడింది..

“నేను మళ్ళీ పైకోర్టుకు వెళ్ళినందుకు వాడికి నామీద కసి ఏర్పడింది. వాడు నన్ను కోర్టులోనే తేల్చుకుంటాడులే అని నిర్భయంగా ఉన్నా. కాని ఒకరోజు నేను డ్యూటీ ముగించుకొని చీకటివేళ ఇంటికి వస్తుంటే కాపుకాసి నన్ను కత్తితో నరుకుతూ ఎన్నిసార్లు నేను కేసు కోసం లాయర్లకు డబ్బులు పెట్టాలిరా. ఈసారి నిన్ను చంపేయటమే నా గెలుపు అంటూ వాడు నామీద దౌర్జన్యం చేసాడు. నేను కళ్ళు తేలేస్తున్నా. ఎదురుకుండా రాక్షసుడిలా వాడే కనబడుతుంటే ఆ ఆఖరి క్షణాలలో నాకు నా కుటుంబవ్యక్తులు గుర్తుకురాలేదు.”

అయినా భయంతో చచ్చిపోతుంటే ఎవరు గుర్తుకు వస్తారులే !

“మిత్రమా ! ఈ అనాగరిక సమాజంలో మానవుడికి నిలవనీడ ఉండదు. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థదే పైచేయి అన్నారు గాని న్యాయం డబ్బుకు దాసోహం అవుతుంటే దేవుడేమి చేస్తాడు. నా ఇంట్లో వాళ్ళకు కబురందించిన పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్ళటం మాములేగా. అక్కడ మార్చురీలో కొంత సొమ్ము ముట్టచెప్పి మా వాళ్ళు నా శవాన్ని ఇంటికి తెచ్చారు. కాని శవాన్ని పడుకోబెట్టే స్థలంగాని, అవకాశం గాని లేక రోడ్డుమీద నన్ను పడుకోబెట్టటం, దుమ్ముధూళి నాపైన పడటం వరకే గుర్తుంది.”

అయ్యయ్యో ! ఇల్లు ఉండి కూడా ఎంత కష్టం వచ్చిందీ ! పున్నయ్య మనసు కుతకుతలాడింది.

“మా ఇంటివాళ్ళు నా ఎముకలను ఇలా నీళ్ళల్లో పడేయటంతో ఇలా నీచేతిలో పడ్డా. నువ్వన్నా నా యింటివాళ్ళకు న్యాయం చెయి మిత్రమా !” ఆ ఎముక నీళ్ళను కక్కుతూ దీనంగా చూస్తున్నట్టు అనిపించింది పున్నయ్యకు. మిత్రులందరితో కలిసి ఇలాంటి వాటి విషయంలో ఏదో ఒకటి చేయాలి పున్నయ్య తనలో తనే గొణుక్కుంటూ ఆ పెద్దాయన ఎముకను జాగ్రత్తగా వల పక్కన పెట్టి వస్తుంటే వల అడుగున ఒక చిన్న ఎముక కనబడింది.

“తాతా ! నన్ను మరిచిపోయావా !” పిల్ల బొక్క పిలిచినట్టయింది. పున్నయ్య ఆ చిట్టి ఎముకను గుండెకు హద్దుకొని ఒడ్డుపైకి తెచ్చి చిట్టి బొక్కకు పసివయసులో ఈ గతి పట్టటం ఏమిటమ్మా! తెలుసుకోవాలి. చెవికి దగ్గరగా ఆ చిట్టిబొక్కను పెట్టుకొన్నాడు. ఆ బొక్కలో నుండి గాలి తెరలుతెరలుగా చేస్తున్న చప్పుడులో అస్పష్ట భావాలు తన మనసును తాకుతున్నట్టనిపించింది. పక్కన కృష్ణమ్మలో చిన్ని చిన్ని అలలు ఎగసిపడుతున్నాయి.

పంతొమ్మిదవ అస్థిక కథ

"తాతా ! నాకు నీవు తప్ప ఎవరూ లేరు. నా తండ్రి నన్ను నిర్ధాక్షిణ్యంగా చంపాడు." .

అదేమిటమ్మా ! తండ్రి చంపటం ఏమిటి? చిన్న వయసులో నీకు అంత కష్టం ఎందుకువచ్చిందమ్మా? అంటూ పున్నయ్య మనసు కకావికలమైంది.

"తాతా ! మా అమ్మానాన్నలు ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. కాని ఇలా రోజూ గొడవపడతారెందుకని మా పక్కింటి వాళ్ళు నన్ను అడుగుతున్నప్పుడు ఆ విషయం నాకు తెలిసింది. మా అమ్మ హిందు దేవుళ్ళను పూజిస్తుంది. మా నాన్న ముస్లిము. వాళ్ళ పూర్వీకులు ముస్లిము మతంలోకి మారారట. మా చుట్టాలు పరుపులు తయారుచేస్తారు. అందుకే మమ్మల్ని దూదేకుల సాహెబులు అంటారు. అమ్మను ఇస్లాములోకి మారమని నాన్న రోజు గొడవపెడతాడు."

మతందేముందీ, ఎవరిమతం వాళ్ళకుంటే చాలుగా. పున్నయ్యమనసు సమాధానం వెతుక్కుంటోంది.

"అమ్మేమో నాన్నతో పెళ్ళికి మునుపు ప్రేమకు మతంలేదు. నీమతం నీది నామతంనాది ఎవరిష్టం వచ్చినట్లు ఉండొచ్చు అని అన్నావుగా. పెళ్ళయిన తరువాత మతం మన ఇద్దరిమధ్య అడ్డుగోడయింది. దాన్ని ఇద్దరూ కూల్చకపోతే ఎవరో ఒకరమే పిల్లకు పేరెంటుగా మిగులుతాం- అనేది. నాకప్పుడు అర్థం కాలా. నాకు నాన్న అంటేనే ఇష్టం రోజూ స్కూటరు మీదకు ఎక్కించి తిప్పేవాడు. అమ్మకు మాత్రం ఘోషా. ఇంట్లోనే ఉండేది."

పోనీలే మరి నీకీగతి ఎలా పట్టింది తల్లీ ?

"నీ మనసు లోని సందేహం నాకు అర్థమవుతోంది తాత ! రోజూ అమ్మానాన్న పొరపాటయింది నిన్ను పెళ్ళిచేసుకోవటం అని ఒకొళ్ళకొకళ్ళు దెబ్బలాడుకొనేవారు. నాన్న అమ్మను కొట్టేవాడు. అప్పుడు నాన్న అంటే నాకు కోపం వచ్చి అమ్మ దగ్గరకు పరిగెత్తేదాన్ని. మా అమ్మ నన్ను దగ్గరకు తీసుకొని తల్లీ నేను చేసిన పొరపాటుకు నిన్ను బలిపెట్టను తల్లీ అనేది. నాకు అర్థమయ్యేది కాదు. ఒకరోజు మా నానమ్మ వచ్చింది. ఆమెను 'దాదిమా' అని పిలవమనేవాడు మానాన్న. ఒకరోజు మా అమ్మ పూజ చేసుకుంటుంటే అలా చేయెుద్దు అంది మా దాదిమ. మా అమ్మ నాయిష్టం అన్నది. అలా అమ్మ అన్నందుకు సాయంకాలం ఇంటికి వచ్చిన మా నాన్నకు దీది చెప్పింది. అంతే మా నాన్న అమ్మను పిడిగుద్దులు గుద్దాడు. అమ్మ సొమ్మసిల్లింది."

అయ్యో ఎంతపని జరిగింది తల్లీ !

"అన్నం కూడా తినలేదు. ఆ రాత్రి నిద్రపోతున్న నన్ను తనతోపాటు బయటకు తెచ్చింది. నాకు అప్పుడు ఏడేళ్ళు రెండో తరగతి చదువుకుంటున్నా. నాకు మెలకువ వచ్చింది. తలుపుతీసుకొని బయటకు వస్తుంటే మానాన్న అడ్డంపడి పిల్లను వదిలిపెట్టి నువ్వు వెళ్లు. దాన్ని తీసుకొని వెడితే నిన్ను ఇప్పుడే చంపేస్తా అని అరిచాడు. అమ్మతోపాటు నేను కూడా భయంతో వణికి పోయాం."

"కాసేపటికి అమ్మ నన్ను ముద్దాడి అక్కడే ఉంచి తాను చీకటిలో కలిసిపోయింది. అమ్మా! అమ్మా ! అంటూ నేను ఏడుస్తుంటే మా నాన్న పట్టించుకోలేదు. మా అమ్మమీద కోపం నామీద చూపించాడు. నా వంటిమీదదెబ్బవేసాడు. నాన్న అంటే మొదటిసారి నాకు అసహ్యం వేసింది. "

పసిపిల్ల ఏమి చేసిందని అభం శుభం తెలియని దానిమీద కోపం తెచ్చుకోవటం ఏమిటి ఫ్చ్.. పున్నయ్య మనసు బాధతో మెలికలు తిరిగింది.

"మా దాదిమ నన్ను ఏడవకు అంటూ రెండుకొట్టింది. నాకు నిద్రమత్తు పూర్తిగా వదిలింది. అమ్మా అంటూ కలతనిద్రలో ఉన్నా నాన్నమ్మ ఓరేయ్ ఆనాడు చెబితే వినలేదు. మళ్లీ నీకు మన మతం వాళ్ళతో నిఖా జరిపిస్తా ఇంతటితో వదిలిపోయింది అంది. నాన్న ఏమీ అనలేదు. నాకు కొత్త అమ్మ వస్తుందేమో అని నేను దాదిమాకి భయపడి నోరుమూసుకొని నాలో నేను ఏడిచా. తెల్లారింది. నాకు అమ్మ కావాలని నాన్నను అడిగా. నోరుమూసుకో అని కసిరాడు. ఆ రోజు నేను అన్నం తిననని మొరాయించా. నాన్నకు నామీద కోపం వచ్చి అన్నీ అమ్మబుద్ధులే అంటూ నన్ను కొట్టాడు."

అయ్యో చిట్టి తల్లీ ! పున్నయ్య మనసు విలవిల లాడింది.

"నాకు నాన్న అంటే రాక్షసుడులా అనిపించేవాడు. అందుకే అమ్మను చీటికిమాటికి కొడుతుండే వాడని అనుకున్నా. ఒకరోజు రాత్రి అన్నం తిని వస్తూ ఇంట్లో నేలమీద నేను జారి పడ్డా అమ్మా ! అని అరిచా. ఇంట్లో ఉన్న నాన్న నా దగ్గరకు పరిగెత్తుకొని వచ్చాడు. నా తలను నిమురుతాడని అనుకున్నా ఒసేవ్ నువ్వు కూడా మీ అమ్మపోలికే. అమ్మా ! అమ్మా ! అని ఎప్పుడూ కలవరిస్తావు. నాన్న అని పిలవవెందుకు అంటూ నిష్కారణంగా నేను అమ్మను తలచుకొన్నందుకు అమ్మమీద కసి అంతా నామీద చూపిస్తూ నా గొంతుపట్టుకొని పిసుకుతున్నాడు.

అయ్యో ! వాడు తండ్రా ! ఛీ ఛీ మనిషి కోపం ఎంతపని చేస్తుంది పున్నయ్య మనసు ఆగ్రహించింది.

"అక్కడికి వచ్చిన దాదిమ దీన్ని చంపేయరా పీడ వదులుతుంది. ఈ సంకరదానికి చేయలేక చస్తున్నా. అనేసరికి మా నాన్నకు వాళ్ళ మతం గుర్తుకువచ్చి తన కన్నకూతురనే విషయాన్ని మరచిపోయాడు. ఇంకా గొంతును గట్టిగా పట్టుకొని నులిమాడు. అంతే నా ప్రాణం పోయింది. "అమ్మా !" అనే కేక నాగొంతులోనే ఆగిపోయింది" .

"అయ్యో తల్లీ ! మతాల మధ్య మానవత్వం నశించిపోయింది. ఈ కృష్ణమ్మ నిన్ను తల్లిలా కడుపులో పెట్టుకొని చల్లగా చూస్తుందిలే ! అంటూ ఆ చిట్టి ఎముకను పెద్ద ఎముకతో జతచేసి మళ్ళీనీళ్ళల్లోనే పెట్టాడు. ఇసుకలో కూరుకొని పోయిన వలనుపైకి లాగగానే ఎముకలన్నీ ఖాళీ అవటంతో వల తేలికగానే చేతిలోకి వచ్చింది.

ఓహో ! ఈ బొక్కలతో తనకున్న సంబంధం ఆ జన్మాంతం అనుకొన్నాడు. సైంటిస్టు చెప్పినట్లు అస్థికలు ఏడొందల ఏళ్ళపాటు ఇసుకలో నిలవ ఉండగలవనీ, వాటిలో ఆతడు అమర్చిన అదేదో ఏఐ అట. దాన్నే కృత్రిమమేథ అంటారనీ, దానిసాయంతో ఎముకలలోని సమాచారాన్ని తెలుసుకోవచ్చని చెప్పినవిషయం' గుర్తుకువచ్చి నదిలోని ఇసుకమేటలో ఆ ఎముకలనన్నింటినీ జాగ్రత్తగా ఉంచాడు. "ఓ సైంటిస్టూ ! నువ్వు చేసిన పరిశోధనను నేను ఫలించేటట్టు చేస్తాలే. ఎలాగబ్బా ! అని అనుకుంటున్నావా ! నువ్వు ఎముకలలో పెట్టిన చిప్పుబిళ్ళలు నాకు సమాజంలోని మనుషులు యొక్క చావుకు కారణాలు చెప్పి నాకు జ్ఞానోదయం కలిగించాయి. నేను సమాజం గురించి పట్టించుకునేట్టు చేసాయి. నీకు నమస్కారం సామీ !"

ఆ అస్థికలు పున్నయ్యకు వీడ్కోలు పలికినట్టనిపించింది. అమ్మయ్య మోచ్ఛం వచ్చిందనుకొని వలతో సహా ఒడ్డుమీదకు చేరుకొన్నాడు. తన వలే తనకున్న ఆస్తి అంటూ మురిపంగా వలను చూసుకుంటూ కృష్ణమ్మతల్లి నన్ను అనుగ్రహించింది. రేపటినుండి చేపలుపట్టాలి. లేకపోతే ఇక ఇల్లు గడవదు. రెండురోజులనుండి బొక్కల జీవితగాథలు వినటమే సరిపోయింది. పున్నయ్య మనసులో ఏదో ఆలోచనలు కలుగుతుంటే ఇల్లు చేరుకొన్నాడు.

ఇంటికి చేరుకొన్న పున్నయ్య గంభీరాన్ని చూసిన భార్య ప్రశ్నలేమి వేయకుండానే అన్నం కంచం ముందు పెట్టింది. పున్నయ్యకు అన్నం సహించలేదు. "ఏమయింది మావా !" భార్య అడుగుతున్నా పున్నయ్య సమాధానం చెప్పకుండానే పెరట్లో వేసి ఉన్న కుక్కిమంచం ఎక్కి ఏదో ఆలోచిస్తూ కలతనిద్రలోకి వెళ్ళాడు. పడుకున్నాడేగాని చుట్టుముసిరిన ఆలోచనలతో పున్నయ్యకు సరిగా నిద్రపట్టలేదు. నేనేదో చెయ్యాలి చెయ్యాలి నేనేదో అంటూ కలవరించాడు తెలతెలవారుతూ

పొద్దు పొడుస్తోంది. పున్నయ్యలో ఏవో జ్ఞానకాంతులు చోటుచేసుకున్నాయి.

తెల్లవారింది చద్దిబువ్వ కూడా తినబుద్ధి వేయలేదు. నిద్రలేచిన పున్నయ్య తనకు తెలిసిన వాళ్ళను కలవటం కోసం తొందరతొందరగా బయటకు వచ్చాడు. అందరితో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి వెంటనే రమ్మనమని చెప్పి కృష్ణ ఒడ్డుదగ్గరకు రమ్మన్నాడు. తోటివాళ్ళందరూ పున్నయ్య్ రెండురోజులుండి సరిగా కనపడటంలేదు. అతనికి ఏమయినా ఉపద్రవం వచ్చిందా అనే సందేహంతో తెలుసుకోవాలని బాగా వెలుగు రాకముందే కృష్ణ ఒడ్డుకు చేరుకొన్నారు.

“పున్నయ్యా ! నిన్న ఏడకుబోయావు ? రెండురోజులనుండి నీవు చేపలు పట్టకుండా ఒడ్డునే కూకొని ఏదో నీలో నీవే మాట్లాడుకుంటున్నావని ఎవరో చూసి చెప్పారు. నీకు జబ్బుగాని చేయలేదుకదా !”

“నాకు కాదు జబ్బు. సంఘానికే పెద్ద జబ్బు. దానికి మాములు డాక్టర్లు సరిపోరు.”

దానిలో కాస్తపెద్దవాడైన మత్స్యకారుడు ముందుకువచ్చి “మళ్ళీ కరోనాజబ్బు వచ్చిందట.! వైద్యుడి దగ్గరకు వెళ్ళబోయినావా ?”

“అదే చెప్పాలనుకుంటూ మిమ్మల్నందరినీ పిలిపించా పెద్దయ్యా ! కరోనాలాంటిది కాదులే. అది గాలివాటంగా వచ్చి గాలివాటంగా వెళ్ళిపోయింది. అది పవిత్రమైన జబ్బు. కాని నేనుచెప్పే జబ్బు అలాంటిదికాదు. భూమి మీద ఇంకా భయంకరమైంది. కొన్ని తరాల మనుష్యులను నిలువెల్లా చంపుతుండేరోగం. మనసుకు మాత్రమే కనపడే మాయరోగం.”

“పున్నయ్యకు ఏదో అయింది. ఇలా అర్థంకాని ప్రేలాపనలు చేస్తున్నాడు. పున్నయ్యకు వైద్యం చేయించాలి” అన్నాడు అందులో ఒక బెస్తవాడు.

పున్నయ్య వాళ్ళకు అర్థం అయేటట్లు చెప్పాలనుకొని “నేను చెప్పే మాటలు ఈ కృష్ణమ్మ సాక్షిగా స్వయంగా తెలుసుకొన్నవి. ఆ జబ్బు ఏమిటో ఎలా ఉంటుందో మీకు అర్థమయేటట్టు చెప్పటానికే ఇక్కడకు రమ్మని పిలిచా.”

“అయితే ఆ వింతజబ్బును గురించి చెప్పు. వినాలని ఉంది” అన్నారు.

అమ్మయ్య వీళ్ళు వింటానికి సిద్ధంగా ఉన్నారంటే, అంతా విన్న తరువాత వీళ్ళంతా నేను చెయ్యాలనుకొన్న పనిలో సాయపడతారనే బరోసా పున్నయ్యకు వచ్చింది.

"నేను రెండురోజులకితం నా వల చిక్కుకుపోతే దాన్ని తీసుకోవాలని నది లోపలికి వెళ్ళా. నా వలలో బొక్కలు చిక్కుకొన్నాయి. వాటిని పీకి పడేసి వలను తెచ్చుకుందామని ఎంతో ప్రయత్నించా. ఆ ఎముకలు మరింతగా గట్టిగా వలను పట్టుకున్నాయి. ఇక లాభంలేదనుకొని ఒక్కొక్క ఎముకను పీకుతుంటే అవి నీళ్ళతో శబ్దాలు చేయటం మొదలుపెట్టాయి".

"ఆఁ.. నీళ్ళకు చప్పుడు ఉండదా ఏమిటీ నీ పిచ్చిగాని" అన్నాడు అందులో ఒకడు.

"అది మాములు శబ్దంగాదు. దానిలో నుండి కొన్ని మాటలు నా మనసును తాకుతుంటే ఆశ్చర్యంగా చూసా".

"నిన్న అక్కవచ్చి మావకు ఏదో అయింది చూడండి అని మొత్తుకుంటుంటే ఏమిటోలే అక్క పరాచికంలే అనుకొన్నా. నిజంగానే పున్నయ్యకు పిచ్చిపట్టింది. లేకపోతే అడుగున నీళ్ళల్లో నుండి మాటలు వినపడటం ఏమిటీ వింత కాకపోతే."

"అవును వింతనే అది. ఒక సైంటిస్టు ఎముక అది. ప్రయోగాలుచేస్తూ నీళ్ళల్లో చిక్కుకుంది."

"ఏమిటో చాలా విచిత్రంగా ఉందే."

"అవును ! నేను మొదట్లో మీలాగానే అనుకొన్నా. కాని నా మాటలు వింటే మీరు నాకుమల్లే ఆ శబ్దాలుచేసే మాటల వెనక ఉన్న విషాదాలు తెలుస్తాయి"

"చెప్పు మాకు తెలుసుకోవాలని ఉంది". కాసేపు నిశ్శబ్దం ఆవరించింది. పున్నయ్య ఎముకలతో తన అనుభవాన్ని, తెలుసుకొన్న జీవిత కథలను, ఆ ఎముకలు తనకు తెలియజేసిన విధానం, తాను అర్థంచేసుకొన్న రీతిని వివరంగా కథలు కథలుగా చెప్పాడు. చెబుతున్నకొద్దీ తోటి బెస్తవాళ్ళలో ఉత్సుకత పెరిగింది. "ఇంకా, ఇంకా" అంటూ పద్దెనిమిది కథలను విన్నారు.

"ఇప్పుడు అర్థమయిందా మీకు? లోకానికి పట్టిన జబ్బు ఏమిటో ! మనం ఏదో చేయకపోతే కృష్ణమ్మ అంతా బొక్కలగుట్ట అవుతుంది." అన్నాడు.

"నువ్వు చెప్పిన గాథలన్నీ అందరి జీవితాలలో కాస్తోకూస్తో ఎరుకలోకి వచ్చినవే. మరి మనం ఏంచేద్దమంటావు ? వాళ్ళల్లో పెద్దాయన ముందుకు వచ్చి అడిగాడు.

పున్నయ్య తాను చెప్పిన జీవిత గాథలను విని కొట్టి పారేయకుండా మనం ఏమైనా చేద్దామా అని అడిగినందుకు పేరుపేరున తోటి బెస్త బంధువులను కౌగలించుకొని "నిన్నటినుండి భయంతో

నిద్రకూడా లేదు. మిమ్మల్ని చూసుకొని ధైర్యం వచ్చింది. డాక్టరు రోగుల శరీరాలకు మందులిస్తాడు. మానసిక వైద్యులు మనసుకు మందులిచ్చినా మొండి జబ్బులు తగ్గాలంటే చాలా రోజులు పడుతుంది. ఈ లోపల పుణ్యకాలం దాటిపోతుంది. సమాజం ఏమయిపోతుందో మనమే పూనుకొని చికిత్స చేయాలి"

"ఏమి చేద్దాం అంటావూ?"

వీళ్ళు ఇలా మాట్లాడుకుంటుంటే యువకులు, అటుగా వెడుతున్న కొంతమంది మనుష్యులు చుట్టూరా చేరారు.

"మనందరం ఐకమత్యంతో పూనుకొంటే సమాజాన్ని బాగుచేయొచ్చు. ఒకరోజు చేస్తే సరిపోదు. ప్రతిక్షణం మన ఆశయాన్ని మనసులో తలచుకుంటూ మనం, మన తరువాతి తరం వాళ్ళు అవసరమైన పనులు చేసుకుంటూ పోతే కొన్నాళ్ళకు సమాజం బాగవుతుంది." పున్నయ్య తన ఆలోచనలను వాళ్ళతో పంచుకొన్నాడు.

"అంత సులభమా !" అన్నారెవరో గుంపులో నుండి.

"సమాజంలో మనుషులు చేపల్లాగా చిక్కినట్టే చిక్కి దొరకకుండా పోతారు. వాళ్ళల్లో పెద్దచేపలే ఎక్కువ. వాటిని గట్టి వలవేసి ఒడుపుగా పట్టాలి. మనం సమాజంలోని అన్ని జబ్బులకు సమూహాలుగా వెళ్ళి చికిత్స చేద్దాం. దానికోసం వారంలో ఒకరోజు మనం చేపలను పట్టటం మాని నీళ్ళల్లోని ఎముకలలో ఇంకా ఉన్న రోగాలను తెలుసుకుంటూ ఊళ్ళో జనాలకు చికిత్స చేయాలి".

"చికిత్స ఎలా చెయ్యాలి. అది కూడా నువ్వే చెప్పు". వాళ్ళల్లో నుండి ఒక పెద్దాయన అన్నాడు.

"రాజకీయ నాయకులకు ప్రజలు తమ ఓటుతో బుద్ధిచెప్పాలి. అలాంటి వ్యక్తులు మన చుట్టూరానే ఉన్నారు. మనింట్లో కూడా చికిత్స మొదలుపెట్టాలి. కుటుంబాలలోని తల్లీదండ్రులను గౌరవించటం. కష్టపడి పనులను చేసుకోవటం, అప్పచెల్లెల్ల మనసులను గెలుచుకోవటానికి చేయవలసిన పనులను చెప్పుకుందాం."

"అవును. స్కూళ్ళల్లో ఇవన్నీ నేర్పించటం లేదు. పైపెచ్చు గంజాయి తాగుడు వంటివి నేర్చుకుంటుంటే గురువులు తమకున్న లాబీలతో చూసిచూడకుండా ఉంటున్నారు. అందుకే అలా చదువులన్నీ చట్టుబండలు అవటమే అన్ని అనర్థాలకు కారణం." వారిలో వయసులో పెద్దాయన అందుకున్నాడు.

"సమాజం బాగుంటే మన యింటి ఆడబిడ్డలు కూడా భారతంలో మన కులదేవతగా భావించే సత్యవతి లాగా చేపలు పట్టి జీవనాధారం చేసుకుంటారుగా." అందులో కాస్త పట్టణనాగరికతను గ్రహించిన మధ్య వయస్కుడు తన ఆలోచనను బయటపెట్టాడు.

"నిజమే ! ఆనాడు భారతం రాసిన వ్యాసుని తండ్రి పరాశరుడంట. మన మత్స్యకంఠిని లంకలోకి తీసుకెళ్లి గర్భాన్ని కలిగించడంతో ఇలా మనింటి ఆడపిల్లలు అలా ఇళ్ళల్లోనే మగ్గిపోతున్నారు. ఆడపిల్లలకు అన్ని విద్యలూ నేర్పించబట్టే కదా చాలా మంది ఆడపిల్లలు నీళ్ళల్లో చేపల్లాగా ఈదగలగటం టి.వి లలో చూసాం. ఆడపిల్లలు అనగానే వాళ్లకు పెళ్ళిళ్లు, పేరంటాలు అంటూ చిన్నప్పుడే వింత ఊహలను కల్పిస్తాం. ఇళ్ళల్లో ఇవన్నీ విన్న అబ్బాయిలు పక్కింటి ఆడపిల్లలను వల్లో వేసుకోవటం నేర్చుకుంటున్నారు. ఉద్యోగం సద్యోగం లేకుండా మగాడంటూ కట్నాలు తీసుకోవటం, వాళ్ళు పెళ్ళాలను చితకబాదటం, విడాకులు మళ్ళీ పెళ్ళిళ్ళు ఇవేగా సమాజంలో తరతరాలుగా జరుగుతున్న చరిత్ర."

"అవును దీన్ని తిరగరాయాలి" అన్నాడొక యువకుడైన మత్స్యకారుడు.

"యువతను తిట్టుకుంటూ కూర్చోవటం కంటే వాళ్ళు అలా తయారవటానికి కారకులు ఎవరనీ, రాజకీయనాయకులు ఉపాధిని ఎందుకు చూపించటంలేదనీ, యువతను పెడదారి పట్టిస్తున్న దాని వెనకాల ఉన్న ప్రలోభాలేమిటి, ప్రభుత్వం ఉన్న ఎందుకు పట్టించుకోవటం లేదు, అనీ అన్ని విషయాలను మనం తలొక దారిలో పరిశీలించాలి. వారానికి ఒకసారి ఈ నీటి ఒడ్డున కలుసుకొని కర్తవ్యాలను మాట్లాడుకుందాం. తరతరాలుగా పాడైపోయిన సమాజాన్ని ఒక్కరోజులో బాగుచేయలేమని నిరాశ చెందవద్దు. మనం చిత్తశుద్ధితో కాళ్ళకు చేతులకు పనిచెప్పి ఐకమత్యంతో ఆశయాన్ని సాధిద్దాం." చెప్పటం ముగించిన పున్నయ్యకు మనసంతా నిండుగా ధైర్యంగా ఉంది. నిన్నటికీ ఈ రోజుకి ఎంత తేడా అనుకొన్నాడు. సూర్యుడు ఎక్కువ కాంతితో నెత్తిమీదకు వస్తుంటే అందరి మెదళ్లు ఉత్తేజితం అయ్యాయి.

ఇంతలో గుంపులో నుండి ఒకతను నడుస్తున్న అస్తిపంజరంలా ముందుకువచ్చి అన్నలారా! మీరంతా నీళ్ళల్లోని ఎముకలు చెప్పిన జీవితాలను గురించి ఆలోచిస్తున్నారు. బతికుండగానే అస్తిపంజరాలుగా భూమిమీద కనపడే మా జీవితాలను పట్టించుకోండి. రెక్కలుముక్కలు చేసుకొని వ్యవసాయం చేసుకొన్నా కడుపులు నిండని మా పరిస్థితిని కాస్త పట్టించుకోండయ్యా లేకపోతే మేము బతికుండగానే బొక్కలయిపోతాం".

ఆ మాటలు విన్న పున్నయ్య ఓ రైతుసోదరుడా ! నువ్వులేనిది మా పొట్టలు ఎలా నిండుతాయి నీకష్టం మా కష్టం కాదా. విని తీరాల్సిందే.

❊ ❊ ❊

ఇరవయ్యవ కథ

"మా గోడు వింటానికి ఇన్నాళ్ళకు మిమ్మల్ని ఆ అమరేశ్వరుడు పంపించాడనుకొంటా. ఈ కృష్ణ ఒడ్డున నల్లరేగడి భూములున్నాయి. మూడుకాలాలు పంట పండించవచ్చు వరి. మొక్కజొన్న మినుము, కూరగాయలు వంటి పంటలువేస్తాం. బాగానే పండుతాయి. ఎప్పుడన్నా తుఫానులు వస్తే పండిన పంట నేలపాలవుతుంది. నీటి వరదకు అడ్డుకట్టలు వేయమంటే ఎవరూ పట్టించుకోరు."

"అయ్యో ! పంట నీటి పాలయితే మా కడుపులేలా నిండుతాయి."

"కళ్ళల్లో వత్తులేసుకొని కాపుకాసుకొన్నా కూడా కళ్ళాలమీది పంటను అమ్ముదామంటే దళారీలు అందరూ ఒక్కటై తక్కువ గిట్టుబాటు ధరను నిర్ణయిస్తాయి. పొరుగూళ్ళకు పోయి అమ్ముకోలేక పంటను వాళ్ళచేతులకే అందిస్తాం. కష్టం మాది. లాభం వాళ్ళది."

"అదేమిటీ ? రైతుభరోసాల ద్వారా కొనుక్కుంటామన్నదిగా పభుత్వం."

"అన్నీ వట్టిమాటలే. దళారీలు పడనిస్తారా. వాళ్ళను దాటుకొని రైతుబరోసాలో ఇచ్చినా తేమ ఉందని, విత్తనం నాణ్యమైనది కాదని వంకలుపెడతారు. తక్కువరేటును నిర్ణయిస్తారు. దళారుల రేటువేరు. మాకు నిర్ణయించే రేటు వేరు. అట్టా చూసినా మాకు నష్టమే వస్తుంది.

"ప్రకృతిని తిట్టుకుంటూ ఏమీ చేయలేముగాని మిగిలిన పంట విషయంలో ఈ అవినీతి తిమింగలాలను పట్టుకొనే వాళ్ళేలేరా. అయినా రైతన్నా ! నువ్వు మంచివిత్తనాలను వేస్తే ఇంకాస్త సొమ్ము గిట్టుబాటయ్యేదిగా" పున్నయ్య సలహా ఇచ్చాడు.

"మాలాంటి సన్నకారు రైతులకు మంచి విత్తనాలు ఇవ్వరయ్యా. వ్యాపారస్తులు కూడా మాకు పనికిరాని కల్తీ విత్తనాలను తక్కువధర అంటూ అమ్ముతారు. వాటిల్లో చాలా గింజలు మొలకెత్తవు. పొలంలో ఎక్కువ గింజలు వేసినా కొన్నే మొలుస్తాయి. అందుకే పంట దిగుబడి తగ్గుతుంది".

"పంట రావాలంటే ఎరువులు వెయ్యాలంటకదా". పున్నయ్య అసలు నిజాలను రాబట్టాలని ప్రయత్నించాడు.

"నువ్వు చెప్పింది కరెక్టేనయ్యా ! పాడి ఎరువులు డబ్బున్న ఊరి పెత్తందార్లే కొనుక్కుపోతారు. ఇక మేము మందుల ఎరువులనే వాడాలి. వాటిలో మళ్ళీ కల్తీ. మొక్కలు దెబ్బతింటుంటాయి. ఏమని చెప్పాలి మా కష్టాలు. గ్రామపెద్దలు రాజకీయనాయకుల తొత్తులు. ఎలచ్చనులు వస్తున్నాయంటే మా పొలాల దగ్గర కొచ్చి చేలమీద నిలబడి మాకోసమే వాళ్ళు రాజకీయాలలోకి వచ్చినట్లు ఉపన్యాసాలు ఇస్తారు."

"ఇప్పుడు అర్థమయింది నువ్వు అస్థిపంజరంలా ఎందుకు తయారయ్యావో?"

"ఏమి చెప్పను నేస్తమా ! కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ మందులు. ఇక పొలం ఏం పండుతుంది. చచ్చీచెడి కష్టపడి పంటను పండిస్తే ఊళ్ళో ఉన్న దళారీలు చెప్పిన ధరకే వాళ్ళకే అమ్మాలి. లేకపోతే పంటనే లేకుండచేసే దౌర్చన్యాన్ని ఎదురుకోవాలి. పంట దిగుబడికోసం ముందస్తుగా తెచ్చిన అప్పులు తీరక, వడ్డీలు కట్టలేక నా వాళ్ళను కడసారి చూసుకొని క్షమించమని అడిగి ఎప్పటికప్పుడు ఆత్మహత్యకు పాలుపడ్డాలనిపిస్తుంది. కాని నా ఆత్మ మాత్రం అలాంటి కల్తీపనులుచేసే వాళ్ళను ఉరికంబం ఎక్కించాలని కోరుకుంటోంది. చేతనయితే రైతులకోసం ఏమన్నా చెయ్యి అన్నా ! నా బాధ తీరుతుంది. వచ్చే జన్మంటూ ఉంటే నీ కడుపున పుడతా." చెప్పుతుంటే రైతుకు కన్నీళ్ళు బొటబొట వచ్చాయి.

"అంతా దగా దోపిడీ. రైతు కష్టాన్ని ముందుగా పట్టించుకోవాలి." కొందరు యువకులు ముందుకు వచ్చారు. "కల్తీలను, వాటి వెనకాల ఉన్న అవినీతి పరులను రోడ్డుమీదకు ఈడ్చి రైతన్నలను కాపాడుకోవాలి. రైతులకు అండగా మేముంటాం. ప్రతి పూటా ఇంట్లో అమ్మ అన్నంపెడుతుంటే, హాయిగా తింటున్నాము కాని దానివెనకాల ఇంత ఘోష ఉందని ఈ రోజే అర్థం అయింది. ఏదో మనుషులు గుంపుగా గుమికూడి ఉంటే రాజకీయనాయకుడు వచ్చాడేమోనని చూడటానికి వచ్చాం. కాని ఇది కష్టాల కొలుముల కుల సమూహం అని అర్థం అయింది. మా బాధ్యత పెరిగింది. మా మెదళ్ళకు పనిచెబుతాం. మీ ఎముకలకు కొత్త బలాన్నిస్తాం" అంటూ అక్కడున్న యువత ప్రమాణాలు చేసారు.

"ఈరోజు మా బెస్తలకేకాదు రైతులకు మంచిరోజు." పున్నయ్యకు కడుపునిండినంత పనయి సంతోషంతో" భళిరా ! భళీ అన్నాడు. ఇంతలో నూతిలో నుండి వచ్చిన ఒక గొంతుక ముందుకు వచ్చింది.

ఇరవైఒకటవ కథ

"అయ్యా ! మీరు మా గురించి పట్టించుకోవాలయ్యా. బక్కచిక్కిన కూలీలం. దగ్గరలో ఉన్న ఇసుక బట్టీలలో పనిచేస్తాం. తెల్లారక మునుపే చిమ్మ చీకట్లోనే మా పని. ఇసుక లారీలను నింపటం. తవ్వి పోస్తుంటే కృష్ణమ్మ కడుపును కోస్తున్నట్టే ఉంటుంది. తెల్లవారక మునుపే నిద్రకళ్ళతో పనికి వస్తాం. ఒక్కొక్కప్పుడు ఇసుకలో సగం వరకు కూరుకుపోతాం."

పున్నయ్య ఆ మాటలు వినపడ్డవైపు పరీక్షగా చూసాడు. బక్కప్రాణి. ఎముకల గూడులా ఉన్నాడు. నీళ్ళల్లోనే కాదు భూమ్మీద ఇసుకలో కూడా కూరుకుపోయే జీవులున్నారన్నమాట. ఇతని కష్టం తెలుసుకోవాలి. ఇలాంటివాళ్ళ సమస్యలను పట్టించుకోవాలి. గట్టి నిర్ణయంతో పున్నయ్య ఆ కూలి దగ్గరకు వెళ్ళి భుజం తట్టాడు.

"అదేమిటీ చీకట్లలో పనిచేయటం ఎందుకు? కాస్త పొద్దుపొడిచిన తర్వాత వెళ్ళవచ్చుగా."

"అయ్యో ! తెల్లవారితే దొంగలారీలు కళ్ళుపడతాయని భయం. ఒకవేళ ఎవరన్నా వచ్చి అడ్డుపడ్డా వాళ్ళకు తుణమో పణమో అందిస్తే చూసీచూడక వదిలేస్తారని" అన్నాడు.

"అదేమిటీ. పభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానందిగా భయమెందుకు ఈ చీకటిపనులెందుకు."

"అయ్యా సామి ! అవి పైకి వినపడేమాటలు. జరిగేదంతా ఆ మాటల వెనక ఉన్నగుట్టే."

"సరే ఇంతకీ నీ బాధ ఏమిటీ కూలన్నా !" పున్నయ్య కుతూహలంగా అడిగాడు.

"చచ్చీచెడి ఇసుకతో లారీలను నింపుతామా. కూలీ ఒక పట్టాన ఇవ్వరు. వాళ్ళచుట్టూ తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోతాయి. ఇల్లు గడవాలి కదా. ఇంట్లో ఆడవాళ్ళు కూలి డబ్బులు తీసుకెళ్ళకపోతే 'లారీ ఓనరును ఏ రోజుకూలి ఆ రోజే ఇవ్వాలని గట్టిగా అడగలేవా? ఇంట్లో మాత్రం మమ్మల్ని నోరుపెట్టుకొని అరవగలవు' అని ఇంట్లోవాళ్ల వాతలు. ఎలా జీవించాలో తెలియదు.

"వెట్టిచాకిరీ అంటే ఇదే." గుంపులో నుండి మాటలు వినపడుతున్నాయి.

పున్నయ్య ఆతని స్నేహితులు "ఈ వెట్టిచాకిరీ గురించి పట్టించుకోవాలి. వీడిలాంటి కష్టాన్ని తీర్చే మార్గం ఆలోచించాలి" అందరూ ఒక్క గొంతుకతో నినాదం చేసారు.

"ఇసుక తవ్వి, లారీలలో లోడుచేసేసరికి వొళ్ళు హూనం అవుతుందాయమరి. దానికి తోడు ఇంట్లో వాళ్ళమాటలు. విసిగి దగ్గరలోని సారాకొట్టును చేరుకోవటం, అక్కడ అమురుత్తంలాగా

వాళ్ళు ఖాతాకి మాకు సారా పోస్తారు.” బక్కచిక్కిన కూలీ అంటుండగా.

ఒకడు వచ్చి “అది అమృతం కాదురా. మన ప్రాణాలు తీసే విషం. నన్ను చూస్తే అర్థంకావటంలే ! అంటూ ఒక ఎండు పుల్లలకు చొక్కా తొడిగినట్లున్న ఒక మనిషి పున్నయ్య ముందుకు వచ్చాడు.

“ఏంటి తమ్ముడూ ఇలా బక్కచిక్కి ఉన్నావు ! నువ్వు ఏం పనిచేస్తుంటావు ?

“అన్నా ! నేను బలహీనుడిని. ఒకప్పుడు కార్కానాలో పని చేసి చేసి ఇలా బొక్కల గూడుగా మారా. నా బతుకును మీ ముందు వెళ్లబుచ్చుకుంటే కాస్త సాంతన కలుగుతుంది.

* * *

ఇరవైరెండవ కథ

“అన్నలారా ! నేను రోజూ చేసేపని నన్ను ఇలాగా తాగేట్టు చేసింది. రోజువారి వేతనంతో మా కార్మికులకు పని అప్పగిస్తారు. పెద్దపెద్దయంత్రాలను మా బలంకొద్దీ తిప్పాలి. ఒకచోట నుండి ఒకచోటుకు మార్చాలి. వేడి బాయిలరు దగ్గర నిలబడి బొగ్గును వేస్తుండాలి. సూపరువైజరు మా చుట్టుచుట్టూ తిరుగుతుంటాడు. మూత్రానికి వెళ్ళినా ఇంతసేపా అని అరుస్తాడు. మా బలాన్ని పీల్చిపిప్పిచేస్తూ మా చేత పని చేయిస్తారు. పని మానేస్తే పూట గడవటం కష్టం.

“అంతకష్టమనుకొన్న పని మానేయవచ్చుకదా” పున్నయ్య జాలిపడ్డాడు.

“అన్నా !. మాకు పొలంలేదు. కిరాయి ఇల్లు. ఎక్కడికి వెళ్లి బతకాలో తెలీదు. మా నాయన తరంనుంచీ ఇక్కడకు వచ్చి ఉంటున్నాం. పరిశ్రమలో పదిగంటలు మా చేత పనిచేయిస్తారు. ‘పనిముట్టును కిందపడేసావు వంకరపోయింది, బాగుచేయించాలి’ అంటూ ఇచ్చే కూలిడబ్బులలో కోతపెడతారు.

“అయ్యో !” ఎంతకష్టమైన పని చేస్తున్నావు అంటూ వారిలో కొంతమంది సానుభూతితో పలికారు.

“పని సరిగాచేయలేదంటూ వందరూపాయిల పనికి పాతికచేతిలో పెడతారు. వాళ్ళను కొట్టాలన్నంత కసి వస్తుంది. కాని ఏమీ చేయలేని నిస్సహాయత. కార్ఖానా నుండి ఇంటికి వెళ్ళే దారిలోనే గుడిలాంటి సారాకొట్టువాళ్ళు అడగకుండానే మా బాధలను తీర్చే తీర్థంలాంటి మందు

పోస్తారు. సారి అన్నా ! తీర్థం కాదులే. గళాసులలో సారా పోస్తారు. జేబులో ఉన్న ఆ రోజు పనికి ఇచ్చిన డబ్బులు కర్పూరంలా కరిగిపోతాయి."

"డబ్బులే కాదురా నీ శక్తి కరిగిపోతోందని గ్రహించాలిరా !" పున్నయ్య హెచ్చుస్వరంతో అన్నాడు.

"నిజమే అన్నా ! నా వళ్ళునొప్పులు ఎలా తగ్గుతాయి. కల్తీసారా తాగేసరికి కడుపులో మంట వస్తుంటది. కాని తప్పదు. ఒకొక్కప్పుడు ఇంటికి నడిచి వెళ్ళలేక రోడ్డుమీదనే పడిపోతుంటా ఎవరో ఒకరు నన్ను గుర్తుపట్టి ఇంటికి చేరుస్తుంటారు. ఇంటికి తూలుకుంటూ వెడితే భార్య అరుస్తుందని బయట అరుగుమీదనే చలిలో పడుకుంటా. తెల్లార్లు దగ్గు, తుమ్ములు. మర్నాడు డ్యూటికి వెళ్ళలేను ఇంటిదగ్గర నానాతిట్లు తింటుంటే మళ్ళీ తాగకూడదని చచ్చిన మా అమ్మమీద ఒట్టెట్టుకుంటా. ఏమి పయోజనం. రోజూ ఇదే వరస. ఈ రోజు కార్కానాకు వేళయిందని తొందరతొందరగా ఒడ్డుతోవలో నుండి వెడుతుంటే మీ మాటలు వినపడి నన్ను ముందుకు కదలనీయలేదు."

"పున్నయ్యమావా ! ఇలా ఈ కార్మికుడి మాటలు వింటంటే తప్పుఎవరిదని? అనే సందేహం వస్తోంది. శక్తికిమించి ఎక్కువ పనిగంటల పని చేయించే యజమానిదా? సారా తాగే ఇతనిదా? కల్తీసారా అమ్మే వాడిదా? తేల్చుకోవాలి." అన్నాడు ఆవేశంతో ఒక యువకుడు.

"ఆవేశంకాదు ఇప్పుడుకాదు అబ్బాయి ! ఆలోచనలను పనుల రూపంలో పెట్టేటప్పుడు ఈ చురుకు కావాలి అన్నాడు. అందరం తలుచుకుంటే ఈ అవినీతిని అంతం చేయవచ్చు. మనం రోజువారి చేపలుపట్టుకొని అన్నం వేళకు ఇల్లు చేరుకుంటాంకదా. మద్దానం పడుకోకుండా మనం కలిసి రోజుకొక సమస్యను పరిష్కరించటానికి ముందుకు నడుద్దాం" "మేమంతా మీ వెంటే" యువత చప్పట్లు కొట్టింది. అందరూ కలిసి లోకాన్ని జయించి ప్రజలను కాపాడగలం అనే విశ్వాసంతో తమ రోజువారి పనులకోసం దారిపట్టారు.

ఆ రోజు పున్నయ్య కృష్ణమ్మ తల్లికి దండంపెట్టుకొని తనవలను విసిరాడు. ఈ సారికూడా వలబరువెక్కింది. దానినిండా చేపలు. పెద్దపెద్దచేపలు. రెండురోజులవారా ఎక్కువచేపలు పట్టాలనుకొన్నాడు. వాటిని అమ్మి డబ్బు ఇంటికి తీసుకొనివెళ్ళి భార్యకు ఇవ్వాలనిపించింది పున్నయ్యకు. దారిలో తన భార్యకు రంగు గాజులు కొనుక్కొని వెడితే దాని కోపం తగ్గుతుంది. పాపం రెండురోజుల నుండి మాట్లాడకపోయేసరికి బిక్కచచ్చిపోతోంది. ఎన్ని బాధలు ఉన్నా ఇల్లాలి మొహం గుర్తుకువస్తే మనసుకు శాంతి కలుగుతుంది.

పున్నయ్య తడిబట్టలు ఆరుతాయని ఒడ్డునే కూర్చొన్నాడు. సాయంకాలవుతోందని

పున్నయ్యవాళ్ళసంఘం ఒడ్డుకు చేరుకొంది. "పున్నయ్య మావా ! ఇప్పుడే మీ ఇంటికివెళ్ళి వస్తున్నం మావ రాలేదని అత్తమ్మ చెబితే నీకోసం ఇక్కడికి వచ్చాము ఏమిటి మావా ! చేపలుపట్టేసరికి ఆలస్యమయిందా ! ఎలాగైనా గొప్పవాడివి మావా ! నీదే పట్టుదల అంటే నిన్ను చూసి నేర్చుకోవాలి." అన్నాడు అందులో ఒక కుర్రాడు.

"పట్టుదల కాదురా నా తలకాయి. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. మన పనులు ఎంతవరకూ వచ్చాయిరా. ఎముకల కథలవల్ల మనుష్యుల సమస్యలను పట్టించుకోవాలని అనుకొన్నాం కదా. పట్టించుకొని ఊరుకుంటే సరిపోదు. నోటితో మాటలు వల్లించటం కాదు. మన ఆలోచనలు నీటిరాతలు కాకూడదు. ఇంకా అన్యాయం జరగకుండా లోకాన్ని ప్రక్షాళన చెయ్యాలని తపన నాలో పెరిగిపోతోంది"

"అందుకేగా మేము ఇక్కడికి వచ్చింది.. వారిలో కొంతమంది తాము ఫలానాచోటికి వెళ్లామనీ, విషయాలు కనుక్కొన్నామని, వాటిని చర్చించాలని వచ్చాం." అన్నారు.

"అస్థిపంజరాల వంటి వారి జీవనగాథలు, ఈ అస్థికల ఆత్మకథలు కంచికికాదు, సమాజంలో మనల్ని బాధితుల దగ్గరకు వెళ్ళి కర్తవ్యాలకై నడుంకట్టుకొనేటట్టు చేస్తున్నాయి." చురుకైన బాధ్యతతో పున్నయ్య ముందుకు నడుస్తున్నాడు. మేమందరం నీతోపాటే పున్నయ్యమావా ! ఈ కృష్ణమ్మతల్లి సాక్షిగా, మన వలలమీద ప్రమాణంచేస్తున్నాం".

"ఇదే నేను కోరుకొంది. తోటి మానవులకు సమస్యలు లేకుండా నిత్యం ప్రయత్నం చేయటమే ఆ సైంటిస్టు ఎముకకు మనం అందిచ్చే నివాళి. మంచిది మిత్రులారా ! ఇక మనం చెయ్యాలనుకొన్న పనులకు బయలుదేరుదాం" ఆత్మీయంగా వాళ్ళభుజాల మీద చెయ్యివేసాడు పున్నయ్య.

"శరీరం ఉన్నప్పటి నాటి బాధలు మరిచేటట్టుగా ఆ అస్థికలను చల్లని నీ ఒడిలోనే శాశ్వతంగా దాచుకో తల్లీ !" అంటూ కృష్ణానదికి నమస్కారంచేసాడు.

బౌద్ధారామం నుండి

"బుద్ధం శరణం గచ్ఛామి ధర్మం శరణం గచ్ఛామి"
"సంఘం శరణం గచ్ఛామి" ప్రతిధ్వనిస్తూ గాలి రివ్వున వీస్తోంది.

అమరావతిలోని కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతూ గలగలా ముందుకు సాగుతూ "కథలు కంచికకు కాదు. సమాజాన్ని బాగుచెయ్యటానికి పూనుకోవాలి. ఇలా కొన్నాళ్ళు నిరంతరంగా కొనసాగాలి." అని హెచ్చరించినట్టనిపించింది.



రచయిత : **డా. జంధ్యాల కనకదుర్గ**

పుట్టినతేది : 10.04.1953

తల్లిదండ్రులు : శ్రీ జంధ్యాల కుమారస్వామి, శ్రీమతి లక్ష్మీప్రసన్నమ్మ

భర్త : శ్రీ ఎమ్.వి.శాస్త్రి

విద్యార్హతలు :

1. ఎమ్.ఏ – ఆంధ్రా విశ్వవిద్యాలయం (బంగారుపతకం) 1974
2. ఎమ్.ఫిల్ – కాకతీయ విశ్వవిద్యాలయం (రెండు బంగారు పతకాలు) 1990
3. పి.ఎచ్.డి – కాకతీయ విశ్వవిద్యాలయం 1994

వృత్తి అనుభవం : 34 సం.లు – లెక్చరర్, రీడర్ (అసోసియేట్ ప్రొఫెసర్), ప్రిన్సిపాల్ – సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, ఖమ్మంజిల్లా.

సత్కారం :

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం, 1994 మరియు ఇతర సంస్థల పురస్కారాలు
- ఉత్తమ గ్రంథం రచయిత్రి సాహితీ పురస్కారం2025 – సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం, తెలంగాణ
- శ్రీ పోపూరి సుబ్బారావు స్మారక సత్కారం–2022 : శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, తిరుపతి.
- ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ :1996, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.
- BOLT అవార్డు ఆఫ్ ఎయిర్ ఇండియా

పరిశోధనలు :

- యు.జి.సి. రీసెర్చ్ ఫెలోషిప్ అవార్డు – 1975
- యు.జి.సి.మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు–సింగరేణి గని కార్మిక జీవన చిత్రణ 1998.
- యు.జి.సి.మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు– ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు – 2004

ప్రచురణలు : 1. కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక **2.** తెలుగు స్వతంత్ర కథాకావ్యాలలో మహిళా జీవన చిత్రణ **3.** తెలుగు సాహిత్యం–మహిళా చైతన్య ప్రస్థానం **4.** సింగరేణి సాహిత్యం–శ్రమ శక్తుల జీవనం **5.** సాహితీ సుమాలు **6.** సాహిత్యం–సత్త్వదర్శిని **7.** స్వతంత్రత నుండి... స్వాతంత్ర్యానికి – (తెలుగులో స్త్రీల సాహిత్యం 1900–1947) **8.** గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి **9.** హృదయనేత్రి – సహృదయ సంధాత్రి **10.** ఆకాశమే.. హద్దుగా **11.** అమరావతిలో అష్టికలు–కథావాహిని.

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన విమర్శ వ్యాసాలు 60 పైగా

అభిరుచి – నిరంతర తెలుగు సాహిత్యాధ్యయనం – పరిశోధన

ISBN: 978-93-5916-025-2